భారత శక్తి
VOICE OF INDIAN
Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal
సంపుటి : 20 | సంచిక : 306 | గురువారం,మే 28 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00

## ఈసీ కి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అధికారాలను సమర్ధించిన సుప్రీం కోర్ట్




**న్యూ ఢిల్లీ(భారత శక్తి)** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) చేపట్టేందుకు కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీ) ఉన్న అధికారాలను సుప్రీంకోర్టు సమర్థించింది. సాధారణ ఓటర్ల జాబితా సవరణ కంటే ఎస్ఐఆర్ భిన్నంగా ఉన్నంత మాత్రాన దీనిని కొట్టివేయలేమని, ఇది పూర్తిగా రాజ్యాంగబద్ధమైనది, చట్టబద్ధమైనదని కోర్టు స్పష్టం చేసింది. ఈ ప్రక్రియ స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికలు నిర్వహించాలనే రాజ్యాంగ లక్ష్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్తుందని


2లో..



# పల్లె పల్లెకూ డిజిటల్' వెలుగులు!




- తెలంగాణలో 'టీ-ఫైబర్' ప్రాజెక్టుకు సరికొత్త రూపం
- కేంద్ర మంత్రి సింధియాతో సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్ బాబు కీలక భేటీ.
- రూ. కోట్లతో సవరించిన 'భారత్‌నెట్' కార్యాచరణ.. త్వరలోనే ఒప్పందం
- 'రింగ్ ఆర్కిటెక్చర్'తో అంతరాయం లేని హైస్పీడ్ ఇంటర్నెట్
- తొలి విడతగా మూడు ఉమ్మడి జిల్లాల్లోని 3,089 గ్రామాల్లో పునరుద్ధరణ పనులు వేగవంతం




**హైదరాబాద్, మే 27, భారత శక్తి :**తెలంగాణ గ్రామీణ ప్రాంతాల రూపురేఖలను మార్చేస్తూ, పల్లె పల్లెకూ నిరంతరాయంగా హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ సౌకర్యాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక అడుగులు వేసింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని సామాన్యుడికి సైతం చేరువ చేయడమే లక్ష్యంగా 'టీ-ఫైబర్' (తెలంగాణ ఫైబర్ గ్రిడ్) ప్రాజెక్టును సరికొత్తగా రూపాంతరం చెందించనున్నారు. సవరించిన భారత్‌నెట్ కార్యక్రమం (ఏబీపీ) కింద ఈ ప్రాజెక్టును సమర్థవంతంగా పట్టాలెక్కించడంపై కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు సచివాలయం నుంచి ఉన్నత స్థాయి దృశ్య శ్రవణ సమావేశం (వీడియో కాన్ఫరెన్స్) నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పురోగతి, కేంద్రం నుంచి రావాల్సిన నిధుల విడుదల, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు.

### త్వరలోనే ఒప్పందం.. నిధుల విడుదలపై చర్చ

రాష్ట్రంలో సవరించిన భారత్‌నెట్ కార్యక్రమం ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగడానికి వీలుగా ముఖ్యమంత్రి పలు కీలక ప్రతిపాదనలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రాజెక్టుకు సంబంధించిన ఒప్పందాన్ని (MoU) వీలైనంత త్వరగా పూర్తి చేయాలని, కేంద్రం నుంచి పెండింగ్‌లో ఉన్న నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. దీంతో పాటు, మండలం నుంచి గ్రామ పంచాయతీల వరకు ఉన్న రింగ్ నెట్‌వర్క్ ఆస్తులను 'డిజిటల్ భారత్ నిధి' (గతంలో యూఎస్ఓఎఫ్) కి బదిలీ చేసే ప్రక్రియపై ఒక స్పష్టమైన విధానాన్ని

2లో..

## రోజూ నీరు ఎక్కువ తాగండి



**న్యూఢిల్లీ,(భారత శక్తి)** శంలోని చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు కీలక సూచనలు చేశారు. తీవ్రమైన వేడి పరిస్థితుల్లో పలు జాగ్రత్తలు సూచించారు. నిత్యం తగినంత నీరు తాగాలని అన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదిక ద్వారా ఆయన ప్రజలకు జాగ్రత్తలు చెప్పారు. వీలైనంత వరకు మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లవద్దని సూచించారు. అతి తీవ్రమైన వేడి నుంచి ప్రజలు తమను తాము కాపాడుకోవాలని అన్నారు. వృద్ధులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని తెలిపారు. సాధ్యమైనంత వరకు ఇతరులకు సహాయం చేయాలని, ఇళ్లు, దుకాణాల వద్ద ఆరుబయట పక్షులు, జంతువుల కోసం నీటిని ఉంచాలని కోరారు. ఎండ కారణంగా ఎవరికైనా ఏమైనా అయితే ఏం జాగ్రత్తలు తీసుకోవాలో సూచనలు చేశారు. తల తిరగడం, వికారం, అలసట వంటి వడదెబ్బ లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని కోరారు. చుట్టూ ఉన్నవారిలో ఎవరైనా అకస్మాత్తుగా స్పృహ కోల్పోయినట్లు అనిపించినా, నీరసించినా వెంటనే వారిని నీడ ఉన్న ప్రదేశానికి తీసుకువెళ్లాలని అన్నారు. ఇలాంటి సమయాల్లో అప్రమత్తంగా వ్యవహరించడం వల్ల ఒక ప్రాణాన్ని కాపాడుతామని పేర్కొన్నారు. అధిక ఉష్ణోగ్రతల ప్రభావం పిల్లలు, వృద్ధులు, రైతులు, కార్మికులపై ఎక్కువగా ఉంటోందని అన్నారు. రాబోయే రోజుల్లో ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతంలో తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. విదర్భ, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, హర్యానా, రాజస్థాన్, బీహార్, ఒడిశా, తెలంగాణ, కోస్తా, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో తీవ్ర వడగాల్పులు వీస్తున్నాయి. మే 29 నుంచి ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే కురిసే అవకాశం ఉందని తెలిపింది.

### కర్ణాటకలో నాయకత్వ మార్పు దిశగా

## వేగంగా అడుగులు

**- మే 30న కొత్త సీఎం ప్రమాణ స్వీకారం**





**బెంగుళూర్(భారత శక్తి)** కర్ణాటకలో నాయకత్వ మార్పు దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. మంగళవారం దిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీతో కర్ణాటక సీఎం సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సమావేశమైన తర్వాత పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. సీఎం సిద్దరామయ్య గురువారం రాజీనామా చేస్తారని విస్తృత ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో సిద్దరామయ్య గురువారం

2లో..

### పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి

**- కేటీఆర్**




**హైదరాబాద్ (భారత శక్తి)**రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలు,ఈదురు గాలుల వల్ల మార్కెట్ యార్డుల్లో ఆరబోసిన వరి, మొక్కజొన్న వంటి పంటలు దెబ్బతినడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. రైతాంగానికి అండగా ఉండాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు వడ్లు కొట్టుకుపోతున్నాయని, రైతులు కన్నీరుమున్నీరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, అసమర్థత వల్లే రైతులు ఈ దుస్థితిని ఎదుర్కొంటున్నారని, నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## రిజిస్ట్రేషన్ల రద్దీకి 'టైమ్' చెక్





- సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో అదనపు పని వేళలు
- మే 29 నుంచి జూన్ 3 వరకు ఉదయం 9:30 నుంచి రాత్రి 7:30 దాకా సేవలు
- సర్కార్ భూముల విలువల సవరణ నిర్ణయంతో ఎగబడ్డ జనం.
- స్లాట్ల సంఖ్య పెంపు.. అవసరమైతే మరిన్ని రోజులు పొడిగింపు
- 'భారత శక్తి' దినపత్రిక ప్రత్యేక కథనం.

**హైదరాబాద్: మే 27 భారత శక్తి** రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ల రద్దీకి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భూముల విలువలను వాస్తవ మార్కెట్ ధరలకు అనుగుణంగా సవరించాలన్న క్యాబినెట్ నిర్ణయంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు (రా=హా) జనసంద్రంగా మారాయి. కొత్త ధరలు అమల్లోకి వస్తే స్టాంప్ డ్యూటీ భారం పెరుగుతుందనే ఆందోళనతో కొనుగోలుదారులు ఒక్కసారిగా ఎగబడుతున్నారు. ఈ అనూహ్య తాకిడిని తట్టుకునేందుకు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసేందుకు రెవెన్యూ శాఖ రంగంలోకి దిగింది. ఇందులో భాగంగా ఈ నెల 29వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ కార్యాలయాల పని వేళలను పొడిగిస్తున్నట్లు రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు.

2లో..

### 'ఎస్ఐఆర్'పై జగన్ సంచలన వ్యాఖ్యలు..



**అమరావతి(భారత శక్తి)** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో భారీ ఎత్తున ఓట్లను తొలగించడం వల్లే మమతా బెనర్జీ, ఎంకే స్టాలిన్ వంటి కీలక నేతలు సైతం తమ నియోజకవర్గాల్లో ఓటమి పాలయ్యారని సంచలన ఆరోపణలు చేశారు. ఇదే తరహా ఎస్ఐఆర్ ప్రక్రియ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోనూ జరగనున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ నేతలతో జరిగిన సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎస్ఐఆర్


2లో..

### ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే కల్లాల్లో

## తడిసి ముద్దయిన వడ్లు

**- ఆంక్షలు లేకుండా ప్రతి గింజనూ కొనుగోలు చేయాలి**

**- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**



**సిద్దిపేట (భారత శక్తి)** సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల కేంద్రంతో పాటు గోనెపల్లి, ఇబ్రహీంనగర్ గ్రామాల్లోని వడ్ల కొనుగోలు కేంద్రాలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు సందర్శించారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో కన్నీళ్లు పెట్టుకుంటున్న రైతులను కలిసి..అధైర్యపడొద్దని, అండగా ఉండి కొట్లాడతామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం సకాలంలో వడ్లు కొనకపోవడం వల్లే ఆరుగాలం పండించిన పంట తడిసి ముద్దయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ధికారంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు తమ బాధ్యతలను విస్మరించి రైతులను మోసపుచ్చుతూ నాటకాలు ఆడుతున్నాయి. వడ్లు, మక్కలు, సన్ ఫ్లవర్, శనగలు, జొన్నలు కొనమంటే కాంగ్రెస్ నాయకులు కేంద్రం

2లో..

## వచ్చే ఎన్నికల్లోనూ అది రిపీట్ అవ్వాలి

**- మహానాడులో చంద్రబాబు**



**అమరావతి (భారత శక్తి)** 2024 సార్వత్రిక ఎన్నికల్లో సాధించిన అద్భుత విజయాన్ని రాబోయే ఎన్నికల్లోనూ పునరావృతం చేయాలని, ఇందుకోసం మిత్రపక్షాలతో కలిసికట్టుగా పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ (టీడీపీ) జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం ప్రారంభమైన టీడీపీ వార్షిక మహానాడులో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. అహం వీడి జనసేన, బీజేపీ నేతలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని పార్టీ కార్యకర్తలకు ఆయన స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.(ఎన్నికలు ఏదైనా పార్టీకి గెలుపే ముఖ్యమని, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని చంద్రబాబు సూచించారు. ప్రజల కోసం పనిచేస్తూ, గెలుపే ఏకైక లక్ష్యంగా ముందుకు సాగాలని ఆయన కోరారు. తీవ్ర సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు తమ కూటమి ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేస్తోందని ఆయన తెలిపారు. ఇప్పటివరకు సామాజిక భద్రతా పింఛన్ల కింద రూ. 63,000 కోట్లు పంపిణీ చేశామని, సంక్షేమ రంగంలో ఇది ఒక రికార్డు అని పేర్కొన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ గౌరవాన్ని నిలబెట్టేందుకు కట్టుబడి ఉన్నామని చంద్రబాబు అన్నారు. మహిళలకు ఆస్తి హక్కులు కల్పించడం నుంచి 'తల్లికి వందనం' పథకం

2లో..

# పల్లె పల్లెకూ 'డిజిటల్' వెలుగులు!

రూపొందించాలని ప్రస్తావించారు. దీనిపై కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా సానుకూలంగా స్పందిస్తూ.. తెలంగాణ డిజిటల్ పురోగతికి కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తి ఆర్థిక, సాంకేతిక సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.



### డిజిటల్ తెలంగాణకు ప్రత్యేక సంస్థ (SPV) ఏర్పాటు:

రాష్ట్రవ్యాప్తంగా పటిష్టమైన, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఇంటర్నెట్ నెట్‌వర్క్‌ను నిర్మించేందుకు వీలుగా ఒక 'ప్రత్యేక ప్రయోజన సంస్థ' (స్పెషల్ పర్పస్ వెహికల్ – SPV) ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వంతో ఈ సంస్థ నేరుగా ఒప్పందం కుదుర్చుకోనుంది. తద్వారా నిజమైన డిజిటల్ తెలంగాణ సాధనకు బలమైన పునాది పడనుంది. ఈ డిజిటల్ మౌలిక వసతుల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో ఒకే రకమైన సమీకృత డిజిటల్ వ్యవస్థ (ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ఎకోసిస్టమ్) అందుబాటులోకి రానుంది.

### 'రింగ్ ఆర్కిటెక్చర్' అంటే ఏమిటి?

టీ-ఫైబర్ ప్రాజెక్టులో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీని 'రింగ్ ఆర్కిటెక్చర్' (వలయ అనుసంధాన)పద్ధతిలో అనుసంధానించనున్నారు. సాంకేతికంగా ఇది అత్యంత సురక్షితమైన విధానం.

**పనిచేసే తీరు:** సాధారణంగా ఒకే లైన్ (లీనియర్) ద్వారా నెట్‌వర్క్ ఇస్తే, ఎక్కడైనా కేబుల్ కట్ అయితే ఇంటర్నెట్ పూర్తిగా నిలిచిపోతుంది. కానీ, రింగ్ ఆర్కిటెక్చర్‌లో డేటా ప్రసారం వలయాకారంలో రెండు వైపులా జరుగుతుంది.

**ప్రయోజనం:**ఒక మార్గంలో కేబుల్ దెబ్బతిన్నా లేదా సాంకేతిక అంతరాయం ఏర్పడినా.. మిల్లీ సెకన్ల వ్యవధిలోనే మరో ప్రత్యామ్నాయ మార్గం (రిడండెంట్ పాత్) ద్వారా డేటా ప్రసారమై ఇంటర్నెట్ సేవలు నిరంతరాయంగా కొనసాగుతాయి. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్, ఈ-గవర్నెన్స్, టెలిమెడిసిన్ సేవలకు ఎలాంటి బ్రేకులు పడవు.

### తొలి దశలో 3,089 గ్రామాల్లో పునరుద్ధరణ:

గతంలో నెట్‌వర్క్ దెబ్బతిన్న, కనెక్టివిటీ లేని ప్రాంతాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మొదటి దశలో భాగంగా ఉమ్మడి నిజామాబాద్, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాల్లోని '3,089 గ్రామాల్లో డిజిటల్ కనెక్టివిటీని పునరుద్ధరించనున్నారు. సవరించిన భారత్‌నెట్ ప్రోగ్రామ్ కింద ఈ గ్రామాల్లో ఆధునిక, భవిష్యత్ 5+ అవసరాలకు తగ్గట్టుగా ఆప్టికల్ ఫైబర్ మౌలిక సదుపాయాలను కల్పించి, రాష్ట్రంలోని మిగతా నగరాలతో సమానంగా డిజిటల్ నెట్‌వర్క్‌తో అనుసంధానం చేయనున్నారు.

### లబ్ధి చేకూరే రంగాలు (గణాంకాలు - అంచనాలు):

**విద్య:** గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు హైస్పీడ్ ఇంటర్నెట్. డిజిటల్ క్లాస్‌రూమ్‌ల ఏర్పాటు సులువు కానుంది.

**వైద్యం:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు (గ్రాఎజ) టెలిమెడిసిన్ కనెక్టివిటీ. హైదరాబాద్‌లోని నిపుణులైన వైద్యుల సేవలు పల్లెల్లోనే అందుబాటులోకి వస్తాయి.

**పాలన:** మీసేవ, ఈ-పంచాయతీ ద్వారా ప్రభుత్వ సేవలు వేగంగా, పారదర్శకంగా పౌరులకు అందుతాయి. దాదాపు 4,000 కు పైగా ప్రభుత్వ కార్యాలయాలకు లబ్ధి చేకూరనుంది. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి బి. అజిత్ రెడ్డి, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి డి. అనుదీప్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర ఐటీ శాఖల పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్ల రద్దీకి 'టైమ్' చెక్!

### రాత్రి 7:30 గంటల వరకు ఆఫీసులు ఓపెన్:

ఇకపై రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు "ఉదయం 9:30 గంటల నుంచే సేవలు ప్రారంభించి, రాత్రి 7:30 గంటల వరకు, నిరంతరాయంగా పనిచేయనున్నాయి. కార్యాలయాలకు వచ్చే ప్రజలు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతోనే ఈ మార్పులు చేశారు. డిమాండ్‌ను బట్టి అవసరమైతే అదనపు సమయంతో పాటు, మరిన్ని రోజులు కూడా పని వేళలను పొడిగించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు.




### పెరగనున్న స్లాట్ బుకింగ్స్.. ధరణితో సమన్వయం

సాధారణ రోజుల్లో ఉండే ముందస్తు అనుమతుల (స్లాట్ బుకింగ్) సంఖ్యను రద్దీకి అనుగుణంగా పెంచాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సర్వర్లపై సాంకేతిక ఒత్తిడి పడకుండా ఐటీ విభాగం అప్రమత్తంగా ఉండాలన్నారు. మరోవైపు, వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు జరిగే తహసీల్దార్ కార్యాలయాలతో (ధరణి) నిరంతరం సమన్వయం పెంచుకోవాలని, ఎక్కడా ఆలస్యం లేకుండా సేవలు అందించాలని యంత్రాంగాన్ని ఆదేశించారు.రాష్ట్రంలో ప్రభుత్వ భూముల విలువల సవరణ ద్వారా రిజిస్ట్రేషన్ల సమీకరణాలు పూర్తిగా మారనున్నాయి. ప్రభుత్వ విలువ, మార్కెట్ విలువ సమానమైతే రియల్ ఎస్టేట్ లావాదేవీల్లో నగదు రూపంలో జరిగే నల్లధనం చలామణికి అడ్డుకట్ట పడటంతో పాటు, పారదర్శకత పెరుగుతుంది. అంతేకాకుండా, ప్రభుత్వ విలువ పెరగడం వల్ల సామాన్యులకు బ్యాంకుల నుంచి లభించే గృహ, భూ రుణాలు సులభంగా, ఎక్కువ మొత్తంలో లభిస్తాయి.

దీనితో పాటు ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన ఆదాయం కూడా భారీగా పెరగనుంది.

### దళారీల ఆటలు సాగవు: ఐజీకి మంత్రి ఆదేశాలు

"ప్రజలకు సేవ చేయడమే ప్రభుత్వ ధ్యేయం. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో వేగం, పారదర్శకత, సౌకర్యం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో ముందుకు వెళ్తున్నాం. కార్యాలయాల చుట్టూ దళారులు తిరిగితే సహించేది లేదు."

**పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి**

ఈ మేరకు రిజిస్ట్రేషన్ల శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) రాజీవ్ గాంధీ హనుమంతుకు మంత్రి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు

. తీవ్రమైన ఎండలను దృష్టిలో ఉంచుకుని కార్యాలయాల వద్ద తాగునీరు, నీడ (షామియానాలు) వంటి కనీస వసతులుసరిగా కల్పించాలని, ఎక్కడా అవినీతికి తావులేకుండా సీసీ కెమెరాల నిఘాలో ప్రక్రియ ముగించాలని స్పష్టం చేశారు. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రియల్ ఎస్టేట్ వర్గాల్లో సంచలనంగా మారింది.

# గీతంలో నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీ.ఎడ్

## - 2026-27 విద్యా సంవత్సరం నుంచి ఆరంభం
## - ఎన్.సి.ఇ.టి.లో అర్హత సాధించడం తప్పనిసరి

**పటాన్‌చెరు మే 27 భారత శక్తి** హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరం నుంచి నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ (సమగ్ర ఉపాధ్యాయ విద్యా కార్యక్రమాన్ని)ను ప్రవేశపెట్టనుంది. ఈ ప్రోగ్రామ్ ద్వారా బి.ఎ. బి.ఎడ్., బి.ఎస్సీ. బి.ఎడ్. అనే నాలుగేళ్ల డ్యూయల్-మేజర్ అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీలను అందిస్తుందని స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రిచా శర్మ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. భారతదేశ జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020 చట్రంలో ఇది భాగమని ఆమె తెలిపారు. కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను డాక్టర్ శర్మ వివరిస్తూ, భవిష్యత్తు కోసం అత్యంత అర్హత కలిగిన, బహుళ-విషయ పరిజ్ఞానం గల విద్యావేత్తలను తయారు చేసే లక్ష్యంతో, 12 తరగతి లేదా ఇంటర్మీడియెట్ తరువాత వెంటనే విషయ పరిజ్ఞానాన్ని వృత్తిపరమైన బోధనా శిక్షణతో అనుసంధానించడానికి సమగ్ర ఉపాధ్యాయ విద్యా కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. పాఠశాల విద్యలోని వివిధ దశలలో ఉన్న విద్యార్థుల కోసం వారి వయస్సుకు తగిన అభ్యాస అనుభవాలను సృష్టించగల ఉత్సాహవంతులైన, వృత్తిపరంగా శిక్షణ పొందిన, సామాజిక బాధ్యత గల ఉపాధ్యాయులను తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలియజేశారు.నాలుగేళ్ల సమగ్ర కార్యక్రమం, కాబోయే ఉపాధ్యాయులకు విషయం, బోధనా పద్ధతులు, విలువలు, తరగతి గది ఆచరణలో సమగ్ర శిక్షణను అందించడమే ప్రధాన లక్షాలుగా డాక్టర్ రిచా పేర్కొన్నారు. ఈ పాఠ్యప్రణాళిక 21వ శతాబ్దపు ప్రపంచ విద్యా ప్రమాణాలకు అనుగుణంగా ఉంటూనే, బాల్య దశ సంరక్షణ, విద్య (ఈసీసీఈ), ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం (ఎఫ్ఎల్ఎన్), సమ్మిళిత విద్య, భారతీయ విలువలు, సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలకు కూడా ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ సమగ్ర అండర్ గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయ విద్యా కార్యక్రమం, కొత్త పాఠశాల నిర్మాణంలోని నాలుగు దశలైన-ఫౌండేషనల్, ప్రిపరేటరీ, మిడిల్, సెకండరీ (5о3о3о4) కోసం ఉపాధ్యాయులను సిద్ధం చేస్తుందని డాక్టర్ రిచా వివరించారు. విద్యార్థులు సాంప్రదాయ ఐదేళ్ల మార్గానికి బదులుగా తమ ఉపాధ్యాయ విద్యను నాలుగేళ్లలో పూర్తి చేయవచ్చని, తద్వారా ఒక విద్యా సంవత్సరాన్ని ఆదా చేసుకోవచ్చని ఆమె తెలిపారు.2026-27 విద్యా సంవత్సరానికి గాను, ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 223 భాగస్వామ్య సంస్థలలో (ఐఐటీలు, ఎన్ఐటీలు, ప్రాంతీయ విద్యా సంస్థ (ఆర్ఐఈ)లు, కేంద్ర, రాష్ట్ర విశ్వవిద్యాలయాలతో పాటు గీతంలో కూడా) ఈ కోర్సును అందిస్తున్నారని, దాదాపు 16,950 సీట్లు దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్నాయని డాక్టర్ రిచా శర్మ పేర్కొన్నారు. జాతీయ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఎన్.సి.ఇ.టి.) 2026 ద్వారా ఈ కోర్సుల్లో ప్రవేశాలను నిర్వహిస్తారని, ఈ పరీక్షలో సాధించిన అర్హతను బట్టే ఆయా సంస్థలు ప్రవేశాలు కల్పిస్తాయని తెలిపారు.మరిన్ని వివరాల కోసం, ఆసక్తి గల విద్యార్థులు లేదా వారి తల్లిదండ్రులు 95 42 42 42 59 / 66 లను సంప్రదించాలని, లేదా గీతం అధికారిక వెబ్ సైట్ ఞఞఞ.ఞ్ౖఖుఎ.వఒబ ను సందర్శించాలని డాక్టర్ రిచా సూచించారు.



## కర్ణాటకలో నాయకత్వ మార్పు దిశగా వేగంగా అడుగులు

గవర్నర్‌ను సమయం కోరడం, నాయకత్వ మార్పుపై అప్పుడే మాట్లాడతానని చెప్పడం ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా మే 30న కొత్త సీఎం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు కాంగ్రెస్ వర్గాల సమాచారం.శివకుమార్?తో ఆల్పాహార సమావేశంమంగళవారం దిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీతో జరిగిన భేటీలో నాయకత్వ మార్పుపై అసలు చర్చే జరగలేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పష్టంగా చెప్పినప్పటికీ మార్పు దిశగా అడుగులు పడుతున్నాయి. ముఖ్యమంత్రి సిద్దరామయ్య గురువారం కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోత్ అపాయింట్‌మెంట్ కోరినట్లు సీఎంఓ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ వర్గాల సమాచారం ప్రకారం సిద్ధరామయ్య తన రాజీనామాను గవర్నర్ గెహ్లోత్‌కు సమర్పించే అవకాశం ఉంది. సిద్ధరామయ్య తన అధికారిక నివాసం 'కావేరి'లో గురువారం ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఇతర మంత్రివర్గ సహచరులతో అల్పాహార సమావేశం నిర్వహించనున్నారు. మాజీ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా బెంగళూరులోని విధాన సౌధలో ఆయనకు సీఎం నివాళులు అర్పించారు. తర్వాత సీఎం మార్పునకు సంబంధించి అడిగిన ప్రశ్నలపై గురువారమే మాట్లాడతానని సిద్దరామయ్యచెప్పారువిడివిడిగా కలిసిన నేతలుదిల్లీలో మంగళవారం పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలు సిద్ధరామయ్య, శివకుమార్‌లతో విడివిడిగా సమావేశయ్యారు. వారితో సుదీర్ఘ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా పదవి నుంచి తప్పుకోవాలని సిద్ధరామయ్యను అధిష్టానం కోరినట్లు సమాచారం. సిద్ధరామయ్యకు రాజ్యసభ స్థానం, కేంద్ర స్థాయిలో కీలక పాత్ర ఇవ్వజూపినట్లు వచ్చాయి. అయితే రాజ్యసభ ఎన్నికలు, కర్ణాటక శాసనమండలి ఎన్నికల గురించే చర్చించినట్లు సమావేశం తర్వాత కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చెప్పారు. నాయకత్వ మార్పు గురించి కాదని చెప్పారు.చెరోసగం రోజులు పాలిద్దాం!గతేడాది కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్నప్పటి నుంచి నాయకత్వ మార్పుపై ఊహాగానాలు మొదలయ్యాయి. గత 18 నెలలుగా డీకే శివకుమార్ అనుచరులు ఆయన ముఖ్యమంత్రి బాధ్యతలు చేపడతారని చెబుతున్నారు. ఇదేసమయంలో కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు సీనియర్ కాంగ్రెస్ నేత జి. పరమేశ్వరకు సీఎంగా అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. కాంగ్రెస్ కర్ణాటక వ్యవహారాల బాధ్యుడు రణదీప్ సూర్జేవాలా బెంగళూరులో కాంగ్రెస్ నాయకులతో సమావేశమై నాయకత్వ మార్పుపై స్పష్టత ఇచ్చే అవకాశముందని సమాచారం.

## 'ఎస్ఐఆర్'పై జగన్ సంచలన వ్యాఖ్యలు..

ప్రక్రియలో భాగంగా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఓట్ల తొలగింపుపై అనేక రాజకీయ పార్టీలు అనుమానాలు వ్యక్తం చేశాయని జగన్ గుర్తుచేశారు. పశ్చిమ బెంగాల్‌లో 91 లక్షల ఓట్లు, తమిళనాడులో 94 లక్షల ఓట్లు తొలగించారని ఆయన గణాంకాలతో సహా వివరించారు. పశ్చిమ బెంగాల్‌లోని భబానీపూర్ నియోజకవర్గంలో 45,982 ఓట్లను తొలగించారని, అక్కడ మమతా బెనర్జీ 15,000 ఓట్ల తేడాతో ఓడిపోయారని తెలిపారు. అదేవిధంగా, తమిళనాడులోని కొళత్తూరు నియోజకవర్గంలో 71,000 ఓట్లను తొలగించగా, స్టాలిన్ 8,000 ఓట్లతో ఓటమి చవిచూశారని జగన్ విశ్లేషించారు. ప్రతి గ్రామంలో కొద్ది సంఖ్యలో నిజమైన ఓట్లను తొలగించినా, అది నియోజకవర్గ స్థాయి ఫలితాలను గణనీయంగా ప్రభావితం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీకి సంబంధించిన దొంగ ఓట్లు, డూప్లికేట్ ఓట్లపై నిశితంగా దృష్టి సారించాలని పార్టీ శ్రేణులకు జగన్ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గాన్ని ఉదాహరణగా చూపుతూ, అక్కడ ఓటర్ల జాబితాలో ఒకే పేరు, ఒకే కుటుంబ వివరాలతో వేలాది అనుమానాస్పద ఓట్లు ఉన్నాయని పేర్కొన్నారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే కల్లాల్లో తడిసి ముద్దయిన వడ్లు

మీద నెపం నెడుతున్నారు.మరోవైపు కేంద్రంలో అధికారంలో ఉండి కూడా బీజేపీ వాళ్లు వడ్లు కొనాలని ఇక్కడ ధర్నాలు చేస్తున్నారు. డీజిల్, పెట్రోల్ ధరలు పెరిగాయని ఇక్కడ అధికారంలో ఉన్న కాంగ్రెస్ వాళ్లు రోడ్డెక్కుతున్నారు.కేంద్ర ప్రభుత్వం ఎఫ్ సీఐ లెవీ కోటాను,ఎరువుల కోటాను రాష్ట్రానికి సకాలంలో ఇవ్వకుండా బీజేపీ మోసం చేస్తుంటే, రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ రైతులను గాలికి వదిలేసి ఇద్దరూ కలిసి ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తున్నారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎరువులకు, వడ్ల కొనుగోళ్లకు ఏనాడూ ఇబ్బంది రాలేదు. ఆనాడు కేసీఆర్ కాళేశ్వరం జలాలతో బంగారం లాంటి పంటలు పండిస్తే.. కొనేవాడు లేక ఆ పంట అమ్ముకోవడం రైతులకు కష్టమైపోయింది.సాధారణంగా రోహిణీ కార్తె నాటికి వడ్ల కొనుగోళ్లు పూర్తవుతాయి. కానీ ఈ ప్రభుత్వం ఆన్ లైన్ ట్యాగింగ్, కొత్త రూల్స్ పేరుతో నెల రోజులు కాలయాపన చేయడం వల్లే నేడు ఈ దుస్థితి దాపరించింది.ప్రభుత్వానికి రైతులు ముఖ్యమా ఇసుక మీద వచ్చే ఆదాయం ముఖ్యమా తేల్చుకోవాలి.

## వచ్చే ఎన్నికల్లోనూ అది రిపీట్ అవ్వాలి

వరకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లతో పాటు, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలయ్యే వరకు టీడీపీ వారికి అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. విద్య, ఉపాధి, ఆర్థిక రంగాల్లో మహిళలను శక్తిమంతులుగా తీర్చిదిద్దే కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈసారి హైబ్రిడ్ పద్ధతిలో మహానాడు నిర్వహిస్తున్నప్పటికీ, స్ఫూర్తి, సిద్ధాంతాలు మాత్రం మారలేదని చంద్రబాబు వ్యాఖ్యానించారు. తిండి, గూడు, భద్రత అనే ప్రాథమిక అవసరాలను అందించే సంక్షేమ సూత్రాలపైనే టీడీపీ ఆవిర్భవించిందని గుర్తుచేశారు. 'విజన్ పాలిటిక్స్'ను ప్రవేశపెట్టింది టీడీపీయేనని, ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజల పునరుజ్జీవనానికి ప్రతీక అని ఆయన అన్నారు. "దేశ గౌరవానికి జాతీయ జెండా ఎలాగో, తెలుగు ప్రజల గౌరవానికి, ఆత్మగౌరవానికి పసుపు జెండా ప్రతీక వంటిది" అని ఆయన ఉద్ఘాటించారు. గత 45 ఏళ్లుగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం టీడీపీ నిరంతరం పోరాడుతోందని, దాడులు, హింస, హత్యారాజకీయాలు, తప్పుడు కేసులు ఎదురైనా ప్రజల పక్షాన తమ పోరాటం ఆగలేదని అన్నారు.టీడీపీ కేవలం తక్షణ ఎన్నికల రాజకీయాల కోసం కాకుండా, తరతరాల మార్పు కోసం పనిచేసే ఒక రాజకీయ ఉద్యమం అని చంద్రబాబు అభివర్ణించారు. "మేము వచ్చే ఎన్నికల కోసం కాదు, వచ్చే తరం కోసం పనిచేస్తాం" అని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా జెన్ జెడ్, జెన్ ఆల్ఫా, యువతరం ఆకాంక్షల చుట్టూ రాష్ట్ర ప్రభుత్వ దీర్ఘకాలిక దార్శనికత రూపుదిద్దుకుంటోందని సంకేతమిచ్చారు.ఆంధ్రప్రదేశ్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్పేస్ టెక్నాలజీ, సెమీకండక్టర్లు, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగాలకు గమ్యస్థానంగా మారుస్తామని చంద్రబాబు ప్రకటించారు. యువతను వ్యవస్థాపకత, ఆవిష్కరణల దిశగా ప్రోత్సహిస్తామన్నారు. "ఒక కుటుంబం- ఒక పారిశ్రామికవేత్త", స్టార్టప్‌ల ప్రోత్సాహం, మెగా డీఎస్సీ, ఉద్యోగ కల్పన లక్ష్యాలు వంటివి యువతకు అవకాశాలు కల్పించేందుకు రూపొందించిన ప్రణాళికలో భాగమని వివరించారు. కేవలం 23 నెలల్లోనే రాష్ట్రానికి రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని, తద్వారా 23 లక్షల ఉద్యోగాలు వస్తాయని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు ద్వారా రూ. 11.27 లక్షల కోట్ల విలువైన 282 ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చామన్నారు. పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, రేర్ ఎర్త్ మినరల్ ప్రాజెక్టులతో పాటు ఐదో తరం ఫైటర్ జెట్ తయారీ ప్రాజెక్టు కూడా రాష్ట్రానికి వస్తోందని తెలిపారు. "ఫైటర్ జెట్ తయారీ, టెస్టింగ్ ప్రాజెక్టుకు కేవలం 36 రోజుల్లోనే అనుమతులు మంజూరు చేశాం. తిరుపతికి రాయల్ ఎన్ ఫీల్డ్ మోటార్‌సైకిల్ తయారీ ప్రాజెక్టు రావడానికి మా 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానమే కారణం" అని చంద్రబాబు వివరించారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న డాగ్ స్క్వాడ్ ట్రాకర్‌ను "లైకా"ను పరిశీలించిన జిల్లా ఎస్పీసునిత రెడ్డి,

**వనపర్తి.(భారత శక్తి)** హైదరాబాద్ పోలీసు వెటర్నరీ ఆసుపత్రిలో ఐదు రోజులపాటు చికిత్స లైకా ఆరోగ్య పరిస్థితిని సమీక్షించిన జిల్లా ఎన్నో మర్డర్, దొంగతనం కేసుల విచారణలో కీలక పాత్ర పోషించిన ట్రాకర్×వనపర్తి జిల్లా పోలీసు శాఖలో డాగ్ స్క్వాడ్ విభాగానికి చెందిన ట్రాకర్ "లైకా" గత పదేళ్లుగా జిల్లాలో జరిగిన ఎన్నో మర్డర్, దొంగతనం మరియు ఇతర క్లిష్ట కేసుల విచారణలో కీలక పాత్ర పోషించి పోలీసుశాఖకు విశేష సేవలు అందించిందని జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఐపీఎస్.తెలిపారు.డాగ్ స్క్వాడ్ విభాగానికి చెందిన ట్రాకర్ "లైకా" అనారోగ్యానికి గురైనందున ఎస్పీ ఆదేశాల మేరకు హైదరాబాద్ మొయినాబాద్‌లోని పోలీసు వెటర్నరీ ఆసుపత్రిలో ఐదు రోజులపాటు ప్రత్యేక చికిత్స అందించారు. చికిత్స అనంతరం బుధవారం రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో లైకా ఆరోగ్య పరిస్థితిని ఎస్పీ స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా డాగ్ హ్యాండ్లర్‌కు లైకాను మరింత జాగ్రత్తగా చూసుకోవాలని, సమయానికి ఆహారం, మందులు అందించాలని సూచించారు. పోలీసు శాఖలో సేవలందిస్తున్న జంతువులు కూడా శాఖకు అమూల్యమైన భాగస్వాములేనని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ.. పోలీసుశాఖలో డాగ్ స్క్వాడ్ విభాగం నిశ్శబ్ద యోధుల్లా పనిచేస్తూ ఎన్నో క్లిష్ట కేసుల ఛేదనలో కీలక పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా ట్రాకర్ డాగ్ "లైకా" తమ అద్భుతమైన ఘ్రాణశక్తితో నేరస్థులను గుర్తించడం, ఆధారాలను కనుగొనడం, కేసులను త్వరితగతిన పరిష్కరించడంలో పోలీసులకు అపూర్వ సహకారం అందించిందని 'లైకా' గత పదేళ్లుగా వనపర్తి జిల్లా పోలీసు శాఖకు అత్యంత నిబద్ధతతో సేవలందించింది. ఎన్నో మర్డర్, దొంగతనం కేసుల విచారణలో కీలక ఆధారాలను గుర్తించి నేరస్థులను పట్టుకోవడంలో తన ప్రత్యేక ప్రతిభను చాటుకుంది. ఒక పోలీసు సిబ్బంది ఎంత అంకితభావంతో పని చేస్తారో, అంతే విధంగా లైకా కూడా శాఖ పట్ల విశ్వాసంతో సేవలందించింది. పోలీసు శాఖలో సేవలందిస్తున్న "లైకా" ఆరోగ్యం, సంక్షేమం పట్ల కూడా మేము పోలీసులతో సమాన బాధ్యతతో వ్యవహరిస్తాము. లైకా త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నామని ఎస్పీ తెలిపారు.

## బక్రీద్‌కు సందర్భంగా ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ

**- అధికారులకు కమిషనర్ అశ్రిత్ కుమార్ ఆదేశాలు జారీ**



**సిద్దిపేట, మే 27 (భారత శక్తి):** బక్రీద్ పండుగ నేపథ్యంలో సిద్దిపేట పట్టణంలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని అశ్రిత్ కుమార్ అధికారులను ఆదేశించారు.ఈ మేరకు బుధవారం సిద్దిపేటలో ఆయన ఆధ్వర్యంలో వార్డు ఆఫీసర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆర్‌పీలతో సమావేశం నిర్వహించారు. జంతువుల వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా మున్సిపాలిటీ అందించే కవర్లలో సేకరించి చెత్త వాహనాలకు అందజేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈద్గాలు, మసీదుల వద్ద ప్రత్యేక పారిశుద్ధ్యం, బ్లీచింగ్ చల్లడం, తాగునీటి సదుపాయాలు కల్పించాలని తెలిపారు.ఇంటి, నీటి పన్నుల వసూళ్లు సకాలంలో చేపట్టాలని, కొత్త గృహాలకు ఇంటి నంబర్లు కేటాయించాలని ఆదేశించారు. కొత్త నిర్మాణాలు అనుమతుల ప్రకారమే జరుగుతున్నాయో పరిశీలించాలని సూచించారు.పట్టణంలో చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా చర్యలు తీసుకోవాలని, రోడ్ల నిర్మాణ పనుల నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.స్వచ్ఛ సర్వేక్షన్ 2026 లో సిద్దిపేటను దేశంలో ప్రథమ స్థానంలో నిలపడానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని కమిషనర్ పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మేనేజర్ శ్రీనివాస్, ఆర్‌వో శ్రీకాంత్, ఆర్‌ఐలు, వార్డు ఆఫీసర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సంతోషి (టీఎంసీ), జ్యోతి, రేణుక (సీవోలు), ఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

**- కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్**



**సిద్దిపేట, మే 27 (భారత శక్తి ):** రైతులు మార్కెట్ యార్డులకు తీసుకొచ్చిన ప్రతి ధాన్యం గింజను కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అత్తు ఇమామ్ తెలిపారు. సిద్దిపేట ఆర్డీవో కార్యాలయంలో సదానందం ను కలిసి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని, వర్షానికి తడిసిన ధాన్యాన్ని కూడా ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలకు మార్కెట్ యార్డుల్లో రైతులు తీసుకొచ్చిన ధాన్యం తడిసిపోయిందని అన్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో బీఆర్ఎస్ పార్టీ అనవసర రాద్ధాంతం చేస్తోందని విమర్శించారు. రైతులకు అండగా నిలవాల్సిన సమయంలో రాజకీయ లాభాల కోసం బీఆర్ఎస్ నాయకులు రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అధికారం కోల్పోయిన తర్వాతే బీఆర్ఎస్‌కు రైతులు గుర్తుకొచ్చారా అని ప్రశ్నించిన ఆయన, గతంలో రైతులు ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి సంకెళ్లు వేసిన విషయాన్ని ప్రజలు మర్చిపోలేదన్నారు.రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. వచ్చే పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని, అన్ని వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ పాలనతోనే సాధ్యమవుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్యాదారి మధు, గయాజుద్దీన్, హర్షద్, దస్తగిరి, ముదసిరి తదితరులు పాల్గొన్నారు.

## విచ్ఛిన్నకర శక్తుల పట్ల కూటమి నాయకులు అప్రమత్తంగా ఉండాలి.

**-తప్పుడు ప్రచారాలకు పాల్పడితే కఠిన చర్యలు.**

**- ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్**



విశాఖపట్నం, భారత శక్తి ప్రతినిధి, మే 27: విశాఖపట్నంలోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో నాలుగు రోజుల పాటు జరగనున్న "మ్యాంగో మేళా" పోస్టర్‌ను ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు.మే 28 ,2026 గురువారం నుంచి నాలుగు రోజుల పాటు జరుగుతున్న మ్యాంగో మేళా ను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనసేన-బీజేపీ సంబంధాలపై ఇటీవల ఒక రాజకీయ విశ్లేషకుడు చేసిన వ్యాఖ్యలను తిరిగి వెనక్కి తీసుకున్నారని తెలిపారు. కూటమి పార్టీల మధ్య విభేదాలు సృష్టించేందుకు కొంతమంది కావాలనే మైండ్ గేమ్స్ ఆడుతున్నారని ఆరోపించారు."కూటమిని బలహీనపర్చాలని చూస్తున్న విచ్ఛిన్నకర శక్తుల పట్ల నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి. తప్పుడు ప్రచారాలు, దుష్ప్రచారాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే అరెస్టులు కూడా జరుగుతాయి" అని హెచ్చరించారు.ముసుగు వీరులను ఎవరినీ విడిచిపెట్టబోమని, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో సహా ఎవరు తప్పులు చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

### ఎస్ఐఆర్ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జూన్ 1 నుంచి 30 వరకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించారన్నారు.అలాగే జూన్ 21 యోగా డేను ఘనంగా నిర్వహిస్తామని మాధవ్ తెలిపారు.పోలవరం ప్రాజెక్ట్ ను త్వరితగతిన పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో 2 సంవత్సరాలలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు , సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిస్తామన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించే దిశగా కృషిచేయాలని పార్టీ శ్రేణులకు పీవీయన్ మాధవ్ పిలుపునిచ్చారు .

# ప్రశ్నిస్తే సంకెళ్లా?.. మేధావి నాగేశ్వర్‌రావుపై

# కక్షసాధింపుపై 'యాదగిరి' నిప్పులు!

- ఎన్టీఆర్ చావుకు కారణమైనోడు సీఎం.. ఎన్నో పెళ్లిళ్లు చేసుకున్నోడు డిప్యూటీ సీఎం!
- పవన్ కళ్యాణ్ ఒక 'లిల్లీపుట్'.. చేగువేరా బొమ్మలు వదిలి చంద్రబాబు పల్లకీ మోస్తున్నాడు!
- తెలంగాణ మీడియాలో ఆంధ్రా పెత్తనం ఏంది?.. స్థానిక జర్నలిస్టులకు దక్కని గుర్తింపు!
- ప్రజాస్వామ్య గొంతుకలపై అణచివేత.. ఆర్టికల్ 19(1)(ఖ) ఉల్లంఘనపై సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి ధ్వజం.




హైదరాబాద్, మే 27 భారత శక్తి: సమకాలీన రాజకీయాలపై విశ్లేషణలు చేస్తూ, పాలకుల తప్పులను ఎండగట్టే ప్రముఖ విద్యావేత్త, మేధావి ప్రొఫెసర్ కె. నాగేశ్వర్‌రావును అరెస్ట్ చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై తెలంగాణ సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును కాలరాస్తూ, కేవలం విమర్శలకే ఒక మేధావిని అక్రమంగా నిర్బంధించాలని చూడటం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లపై ఘాటైన వ్యాఖ్యలు చేస్తూ పాలకుల కక్షసాధింపు ధోరణిని తూర్పారబట్టారు.

### - చేగువేరా టు చంద్రబాబు.. పవన్ ఒక 'లిల్లీపుట్'!

ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు లాంటి మేధావి ముందు పవన్ కళ్యాణ్ ఒక 'లిల్లీపుట్' (వామనుడు) లాంటివాడని పాశం యాదగిరి ఎద్దేవా చేశారు. ఒకప్పుడు విప్లవ వీరుడు చేగువేరా బొమ్మలను, ఆయన సిద్ధాంతాలను గుండెలకు హత్తుకుని తిరిగిన పవన్ కళ్యాణ్.. ఈరోజు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం చంద్రబాబు నాయుడు బొమ్మలను పట్టుకుని తిరుగుతున్నారని విమర్శించారు. "ఎన్నో పెళ్లిళ్లు చేసుకున్న పవన్ కళ్యాణ్ ఇతరులకు సంస్కారం గురించి హితబోధలు చేయడం విడ్డూరంగా ఉంది. అసలు అటువంటి వ్యక్తిని తీసుకువెళ్లి డిప్యూటీ సీఎంను చేయడమే ఒక పెద్ద రాజకీయ తప్పిదం" అని ఆయన వ్యాఖ్యానించారు.

### -అధికారం కోసం రంగులు మార్చే 'బాబు' నీతులు చెప్తారా?

నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, మహానటుడు ఎన్టీ రామారావు గారి వెన్నుపోటు రాజకీయాలకు, ఆయన మరణానికి కారకుడైన చంద్రబాబు నాయుడు ఈరోజు మళ్లీ ఏపీకి ముఖ్యమంత్రిగా కూర్చోవడం ప్రజాస్వామ్యానికే దారుణమని యాదగిరి ఆవేదన వ్యక్తం చేశారు. అధికారం కోసం రోజుకొక రాజకీయ పార్టీని, రంగులను మార్చే ఇటువంటి నాయకులు ఈరోజు వ్యవస్థలను అడ్డం పెట్టుకుని మేధావులపై నీతులు చెప్పడం, బెదిరింపులకు దిగడం హేయమైన చర్య అని మండిపడ్డారు.

### - రాజ్యాంగ ఉల్లంఘన.. 'సుప్రీం' తీర్పులకు పాతర!

ప్రజాస్వామ్యంలో పాలకుల విధానాలను విమర్శించడం పౌరుల ప్రాథమిక హక్కు అని, దీన్ని అణచివేయడం భారత రాజ్యాంగంలోని "ఆర్టికల్ 19(1)(ఖ) (భావప్రకటన స్వేచ్ఛ)" ను పూర్తిగా ఉల్లంఘించడమేనని ఈ సందర్భంగా జర్నలిస్టు వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. సుప్రీంకోర్టు సైతం పదే పదే తన తీర్పుల్లో (ఉదాహరణకు: శ్రేయా సింఘాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు) కేవలం ప్రభుత్వ విధానాలపై అసమ్మతి లేదా విమర్శలు చేసినంత మాత్రాన క్రిమినల్ కేసులు పెట్టడం లేదా అరెస్టులు చేయడం చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. రాజకీయ కక్షసాధింపు చర్యల కోసం న్యాయవ్యవస్థను, పోలీసు యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడం ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదకరమని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

### - తెలంగాణ మీడియాలో ఆంధ్రా పెత్తనం ఏంది?

ఇదే వేదికపై తెలంగాణ రాష్ట్రంలో మీడియా రంగం ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులను పాశం యాదగిరి సంచలన వ్యాఖ్యలతో బట్టబయలు చేశారు. స్వరాష్ట్రమైన తెలంగాణలో స్థానిక జర్నలిస్టులకు కాకుండా, ప్రస్తుతం ఆంధ్రా ప్రాంతానికి చెందిన జర్నలిస్టులకే అక్రిడిటేషన్ కార్డులు ఎక్కువగా ఉన్నాయని ఆరోపించారు. తెలంగాణలో ఎ6, ౧-చీవఌం మినహాయిస్తే, మిగిలిన ప్రధాన వార్తా ఛానళ్లన్నీ నేటికీ ఆంధ్రా యాజమాన్యాల చేతుల్లోనే ఉన్నాయని, మీడియా రంగంలో ఇప్పటికీ వారి ఆధిపత్యమే నడుస్తోందని.. మన జర్నలిస్టులకు సరైన గుర్తింపు దక్కడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.
తెలంగాణ సమాజం, ఇక్కడి జర్నలిస్టు లోకం మేధావులపై జరుగుతున్న ఇటువంటి అక్రమ దాడులను, అరెస్ట్ ప్రయత్నాలను ఏమాత్రం సహించబోదని, ప్రశ్నించే గొంతుకలకు అండగా నిలుస్తుందని యాదగిరి స్పష్టం చేశారు.

## బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో పటిష్ట భద్రత ఏర్పాట్లు.

**-సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మవద్దు: జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే.**



భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, మే 27: బక్రీద్ పండగ నేపథ్యంలో వేములవాడ పట్టణ పరిధిలోని ఓల్డ్ అర్బన్ కాలనీలో గల ఈద్గాని ప్రత్యక్షంగా సందర్శించి భద్రతపరమైన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు , సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బక్రీద్ పండుగను అందరూ కలిసిమెలిసి శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు.జిల్లాలో ఉన్న ఈద్గాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ అవసరమైన అన్ని భద్రతా చర్యలను పూర్తి చేసినట్లు తెలిపారు.ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తూ శాంతి, సామరస్యాల పరిరక్షణకు సహకరించాలని కోరారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి కార్యకలాపాలను ఉపేక్షించబోమని హెచ్చరించారు.జిల్లా వ్యాప్తంగా జిల్లా చెక్ పోస్టులను ఏర్పాటు చేసి ప్రతి చెక్ పోస్ట్ లో24/7 వాహనాల తనిఖీలు చేపట్టి పశువుల అక్రమ రవాణా జరగకుండా విధులను నిర్వర్తిస్తున్నట్లు తెలియజేశారు.సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మవద్దని, సోషల్ మీడియా వేదికలైన వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర మాధ్యమాల్లో విద్వేషాలను రెచ్చగొట్టే మార్ఫింగ్ ఫోటోలు, అసత్య ప్రచారాలు, ప్రేరేపిత పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఎస్పీ పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్,ట్రాఫిక్ ఎస్.ఐ రాజు సిబ్బంది ఉన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి.

**-తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక ప్రభుత్వానికి డిమాండ్**

**-తెలంగాణఉద్యమ నాయకుడు వి.ఎం. ఎల్లయ్య... మంద భాస్కర్ రెడ్డి.**



గుమ్మడిదల మున్సిపల్, మే 27 (భారత శక్తి న్యూస్): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపల్ పరిధిలో తెలంగాణ ఉద్యమకారులు సమావేశమై తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో మలిదశ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన అనేక మంది ఉద్యమకారులు ప్రస్తుతం జీవనోపాధి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక కన్వీనర్ మంద బాస్కర్ రెడ్డి, వి.ఎం. ఎల్లయ్య మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ సాధన కోసం పోరాడిన ఉద్యమకారులు నేడు అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర కష్టాలు పడుతున్నారని అన్నారు. తమ పిల్లలను ఉన్నత చదువులకు పంపించలేని దుస్థితిలో ఎంతో మంది ఉద్యమకారులు జీవిస్తున్నారని పేర్కొన్నారు.ప్రస్తుత ప్రజాపాలనలోనైనా ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర సాధన కోసం తమ జీవితాలను అంకితం చేసిన ఉద్యమకారులకు కనీస గౌరవ వేతనం అందించడంతో పాటు హెల్త్ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యమకారుల పిల్లలకు కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఉచిత విద్యా సౌకర్యం కల్పించాలని కోరారు.అర్హులైన ఉద్యమకారులకు 250 గజాల ఇళ్ల స్థలాలు కేటాయించి వారి కుటుంబాలకు భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో దర్గా శ్రీనివాస్, వాలందాస్ మల్లేష్ గౌడ్, కుమ్మరి వెంకటేష్, చింతల రాజు, అంజనేయులు, దప్పు జీవన్ కుమార్, రామకృష్ణ గౌడ్, ఎండి గరీబ్, వడ్డెర ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రమట్టి దందా

**- పట్టించుకోని రెవెన్యూ శాఖ అధికారులు**

**- లారీలతో మట్టి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నా వ్యాపారస్తులు**

**- అక్రమ మట్టి తొలకలు పై పలు విమర్శలను**

**గోకవరం (భారత శక్తి)** మండలంలో అక్రమ మట్టి వ్యాపారం రోజురోజుకీ పెరుగుపోతుంది. తూత్ మంత్రంగా అనుమతులు తీసుకొని కొందరు రాజకీయ నాయకులు పేరు చెప్పి బహిరంగనే మట్టి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా లారీలతో ఎర్ర మట్టి తరలిస్తున్నారు. ఒకటి రెండు కాదు సుమారు రోజుకే 30 నుండి 50 లారీలు మట్టి వేరే ప్రాంతాలకి అక్రమంగా వెళ్ళిపోతుంది . ఇంత అక్రమంగా మట్టి వ్యాపారం జరుగుతున్న సంబంధించిన రెవిన్యూ శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని పలు విమర్శలు వస్తున్నాయి. అధికారులు తాను పని తాను చేసుకుంటూ పోదామంటే రాజకీయ నాయకులు ఒత్తిడిలు వస్తున్నట్లు ప్రసారాలు జోరుగా కొనసాగుతున్నాయి.కుటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అక్రమంగా మట్టి తరలింపులు గోకవరంలో జోరుగా జరుగుతున్నాయని పుకార్లు షికార్లు కొడుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి అక్రమ మట్టి తరలింపులు పైన కఠిన చర్యలు తీసుకొని అడ్డుకట్టు వేయాలని పరువురు కోరుతున్నారు

## మూగజీవాల దాహార్తి తీర్చడమే ప్రభుత్వ లక్ష్యం



**రుద్రవరం.(భారత శక్తి)**వేసవిలో మూగజీవాల దాహార్తి తీర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఉపాధి ఏపీవో గౌరీ బాయ్ తెలిపారు. మండలంలోని పేరూరు, రుద్రవరం, నాగులవరం గ్రామాలతో పాటు పలు గ్రామాలలో నిర్మించిన నీటితొట్లలో నీరు నింపారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ వేసవిలో పశువులు మూగజీవాల దాహార్తి తీర్చేందుకు మండలంలోని ఆయా గ్రామాలలో 17 నీటి తొట్లు నిర్మించడం జరిగిందని, వేసవి దృష్ట్యా వాటిలో ఉపాధి సిబ్బంది నీరు నింపడం జరిగిందన్నారు. దీంతో వేసవిలో పశువులు మూగజీవాల దాహార్తి తీర్చుకోవడం జరుగుతుందని ఏపీవో తెలిపారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాలలోని రైతులు గ్రామస్తులు ఉపయోగించుకోవాలని ఆమె కోరారు.

## ఘనంగా మహానాడు కార్యక్రమం

**- మహానాడు కార్యక్రమానికి బద్వేల్ ఇంచార్జ్ రితీష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ వర్గీయులు దూరం.**

**- మహానాడుకు దూరంగా బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పార్టీ ఇంచార్జి రితేష్ రెడ్డి**

**బద్వేలు(భారత శక్తి)** తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహానాడు కార్యక్రమం బద్వేలు నియోజకవర్గం పోరుమామిళ్ల, కలసపాడు, కాశి నాయన, బి కోడూరు మండలాల్లో ఘనంగా మొదటిరోజు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో పోరుమామిళ్లలోని సిసిఆర్ కాంప్లెక్స్ లో తెలుగుదేశం పార్టీ నాయకుడు చెరుకూరి రవికుమార్ అధ్యక్షతన మరియు టేకురుపేట గ్రామంలో నగిరి భైరవ ప్రసాద్ అధ్యక్షతన, అలాగే కలసపాడు మండలంలో మండల డీసీసీ బ్యాంక్ చైర్మన్ కల్లూరి దుగ్గిరెడ్డి అధ్యక్షతన మరియు కాశినాయన మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కర్నాటి వెంకటరెడ్డి అధ్యక్షతన అలాగే సావిశెట్టిపల్లె గ్రామంలో దేవి రెడ్డి సుబ్బారెడ్డి అధ్యక్షతన మరియు బి కోడూరు మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు రమణారెడ్డి అధ్యక్షతన మహానాడు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహానాడులో అధిష్టాన నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేల ప్రసంగాలను ప్రజలకు చేరువుగా తెలియ చెప్పేందుకు భారీ ఎల్ఈడి స్క్రీన్ లను ఏర్పాటు చేశారు .నాయకులకు, కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఈ మహానాడు కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు .ఈ మహానాడు కార్యక్రమంలో బద్వేలు నియోజకవర్గ ఇన్చార్జి రితీష్ రెడ్డి మరియు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ వర్గీయులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొకపోవడం గమనార్హం.

## కొనుగోళ్ళు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలి

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**



భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, మే 27: తుది దశకు చేరుకున్న ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు క్షేత్ర స్థాయిలో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.బుధవారం గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు.ఇప్పటివరకు ఈ కేంద్రంలో ఎంత ధాన్యం సేకరించారు? ఎంత వరకు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేశారు అనే వివరాలను కొనుగోలు కేంద్రం నిర్వాహకులను కలెక్టర్ ఆరా తీయగా, ధాన్యం కొనుగోలు ప్రక్రియ తుది దశకు చేరుకుందని, తూకం వేసిన బస్తాలను మిల్లుకు వాహనాల ద్వారా తరలిస్తున్నామని కలెక్టర్ కు వివరించారు. తూకం వేసిన బస్తాలను జాప్యం చేయకుండా కొనుగోలు కేంద్రాల నుండి తరలించాలని కలెక్టర్ సూచించారు. ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియపై ఆరా తీశారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ పరంగా అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ముందుగానే టార్పాలిన్లు సరిపడా అందుబాటులో పెట్టుకోవడం ద్వారా వర్షాలకు ధాన్యం తడవకుండా ఉంటుందని అన్నారు. కొనుగోలు కేంద్రాల నుండి మిల్లుకు తరలించిన అనంతరం మిల్లులో అన్ లోడింగ్ వేగవంతం చేసేలా పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. సన్న రకాల సాగుపై దృష్టి సారించాలని రైతులను కోరారు.తనిఖీలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కొమిరిశెట్టి విజయ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, వ్యవసాయ అధికారిణి అఫ్జల్ బేగం, తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీఓ రాజేందర్, తదితరులు ఉన్నారు.

## వివోఏల నిరవధిక సమ్మెకు బిఆర్ఎస్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి సంఘీభావం.



భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, మే 27: వేములవాడ పట్టణంలో గత తొమ్మిది రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న వేములవాడ అర్బన్, రూరల్ మండలాల ఐకేపీ, వివోఏల ఆందోళనకు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వివోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, వారికి 20 వేల రూపాయల వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే వారికి బీమా సౌకర్యం కల్పించడంతో పాటు, విధుల నిర్వహణకు అవసరమైన ట్యాబ్ మరియు నెట్ సౌకర్యాలను కల్పించాలని కోరారు. అర్హులైన వారికి సీసీలుగా పదోన్నతులు కల్పించాలని మరియు జీవో 58ను సవరించాలని వివోఏలు చేస్తున్న న్యాయమైన డిమాండ్లకు తమ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు గోస్కుల రవి, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షులు ఏశ తిరుపతి, సర్పంచులు ఊరడి సునీత-రాజిరెడ్డి, ముత్త సంజన-మహేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డం హన్మాండ్లు, మాజీ సర్పంచ్ సుమన్, దేవరాజు, గోపు మధు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తితోనే మానసిక ప్రశాంతత

**- విప్ ఆది శ్రీనివాస్.**

**-ఫాజుల్ నగర్ లో పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భూమిపూజ.**



భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, మే 27: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని, దైవచింతన మనిషిని సన్మార్గంలో నడిపిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.బుధవారం వేములవాడ రూరల్ మండలం ఫాజుల్ నగర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో, దేవాదాయ శాఖ మంజూరు చేసిన రూ. 46 లక్షల నిధులతో చేపట్టనున్న పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత పదేళ్లుగా గ్రామస్తులు ఎదురుచూస్తున్న పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. వేములవాడ నియోజకవర్గ పరిధిలో సుమారు 9 దేవాలయాల నిర్మాణానికి నిధులు మంజూరై, టెండర్ల ప్రక్రియ పూర్తి కావడంపై హర్షం వ్యక్తం చేశారు.

దేవాలయ పనులను నాణ్యతతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల్లోని ఆలయాల అభివృద్ధి జరిగిందని, ఇప్పుడు మళ్ళీ అదే స్ఫూర్తితో ఆలయాల పునర్నిర్మాణాన్ని చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ ధర్మ పరిరక్షణకు, ఆలయాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే వేములవాడ రాజన్న ఆలయం, సమ్మక్క సారక్క, బాసర, భద్రాచలం ఆలయాల అభివృద్ధికి, గోదావరి పుష్కరాలకు భారీగా నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## నిబంధనలకు అనుగుణంగా సిబ్బంది బదిలీల ప్రక్రియ

**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



భారత శక్తి న్యూస్,రాజన్న సిరిసిల్ల, మే 27: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న సిబ్బంది బదిలీల ప్రక్రియను నిబంధనలు అనుగుణంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధ్యక్షతన నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ఈ బదిలీల ప్రక్రియలో ముందుగా ఆయా ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది వివరాలను సంబంధిత జిల్లా అధికారులు కలెక్టర్ కు అందజేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న స్థానం నుండి ఇతర స్థానాలకు పారదర్శకంగా సిబ్బందిని బదిలీ చేశామని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రక్రియలో ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు.

భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, మే 27: వేములవాడ మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారుల ఎంపిక కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు.ఈ నెల 29వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో ఈ ఇంటర్వ్యూలు జరుగుతాయని కమిషనర్తెలిపారు.ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు, రెండు ఫోటోలు మరియు బ్యాంక్ పాస్ బుక్ వెంట తీసుకురావాలని తెలిపారు.అభ్యర్థులు పైన పేర్కొన్న పత్రాల ఒరిజినల్స్‌తో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా తీసుకురావాలని కమిషనర్ తెలిపారు.

## జగిత్యాల ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోమని ఆదేశించాం

**- మంత్రి పొన్నం ప్రభాకర్**

**-డ్రైవర్ ను తొలగించడంలో అతి చేసిన డిపో మేనేజర్ వేరే డిపోకు బదిలీ..!**



భారత శక్తి న్యూస్,రాజన్న సిరిసిల్ల, మే 27:మంగళవారం డ్రైవర్ పై మా కాంగ్రెస్ నాయకుడు ఇచ్చిన కంప్లైంట్ ఆధారంగా స్థానిక అధికారులు తొందరపడి రిమూవల్ లెటర్ ఇచ్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.అతను చేసింది పెద్ద తప్పు కాదని.. సస్పెండ్ చేయొద్దని నేను ఆదేశాలు ఇచ్చానని అన్నారు.అదే విధంగా తొందరపడి రిమూవల్ లెటర్ ఇచ్చిన డిపో మేనేజర్‌ను వేరే డిపోకు బదిలీ చేయమని చెప్పానని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## లక్ష్మీపతి గూడెం, చౌదరి గూడెం గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి... కౌన్సిలర్ కుమ్మరి కృష్ణ



గడ్డపోతారం మున్సిపల్, మే 27 (భారత శక్తి న్యూస్): సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని లక్ష్మీపతి గూడెం,చౌదరి గూడెం గ్రామాలలో సుమారు మూడు కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు స్థానిక పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి,మున్సిపల్ కౌన్సిలర్ కుమ్మరి కృష్ణ చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన గడ్డపోతారం మున్సిపల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు.మున్సిపల్ కౌన్సిలర్ కుమ్మరి కృష్ణ మాట్లాడుతూ గడ్డపోతారం మున్సిపల్ అభివృద్ధికి ప్రభుత్వం పలు నిధులను కేటాయించడం సంతోషకరమని అన్నారు. ముఖ్యంగా లక్ష్మీపతి గూడెం, చౌదరి గూడెం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేసి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో గడ్డపోతారం మున్సిపల్ చైర్మన్ గద్దె సుష్మ గణేష్, వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ తో పాటు ప్రజాప్రతినిధులు, డా. నల్లగండ్ల అశోక్ కుమార్ పటేల్, అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వై.ఎస్.ఆర్.కడప జిల్లా గ్రామీణ విలేఖరులకు ఈ నెల 30,31 తేదీల్లో పునశ్చరణ తరగతులు.

వై.ఎస్.ఆర్.కడప జిల్లా, మే19(భారత శక్తి ): వై.ఎస్.ఆర్.కడప జిల్లా 'జిల్లా పరిషద్ సమావేశ మందిరం' లో సి.ఆర్. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో వై.ఎస్.ఆర్. కడప జిల్లా గ్రామీణ విలేఖరులకు రెండు రోజుల పాటు పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సి.ఆర్.మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ ఓ ప్రకటన లో తెలిపారు. వై.ఎస్.ఆర్. కడప జిల్లా జిల్లా పరిషత్ సమావేశ మందిరం లో ఈ తరగతులు ఈ నెల 30,31 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన పాత్రికేయ ప్రముఖుల ద్వారా పత్రికా కథనాల కు సంబంధించి వివిధ అంశాలపై గ్రామీణ విలేఖరులకు పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. వార్తా కథనాలు రాయడం లో "కృత్రిమ మేధ" (ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్) వంటి ఆధునిక పద్ధతుల వినియోగాన్ని గురించి ఈ తరగతుల్లో వివరించడం జరుగుతుందని తెలిపారు.ఈ అంశం పై సీనియర్ జర్నలిస్టు విజయకుమార్ కుర్రా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరంగా తెలియచేస్తారని ఆయన తెలిపారు. గ్రామీణ రిపోర్టింగ్ లో మెళు కువలు, విలేఖరుల నుంచి డెస్క్ ఏమి కోరుకంటుంది అనే అంశాల పై, "క్రైమ్ రిపోర్టింగ్" పై మెళకువలు, "పత్రికా భాష" వంటి అంశాల పై రెండురోజుల పునశ్చరణ తరగతుల్లో గ్రామీణ విలేఖరులకు పూర్తి స్థాయి శిక్షణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. శిక్షణ లో పాల్గొన్న గ్రామీణ జర్నలిస్టులకు సి.ఆర్.మీడియా అకాడమీ తరపున "సర్టిఫికెట్లు" ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. శిక్షణలో పాల్గొన దలచిన గ్రామీణ విలేఖరులు తమ వివరాలు ఈ నెల 28 వ తేదీ లోపు "ఆన్ లైన్ లింక్ (గూగుల్ షీట్)" లో నమోదు చేసుకోవాలని సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ సూచించారు.

## కార్ల క్రయవిక్రయాల్లో భారీ మోసం.. నిందితుడి అరెస్ట్, రిమాండ్ కు తరలింపు.

**-నమ్మించి కార్లు కాజేసిన కిలాడీ అరెస్ట్.**



భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, మే 27: కార్ల క్రయవిక్రయాల పేరిట ఇద్దరిని నమ్మించి మోసానికి పాల్పడిన వ్యక్తిని ఇల్లంతకుంట పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను సిరిసిల్ల రూరల్ సిఐ కదిరి నాగేశ్వరరావు వెల్లడించారు. గంగాధర మండలం కొండన్నపల్లి గ్రామానికి చెందిన ఉత్తం రఘు అనే వ్యక్తి తనను నమ్మించి ఆర్థికంగా మోసం చేశాడని ఇల్లంతకుంటకు చెందిన దయ్యాల కిషోర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.ఫిర్యాదు వివరాల ప్రకారం, సుమారు 22 నెలల క్రితం కిషోర్ తన స్విఫ్ట్ డిజైర్ కారును రూ. 6.10 లక్షలకు రఘుకు విక్రయించేందుకు ఒప్పందం చేసుకున్నాడు. కాగా, కారుపై అప్పటికే ఉన్న మహీంద్రా ఫైనాన్స్ లోన్‌ను క్లియర్ చేస్తానని రఘు నమ్మించాడు.కిషోర్ తన పేరు మీద టీవీఎస్ ఫైనాన్స్‌లో రూ. 5.40 లక్షల లోన్ తీసుకుని, అందులో నుంచి రూ. 4 లక్షలను రఘు ఖాతాలోకి బదిలీ చేశాడు.కానీ, రఘు మాత్రం ఆ డబ్బులను తన సొంత అవసరాలకు వాడుకుని, ఎన్‌ఓసి (చీూజ) ఇవ్వకుండా మోసం చేశాడు.ఆ తర్వాత రఘు, తన స్నేహితుడు మహేందర్ సాయంతో 'టీవీఎస్ ఫైనాన్స్ నుంచి కారు సీజ్ చేస్తున్నాం' అని అబద్ధం చెప్పి, ఫిర్యాది నుంచి కారును తీసుకుని వెళ్లి వేరొకరికి అమ్మేశాడు. ఇదే కాకుండా, మరొక స్విఫ్ట్ కారును కూడా రూ. 5 లక్షలకు కొనుగోలు చేస్తానని కిషోర్‌ను నమ్మించి, రూ. 1.90 లక్షలు మాత్రమే ఇచ్చి, మిగిలిన డబ్బులు ఇవ్వకుండా కారును కూడా తన వద్దే ఉంచుకుని మోసం చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇల్లంతకుంట ఎస్సై అశోక్ కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు, నిందితుడు ఉత్తం రఘును అదుపులోకి తీసుకుని బుధవారం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు సిఐ నాగేశ్వరరావు తెలిపారు.

## తమిళనాడుకు చెందిన తండ్రి, కుమారుడు, వృద్ధ మహిళ ఆచూకీ కోసం కుటుంబ సభ్యుల విన్నపం

విజయవాడ, రాజన్న సిరిసిల్ల, మే 27: తమిళనాడు రాష్ట్రంలోని వెల్లూరు రేంజ్ క్రైం బ్రాంచ్ సీఐడీ అధికారులు ముగ్గురు కనిపించకుండా పోయిన ఘటనపై ప్రజల సహకారం కోరుతున్నారు. రాణిపేట జిల్లా అరక్కోణం రోడ్డు పరిధిలోని సోలింఘర్ గ్రామానికి చెందిన డి. రాజేష్ కుమార్ (39), ఆయన కుమారుడు ఆర్. సశ్వంత్ రాజేష్ (7), తల్లి డి. లలిత (65)లు 13 నవంబర్ 2022 నుండి కనిపించకుండా పోయినట్లు వెల్లూరు సీబీసీఐడీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనిపై డి. రాజేష్ కుమార్ భార్య శ్రీమతి ఆర్. సూర్య (36) ఫిర్యాదు చేసినట్లు తమిళనాడు వెల్లూరు రేంజ్ క్రైం బ్రాంచ్ సీఐడీ డీఎస్పీ బి. సురేష్ పాండ్యన్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. కుటుంబ సమస్యల కారణంగా డి. రాజేష్ కుమార్ తన కుమారుడు ఆర్. సశ్వంత్ రాజేష్, తల్లి డి. లలిత ను తీసుకొని వెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గత మూడున్నర సంవత్సరాలుగా భర్త, కుమారుడు, అత్త ఆచూకీ తెలియక కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు.కుటుంబంలో ఏవైనా అపార్థాలు, మనస్పర్థలు ఉన్నా వాటిని పెద్ద మనసుతో క్షమించి, గత విషయాలను మరచి మళ్లీ అందరం కలిసి సంతోషంగా జీవించాలని కుటుంబ సభ్యులు కోరుకుంటున్నారు. కుటుంబ సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకుని తిరిగి ఇంటికి రావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పై ముగ్గురు ఎక్కడైనా కనిపించినా, ఆచూకీ తెలిసినా సమీప పోలీస్ స్టేషన్‌కు, కటుంబ సభ్యులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. క్రైం బ్రాంచ్ సీఐడీ: 98658 68988, 94981 05739, 0416-2263834 కుటుంబ సభ్యులు పెద్ద అక్క: 83309 43925, చిన్న అక్క: 96771 36687, భార్య సూర్య: 63749 27726

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**-మిల్లుల వద్ద అన్‌లోడింగ్‌లో ఆలస్యం వద్దు.**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 27(భారత శక్తి): జిల్లాలో మిగిలి ఉన్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం యన సోన్ మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని రికార్డులను పరిశీలించి, ఐకేపీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేంద్రానికి వచ్చిన ధాన్యం పరిమాణం, ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం, తేమ శాతానికి వచ్చి ఇంకా తూకం వేయాల్సిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు."నిర్ణీత తేమ శాతానికి రాగానే ధాన్యాన్ని వెంటనే తూకం వేయాలని, లారీల ద్వారా మిల్లులకు తరలించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తూకం వేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉండకూడదని కలెక్టర్స్పష్టం చేశారు.అంతకుముందు కలెక్టర్ జాఫ్రాపూర్ గ్రామంలోని పలు రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు వస్తున్న ధాన్యం లారీల అన్‌లోడింగ్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. మిల్లుల వద్ద వేచి ఉన్న లారీల వివరాలు, అన్‌లోడింగ్ వేగంపై అధికారులను ఆరా తీశారు. రానున్న రోజుల్లో వాతావరణ మార్పులు, వర్ష సూచనలను దృష్టిలో ఉంచుకుని ధాన్యం అన్‌లోడింగ్‌లో ఎలాంటి ఆలస్యం జరగకుండా చూడాలని సూచించారు. అవసరమైతే హమాలీల సంఖ్యను పెంచి ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లర్లకు స్పష్టం చేశారు. పౌరసరఫరాలు, మార్కెటింగ్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ రైస్ మిల్లర్లతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అనంతరం మామడ మండలం కొరిటికల్ గ్రామంలోని రైస్ మిల్లులు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ధాన్యం కొనుగోలు, అన్‌లోడింగ్ ప్రక్రియలను వెంటవెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, తహసిల్దార్లు సంతోష్, శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఈతకు వెళ్లిన వ్యక్తి మృతి



ములుగు జిల్లా ప్రతినిధి, మే 27 (భారత శక్తి): వ్యాయామంచేయడానికి ఈతకు వెళ్లిన వ్యక్తి నీటిలో మునిగి మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ములుగు జిల్లా కేంద్రానికి చెందిన యార మల్లయ్య (47), అతని కుమారుడు యార బన్నీ తో పాటు మరో పదిమంది వ్యాయామం కోసం ఈత కొట్టడానికి ములుగు మండలం మదనపల్లి గ్రామ సమీపంలోని లోకం చెరువుకు బుధవారం ఉదయం 8 గంటలకు చేరుకుని, అందరూ కలిసి ఈత కొట్టిన అనంతరం పలువురు ఒడ్డుకు చేరగా మల్లయ్య మాత్రం ఊపిరాడక నీటిలోనే మునిగి మృతి చెందాడు. ఉదయం వీచిన గాలీతో అలలకు నీటిలో తేలియాడుతూ చెరువు కట్టకు కొట్టుకువచ్చాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మల్లయ్య మృతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

## మహిళలపై వేధింపుల నిరోధక చట్టంపై ధర్మపురి మున్సిపల్‌లో అవగాహన కార్యక్రమం



జగిత్యాల, మే 27 (భారతశక్తి ప్రతినిధి): జిల్లా మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన––ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మహిళల వారోత్సవాల సందర్భంగా మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం ధర్మపురి పురపాలక సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల భద్రత, గౌరవం, హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం అనేక చట్టాలను అమలు చేస్తోందన్నారు. కార్యాలయాలు, విద్యాసంస్థలు తదితర ప్రాంతాల్లో మహిళలపై వేధింపులను అరికట్టడంలో ఈ చట్టం కీలకంగా పనిచేస్తుందని తెలిపారు. మహిళలు తమ హక్కులపై అవగాహన కలిగి సమస్యలు ఎదురైనప్పుడు సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం. శ్రీనివాస్, వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, వార్డు కౌన్సిలర్లు సంగనబట్ల సంతోషిని, విరవేణి నాగలక్ష్మి, జంజిరికాని సువర్ణ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు అశెట్టి మమత, గరిగే అరుణ, మెప్మా టీఎంసీ రాధా, మహిళా సంఘాల కార్యకర్తలు, మహిళా సంక్షేమ శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

## జిల్లాలో ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్ళు

**-నిరంతరం కొనుగోలు కేంద్రాలు, మిల్లులను పర్యవేక్షిస్తున్న అధికారులు**



భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, మే 27: జిల్లాలో యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతుంది. రైతులు పండించిన ధాన్యాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేసేందుకు జిల్లా యంత్రాంగం విస్తృత చర్యలు తీసుకుంటుంది. రోజూ వారీగా సంబంధిత శాఖల జిల్లా అధికారులతో పాటు, అన్ని మండలాల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను, మిల్లులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం, రాగట్లపల్లి, బొప్పాపూర్ లోని కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేక అధికారి అఫ్జల్ బేగం, బోయినిపల్లి మండలం కోరెం, అనంతపల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేక అధికారి శరత్, ముస్తాబాద్ మండలం వెంకట్రావుపల్లి, బందనకల్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేక అధికారి రాఘవేందర్, గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్, గజసింగవరం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేక అధికారి హనుమంతు, వేములవాడ రూరల్ మండలం మల్లారం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి లక్ష్మీరాజం, చందుర్తి మండలం మూడపల్లి, నర్సింగాపూర్, ఆశిరెడ్డిపల్లి, తిమ్మాపూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేక అధికారి రవీందర్ రెడ్డి, వేములవాడ అర్బన్ మండలం చంద్రగిరి, మారుపాక గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ బుధవారం క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. ఎక్కువ శాతం ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు, గోదాములకు తరలించడం జరిగిందని, సేకరించిన ధాన్యం తడవకుండా ముందుగానే టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవడం ద్వారా మంగళవారం రాత్రి వర్షం కురిసిన వర్షానికి ఎలాంటి నష్టం సంభవించలేదని తెలిపారు. కొనుగోళ్లకు సంబంధించి సంబంధిత శాఖల జిల్లా అధికారులతో పాటు, జిల్లాలోని మండలాల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఇతర సిబ్బంది తమ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి, క్షేత్ర స్థాయిలో రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సూచనలు చేస్తూ, కొనుగోళ్ళ ప్రక్రియ వేగవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. రైతుల నుండి తూకం వేసి సేకరించిన ధాన్యం మిల్లులకు తరలించేందుకు వాహనాలు అందుబాటులో ఉండేలా, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షిస్తున్నారు.

## పర్యావరణ పరిరక్షణలో ప్రకృతి ప్రకాష్, బ్లెసిల కృషి అభినందనీయం.

**-గవర్నర్ సంయుక్త కార్యదర్శి చేతుల మీదుగా సత్కారం.**



భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, మే 27: పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు లక్ష్యంగా విత్తన బంతుల తయారీలో విశేష కృషి చేస్తున్న ప్రకృతి ప్రకాష్, బ్లెసిలను గవర్నర్ సంయుక్త కార్యదర్శి శశికిరణాచారి అభినందించారు. బుధవారం లోక్ భవన్‌లోని సుధర్మ కార్యాలయంలో వారు సంయుక్త కార్యదర్శిని కలిసి, తాము చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. పచ్చదనం పెంపునకు విత్తన బంతులు ఎలా తోడ్పడతాయో ఆయనకు వివరించి, తాము తయారు చేసిన బంతులను ప్రదర్శించారు. పర్యావరణంపై వారికున్న అంకితభావం పట్ల ఆయన ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా ప్రకృతి ప్రకాష్, బ్లెసిలను మెమెంటో శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రెస్ సెక్రటరీ మామిండ్ల దశరథం పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి భవనాలను సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి.

**-స్వయం ఉపాధి రంగాలపై మహిళలు దృష్టి పెట్టాలి: జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**-రాజేశ్వర్ రావు కాలనీలో ఇందిరా మహిళా శక్తి భవనాన్ని ప్రారంభించిన కలెక్టర్**



భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, మే 27: మహిళా సంఘాల సభ్యులు తమ గ్రామాల్లో నిర్మిస్తున్న నూతన ఇందిరా మహిళా శక్తి భవనాలను సద్వినియోగం చేసుకోవాలని, క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి, సమాజంలో జరిగే అన్ని అంశాలపై చర్చించుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మహిళా వారోత్సవాల సందర్భంగా గంభీరావుపేట మండలం రాజేశ్వర్ రావు కాలనీలో నూతనంగా నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవనాన్ని జిల్లా కలెక్టర్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రాజరాజేశ్వర గ్రామైఖ్య సంఘం సభ్యుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళా సంఘాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అనేక రకాలుగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. మహిళా సంఘాల సభ్యులు క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తూ ఇందిరా మహిళా శక్తి భవనాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశాలు నిర్వహించినప్పుడు సమాజంలో జరిగే అన్ని విషయాలపై చర్చించి, ఒకరికొకరు తమ ఆలోచనలు పంచుకోవాలని సూచించారు. తద్వారా అందరూ సమాజంలో జరుగుతున్న విషయాలపై కొంత మేరకు అవగాహన కలిగి ఉంటారని అన్నారు. గ్రామాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలు నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, దీనిలో భాగంగా మన జిల్లాలో ఇప్పటివరకు 113 భవనాలు నిర్మించడానికి అనుమతులు మంజూరు చేశామని, ఇప్పటివరకు 103 భవనాలు గ్రౌండింగ్ పూర్తి చేసి వివిధ దశల్లో నిర్మాణ పురోగతిలో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ విషయంలో రాష్ట్ర స్థాయిలో మన జిల్లా మొదటి స్థానంలో ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో మొట్టమొదటగా రాజేశ్వర్ రావు కాలనీలో మహిళా శక్తి భవనం పూర్తి స్థాయిలో నిర్మించబడి, అందుబాటులోకి వచ్చిందని అన్నారు. తక్కువ సమయంలోనే భవనాన్ని నిర్మించినందుకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. వివిధ దశల్లో ఉన్న భవనాల నిర్మాణం సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేలా పర్యవేక్షణ చేస్తున్నామని పేర్కొన్నారు. మహిళా సంఘాలు అంటే కేవలం రుణాలు తీసుకోవడం, చెల్లించడం వరకు మాత్రమే పరిమితం కావద్దని, ప్రతీ విషయం సభ్యులు అవగాహన కలిగి ఉండాలని, స్వయం ఉపాధి రంగాల వైపు దృష్టి పెట్టి ఆర్థికంగా ఎదిగేందుకు స్థిరమైన ప్రణాళికలు రూపొందించుకోవాలని కలెక్టర్ కోరారు. ప్రతీ సమావేశానికి మండల స్థాయి అధికారులను ఆహ్వానించి వారు అందించే సలహాలను స్వీకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కొమిరిశెట్టి విజయ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీఓ రాజేందర్, సర్పంచ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాలతో రైతులకు నష్టం కలగకుండా వేగంగా ధాన్యం మిల్లులకు తరలించాలి

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**





కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మే27: జిల్లాలో కొనసాగుతున్న వరి కొనుగోలు ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. కామారెడ్డి మండలంలోని ఉగ్రవాయి గ్రామంలో ఉన్న గురు రాఘవేంద్ర రైస్ మిల్‌ను తనిఖీ చేసి, ధాన్యం నిల్వలు, రవాణా , మిల్లింగ్ ప్రక్రియపై అధికారులతో సమీక్ష చేసి ప్రతి రోజు కనీసం 15 లారీల ధాన్యం దించుకోవాలి అని మిల్లర్ లను ఆదేశించారు. అనంతరం శాబ్దిపూర్ వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. సదాశివనగర్ మండలంలోని అడ్లూరి ఎల్లారెడ్డి వరి కొనుగోలు కేంద్రం, శ్రీ మన్నారాయణ రైస్ మిల్‌లను పరిశీలించారు. అకాల వర్షాల కారణంగా జిల్లాలో సుమారు 1,100 మెట్రిక్ టన్నుల వరి పంట దెబ్బతిన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 3,78,000 మెట్రిక్ టన్నుల వరి సేకరణ పూర్తయినట్లు తెలిపారు. ఇందులో ప్రస్తుతం 1,064 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలో ఉన్నట్లు పేర్కొన్నారు. వర్షాల వల్ల ధాన్యం తడవకుండా వెంటనే మిల్లులకు తరలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద నీరు నిల్వ ఉండకుండా కంధకం కాలువలు ఏర్పాటు చేయాలని, ధాన్యం కుప్పలను టార్పాలిన్‌లతో క్రింది నుండి పైకి, పైనుండి క్రిందకు కప్పి ఉంచాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ విక్టర్, సివిల్ సప్లయ్ అధికారి వెంకటేశ్వర్లు, డిఎమ్ శ్రీకాంత్, తహశీల్దార్లు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలి

**- దేశవ్యాప్తంగా “గాయ్ రక్షక్ దళ్” ఏర్పాటు**

**- భారత ఐక్యత కోసం ముస్లింల త్యాగాలు చారిత్రాత్మకం**

**- రాజ్యాంగ పరిరక్షణ వేదిక, ఫౌండర్ జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ ఆలీ**



ఖమ్మం జిల్లా బ్యూరో, భారత శక్తి, మే 27 : భారతీయ సంస్కృతి, సహజీవన స్ఫూర్తి, మానవతా విలువలకు ప్రతీకగా గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక, ఫౌండర్ జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ ఆలీ పిలుపునిచ్చారు. ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గోమాత రక్షణ కేవలం ఒక మతానికో, వర్గానికో పరిమితం కాదని, అది భారతీయ సంస్కృతి, జాతీయత, మానవత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా “గాయ్ రక్షక్ దళ్” ఏర్పాటు ద్వారా గోవుల సంరక్షణకు సమగ్ర విధానాలు తీసుకురావాలని సూచించారు. ప్రతి గోశాలకు బీమా సదుపాయం, పశువైద్యులచే ప్రతి 15 రోజులకు వైద్య పరీక్షలు, ప్రత్యేక బీడు భూముల కేటాయింపు వంటి చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. “హమ్ గాయ్ భక్షక్ నహీ... గాయ్ రక్షక్ హై” అనే సందేశాన్ని దేశవ్యాప్తంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. గోవధ ఫ్యాక్టరీలకు ముస్లింల పేర్లు పెట్టి సామాజిక విద్వేషాలను కొందరు మతోన్మాదులు రెచ్చగొట్టడం సరికాదని ఆయన స్పష్టం చేశారు. అలాంటి ఫ్యాక్టరీలను నిర్వహించే వారు తమ పిల్లల పేర్లతోనే వ్యాపారాలు కొనసాగించాలని సూచిస్తూ, సమాజంలో పరస్పర గౌరవం, బాధ్యతా భావం పెరగాలని హితవు పలికారు. మతాల పేర్లతో విభేదాలు సృష్టించడం కన్నా, భారతీయులుగా ఐక్యంగా నిలబడటమే దేశానికి శ్రేయస్కరమని అన్నారు. ఈ సందర్భంగా భారత స్వాతంత్ర్య పోరాటంలో ముస్లిం మహనీయుల పాత్రను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. జాతీయ జెండా రూపకల్పనలో కృషి చేసిన సూరయ్య త్యాబ్జీ, “జైహింద్” నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన అదిబ్ హసన్ సఫ్రాని, “క్విట్ ఇండియా” నినాదాన్నిచ్చిన యూసుఫ్ మెహర్ ఆలీ, నేతాజీకి విరాళాలు అందించిన అబ్దుల్ హబీబ్ యూసుఫ్ మార్ఫాని, వంటి మహనీయుల సేవలు భారత ఐక్యతకు చిరస్మరణీయమని కొనియాడారు. దేశం అనేది కేవలం భూభాగం కాదని, పరస్పర గౌరవం, సహజీవనం, త్యాగాలతో నిర్మితమైన మహోన్నత భావన అని సయ్యద్ సాదిక్ ఆలీ పేర్కొన్నారు. గోమాత పరిరక్షణతో పాటు భారతీయుల ఐక్యత కోసం అన్ని వర్గాలు కలిసి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజంలో ద్వేషం కన్నా దయ, విభజన కన్నా బంధుత్వం, మతాల మధ్య విభేదాల కన్నా భారతీయత గొప్పదనే సందేశాన్ని ఆయన వ్యాఖ్యలు ప్రతిబింబించాయి. ఈ విలేకరుల సమావేశంలో సయ్యద్ సాదిక్ అలీ, రాజ్యాంగ పరిరక్షణ వేదిక పాలేరు నియోజకవర్గం ఇంచార్జ్ నజీరుద్దీన్, కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి రాజ్యాంగ పరిరక్షణ వేదిక అధ్యక్షులు మహమ్మద్ ఖలీమ్, సైదా, సుభాని, నిజాంపేట్ కార్యదర్శి మున్నా భాయ్, హబీబ్, ఖమ్మం పట్టణ టూ టౌన్ అధ్యక్షులు అల్లా బకాష్, ఎండి. షఫీ, ఎండి. గులాం నబి, సారధి నగర్ రాజ్యాంగ పరిరక్షణ వేదిక కార్యదర్శి ఎండి గౌస్, ఎండి. ఖుద్రతుల్లా, ఎండి. హాది, ఎండి. కలీము భాయ్, ఎండి. అమ్జద్ పాషా, అల్లాభక్ష్, ఎస్కే. ఆరిఫ్ న్యాయవాది, తౌసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనంకి పాల్పడిన నిందితుల అరెస్ట్

**- రెండు గ్రాముల బంగారు కమ్మ, 6 సెల్ ఫోన్లు స్వాధీనం**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 27 (భారత శక్తి ): బిలాస్ పూర్ ఎక్స్ ప్రెస్ ట్రైన్ లో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రోజున అర్ధరాత్రి దొంగతనం కి పాల్పడ్డారు అని జి ఆర్ పి ఎస్ ఐ లు ప్రకటనలో తెలిపారు. వివరాలు ఎస్సై మహేందర్ , సుధాకర్, బి. ఎన్ సింగ్, రాజేంద్ర ప్రసాద్, క్రాంతి (జ×దీ –ఖ్రాఫీ) ఆర్ పి ఎఫ్ లు, సిబ్బందితో కలిసి నిందితుల గాలింపు చర్యలో భాగంగా బుధవారం రోజున మంచిర్యాల రైల్వే స్టేషన్ లో అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి పేర్లు అడగగా మహమ్మద్ రెహన్ ం /శీ షాకీర్, ధ్రువ రాఘవేంద్ర ం /శీ రాము, ధ్రువ వెంకటేశ్వర్లు ం/శీ రాము, మైనర్ లు తెలపగ వారిని పూర్తి వివరాలు అడగగా సరైన సమాధానం చెప్పక పోవడంతో వారిని పూర్తిస్థాయిలో విచారించగా వారు సోమవారం రోజున రాత్రి బిలాస్ పూర్ ఎక్స్ ప్రెస్ ట్రైన్ లో 2 గ్రామ్ ల చెవి కమ్మ, సెల్ ఫోన్ లు దొంగతనం చేసినట్టు ఒప్పుకోవడం జరిగింది అని అన్నారు. వాటిని వారి వద్ద నుండి స్వాధీనం చేసుకొని ముగ్గురు నిందితులను రిమాండ్ కి తరలించి అందులో ఒక వ్యక్తిని జూనైనల్ హోమ్ కు తరలించడం జరిగిందని తెలిపారు. 2 గ్రామ్స్ బంగారు చెవి కమ్మ విలువ 20, 000 వేల రూపాయలు, 06 మొబైల్స్ విలువ 80,000 ఉంటుందని ఎస్ఐ మహేందర్ ఒక ప్రకటన తెలిపారు. ఇట్టి కేసులో దర్యాప్తుకు సహకరించిన రైల్వే హెడ్ కానిస్టేబుల్ కి సురేష్ గౌడ్, కే.తిరుపతి రైల్వే కానిస్టేబుళ్లు ఎస్ కుమార్ కృష్ణ కర్, టి మల్ల గౌడ్, పి.మహేష్, ఆర్ పి ఎఫ్ సిబ్బంది బి స్వామి, సుజిత్ కుమార్ సిఐబి కానిస్టేబుల్ లను ఉన్నతాధికారులు అభినందించారు.

## 13వ వార్డులో డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన



జగిత్యాల, మే 27 (భారతశక్తి ప్రతినిధి): ధర్మపురి పట్టణ అభివృద్ధిలో భాగంగా 13వ వార్డులో నూతన డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి, వార్డు కౌన్సిలర్ చీపిరిశెట్టి రాజేష్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వేముల నాగలక్ష్మి మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో సమానంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. కౌన్సిలర్ రాజేష్ మాట్లాడుతూ వార్డు ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని పనులు ప్రారంభించామని, త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలి

**- ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి**

**జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు**



ములుగు జిల్లా ప్రతినిధి, మే 27 (భారత శక్తి): రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. బుధవారం ములుగు మండలం ఇంచర్ల గ్రామంలోని పి.ఏ.సి.ఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు, జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి. హెచ్. మహేందర్ జి తో కలిసి పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు తాగునీరు, నీడ, వంటి మౌలిక సౌకర్యాలు తప్పనిసరిగా కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం, జాప్యం చోటు చేసుకోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాల ప్రకారం వేగంగా కొనుగోలు చేసి, కొనుగోలు అనంతరం ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాల్లో తగిన టార్పాలిన్లు, కవర్లు సిద్ధంగా ఉంచాలని, ధాన్యం తడవకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షం కారణంగా రైతులు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, రైతులకు డబ్బుల చెల్లింపులు సమయానికి జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులు ఎటువంటి మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురావాలని సూచించారు. రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిఎం క్రిష్ణవేణి, సంబంధిత శాఖల అధికారులు, పి.ఏ.సి.ఎస్ ప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, కొనుగోలు కేంద్ర సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గోంది పల్లి గ్రామంలో హౌస్ సర్వే ను పరిశీలించన జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



వై ఎస్ ఆర్ కడప జిల్లా,మే27(భారత శక్తి ): వేముల మండలం గోంది పల్లి గ్రామంలో హౌస్ సర్వే ను జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట డి ఆర్ ఓ మల్లికార్జునుడు, పులివెందుల ఆర్ డి ఓ చిన్నయ్య సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## తూతూ మంత్రంగా ఎస్సీ లబ్ధిదారుల ఇంటర్వ్యూ



ములుగు జిల్లా ప్రతినిధి, మే 27 (భారత శక్తి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువతీ యువకుల ఇంటర్వ్యూలు తూతూ మంత్రంగా నిర్వహించారు. గత సంవత్సరం వివిధ పథకాల కు నిరుద్యోగ యువతీ యువకులు ఎస్సీ కార్పొరేషన్ నుండి దరఖాస్తులు చేసుకోగా ములుగు మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం లబ్ధిదారుల ఇంటర్వ్యూలు నిర్వహించగా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయ సంబంధిత అధికారులు మాత్రం ఒక్కరు కూడా హాజరు కాలేదు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చింత నిప్పుల చంద్రకళ, వైస్ చైర్మన్ షాహిని మీర్జా, ఎస్బిఐ మేనేజర్ అనిల్, మెప్మా అధికారిని, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకు సమ న్యాయం: నీలం మధు ముదిరాజ్



సంగారెడ్డి జిల్లా, మే 27 (భారత శక్తి న్యూస్): తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వంగా అన్ని వర్గాలకూ సమ న్యాయం చేస్తోందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వీరనారి, బహుజన ఆత్మగౌరవ ప్రతీక చాకలి ఐలమ్మ వారసత్వాన్ని గౌరవిస్తూ, ఆమె మనవరాలు చిట్యాల శ్వేతను రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, నూతనంగా నియమితులైన మహిళా కమిషన్ సభ్యురాలు చిట్యాల శ్వేత బుధవారం చిట్కుల్ లోని ఆయన కార్యాలయంలో నీలం మధు ముదిరాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా కప్పి, మిఠాయి తినిపించి నీలం మధు ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు, సాయుధ పోరాట యోధులకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కొనియాడారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ కుటుంబానికి సముచిత స్థానం కల్పిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నేడు చిట్యాల శ్వేతను మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమించి తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని కొనియాడారు. ఇది బహుజన వర్గాలకు, ముఖ్యంగా రజక సామాజిక వర్గానికి దక్కిన గౌరవంగా అభిప్రాయపడ్డారు.

అనంతరం చిట్యాల శ్వేత మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇంతటి బాధ్యతాయుతమైన పదవిని అప్పగించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు చిట్యాల శ్వేత ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనను అభినందించిన నీలం మధు ముదిరాజ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ చాకలి ఐలమ్మ ఆశయాలకు అనుగుణంగా గతంలో చిట్కుల్ లో ఏర్పాటు చేసిన ఐలమ్మ కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆమె గుర్తుచేసుకున్నారు, రాష్ట్రంలో మహిళల భద్రత, హక్కుల పరిరక్షణకు వారి సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన ఉద్యమ రాష్ట్ర నాయకుడు ఊట్ల గ్రామ నీ కి చెందిన రాష్ట్ర సుంకర బోయిన మహేష్ ముదిరాజ్, బహుజన ఉద్యమ నాయకులు పాల్గొన్నారు.

# రాజకీయ కోణంలో కాకుండా రైతుల కోణంలో ఆలోచించండి.

**-రైతు గోస- బీజేపీ భరోసా యాత్రలో రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, బిజెపి ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి.**



రేగొండ,మే 27(భారత శక్తి) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైతులను రాజకీయ కోణంలో కాకుండా రైలు రైతులకు మేలు చేసే ప్రభుత్వంగా ఆలోచించి రైతుల వరి మొక్కజొన్నలను సత్వరమే కొనుగోలు చేయాలని, తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు బి జె ఎల్ పి నేత వెంకట రమణారెడ్డి అలాగే తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిజెపి ఆధ్వర్యంలో పరిగి నుండి ప్రారంభమైన 'రైతుల గోస -బిజెపి భరోసా' యాత్రలో భాగంగా రైతుల వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తూ ప్రభుత్వానికి రైతుల దుస్థితిని తెలియపరచడం కోసం రైతు ప్రభుత్వాన్ని చెప్పుకునే రేవంత్ రెడ్డి సీఎం ఆధ్వర్యంలో నడుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కి తెలియపరచాలని ఉద్దేశంతో ఈ యాత్ర చేపట్టినట్టు వారు తెలిపారు. తెలంగాణలోని పరిగి నుండి ప్రారంభమైన యాత్ర బుధవారం రేగొండకు చేరుకుంది. ఈ సందర్భంగా రేగొండ మండల అధ్యక్షులు బండి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల జిల్లా సంబంధించిన కార్యకర్తలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. అనంతరం ఇక్కడ నుంచి బయలుదేరి వెళ్లిన యాత్ర లో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులతో నేరుగా మాట్లాడిన అనంతరం ఎంపీలు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇకనైనా రైతుల ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేసి గోడంలకు తరలించాలని డిమాండ్ చేశారు. వర్షాకాలం ప్రారంభం కానున్న దృశ్య ఆరు కాలం పండించిన రైతులు ధాన్యం జొన్నలు తడవడం మూలంగా నష్టపోయే పరిస్థితి ఉందని సత్వరమే కొనుగోలు చేసి ఘోరములకు తరలించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్ రావు, ఎమ్మెల్యేలు తాటిపల్లి వెంకటరమణా రెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, రామారావు పటేల్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కిషన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బస్వాపురం లక్ష్మీ నరసయ్య, రాగిడి తిరుపతిరెడ్డి, మైపాల్ రెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు ఏడు నూతల నిశీదర్ రెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెన్నంపల్లి పాపయ్య, సీనియర్ నాయకులు స్థానిక మాజీ సర్పంచ్ ఏడు నూతుల విజేందర్ రెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ తిరుపతి రెడ్డి, కన్నం యుగదీశ్వర్ జిల్లా కార్యదర్శి సుంకరి మనోహర్ దేశ్మి సాంబయ్య గన్ రెడ్డి లింగారెడ్డి మెతుకుపల్లి బుచ్చిరెడ్డి, బాగర్తి పేట సర్పంచ్ శ్రీలత తిరుపతి గౌడ్ కనపర్తి ఉప సర్పంచ్ గుర్రం రమేష్, బీజేవైఎం జిల్లా నాయకులు గాలిఫ్,దాసరి తిరుపతిరెడ్డి, బండారి రవి, కూరాకుల చిన్న మల్లయ్య, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బోయినపల్లిలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి.

**-నలుగురు అరెస్ట్, నగదు స్వాధీనం.**




భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, మే 27: బోయినపల్లి మండలం తడగొండ గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు బోయినపల్లి ఎస్సై ఎన్. రమాకాంత్ వివరాలను వెల్లడించారు. తడగొండ శివారులో కొంతమంది వ్యక్తులు డబ్బులు పందెంగా కాస్తూ 3 కార్డ్స్ పేకాట ఆడుతున్నారనే సమాచారం అందినట్లు ఎస్సై తెలిపారు. వెంటనే స్పందించిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో దుంప మహేష్, శివరాత్రి పవన్, చల్ల జగన్, కుంచెం అనిల్ కుమార్ పేకాట ఆడుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వారి వద్ద నుండి రూ. 2,170 నగదుతో పాటు 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ పేర్కొన్నారు.

## వీర్నపల్లిలో పది నెలలుగా కనిపించకుండా పోయిన వ్యక్తి.

**-కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు.**




భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, మే 27: వీర్నపల్లి మండలం పరిధిలో తప్పిపోయిన వ్యక్తి ఆచూకీ కోసం వీర్నపల్లి ఎస్సై లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు. మండలంలోని దర్లా లక్ష్మి భర్త భుమయ్య తన కుమారుడు గత పది నెలలుగా ఇంటికి తిరిగి రావడం లేదని మరియు అతని గురించి ఎటువంటి సమాచారం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్సై లక్ష్మణ్ దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. తన కుమారుడు అదృశ్యమైన సమయం నుండి అతని కోసం అన్ని చోట్లా వెతికినా ఫలితం లేకపోయిందని తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సై లక్ష్మణ్ కేసు నమోదు చేసుకున్న అనంతరం అదృశ్యమైన యువకుడి ఫోటోలను ఇతర పోలీస్ స్టేషన్లకు పంపడంతో పాటు సాంకేతిక ఆధారాలను సేకరించే పనిలో పడ్డారు. యువకుడి ఆచూకీ తెలిసిన వారు వెంటనే వీర్నపల్లి పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

# వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ.

**-ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతమైన సేవలు అందించాలి.**




భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, మే 27: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పోలీస్ స్టేషన్ల పనితీరును మరింత మెరుగుపరిచే దిశగా బుధవారం వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు వివరాలు రౌడీషీటర్లు మరియు నేరస్తులపై నిఘా అంశాలను సమీక్షించారు. అలాగే స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఎస్పీ గారు ప్రత్యేకంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. అధికారులు,సిబ్బంది అందరూ విధులు సక్రమంగా నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని సూచించారు. సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాల పూర్తి సమాచారం దగ్గర ఉండాలని, పట్టణాల్లో,గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగినా పై అధికారులకు తక్షణమే తెలియజేయాలని సూచించారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేసి చోరీలు, గంజాయి అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన నిఘా కొనసాగించాలని సూచించారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఎస్పీ వెంట పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్,ఎస్.ఐ లు ప్రేమనదం, శ్రీనివాస్, ఎల్లగౌడ్, సిబ్బంది ఉన్నారు.

## తల్లి, కొడుకు ఆత్మహత్య

**రంగారెడ్డి (భారత శక్తి)** అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని కనకదుర్గ కాలనీలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. తండ్రి మరణాన్ని తట్టుకోలేక కొడుకు ఉరేసుకుని ఆత్మహత్యకి పాల్పడగా కొడుకు శవాన్ని చూసి తట్టుకోలేక తల్లి అక్కడే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న హృదయ విదారక ఘటన అందరిని కలిచివేసింది. కనకదుర్గ కాలనీకి చెందిన కళావతి , ఆమె కుమారుడు శివ నివాసముంటున్నారు. గత ఆరు నెలల క్రితం కళావతి భర్త హఠాన్మరణం చెందడంతో ఆ కుటుంబం తీవ్రగ్భ్రాంతికి లోనైంది. కుటుంబ పెద్దను కోల్పోయిన నాటి నుండి తల్లి, కొడుకు ఇద్దరూ తీవ్ర మానసిక వేదన అనుభవిస్తున్నారు. ఈ క్రమంలోనే జీవితంపై విరక్తి చెందిన కుమారుడు శివ, ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కండ్ల ముందే కొడుకు శవమై వేలాడటం చూసి తట్టుకోలేకపోయిన తల్లి కళావతి, తీవ్ర మనస్తాపంతో అదే చీరతో పక్కనే ఉరివేసుకుని ప్రాణాలు విడిచింది. ఒకే ఇంట్లో తల్లి, కొడుకు ఇద్దరూ శవాలుగా మారిన విషయం తెలుసుకున్న కాలనీవాసులు కన్నీరుమున్నీరవుతున్నారు. సమాచారం అందుకున్న అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## మూసాపేట ఉడిపి హోటల్‌లో బొద్దింకలు, ఈగలు

**- సీజ్ చేసిన అధికారులు**

**హైదరాబాద్ (భారత శక్తి)** సీఎంసీ ఆహార భద్రతా బృందాలు మూసాపేటలోని ఉడుపి ఉపహార్ హోటల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. ఈ తనిఖీల్లో వంటగదిలో బొద్దింకలు, ఈగలు ఉండటం, డ్రైనేజీ జామ్ కావడం, వండిన బిర్యానీ, మంచూరియా, పిండి పదార్థాలను ఫ్రిజర్లో అపరిశుభ్రంగా నిల్వ ఉంచడంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గడువు ముగిసిన ఫుడ్ లైసెన్స్తో హోటల్ నడుపుతుండటంతో అధికారులు ఆ ప్రాంగణాన్ని తక్షణమే సీజ్ చేశారు.

## అత్తాపూర్ జాయ్ ఆసుపత్రిలో ఉద్రిక్తత

**- స్టంట్ వేస్తూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి..**

**- కుటుంబ సభ్యుల ఆందోళన**

**(భారత శక్తి)**వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ప్రాణాలు కోల్పోయాడంటూ అత్తాపూర్ పరిధిలోని ప్రముఖ 'జాయ్ (జీూఎ) ఆసుపత్రి' వద్ద మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.?అసలేం జరిగిందంటే..??మధుబన్ కాలనీకి చెందిన శ్రీనివాసరావు (45) అనే వ్యక్తి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. ఆయనకు మంచి క్రికెటర్‌గా, బ్యాట్స్‌మెన్‌గా కూడా స్థానికంగా గుర్తింపు ఉంది. కాగా, నిన్న రాత్రి శ్రీనివాసరావుకు అకస్మాత్తుగా ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు మొదట సమీపంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు.?మరుసటి రోజు (ఈరోజు) ఉదయం తదుపరి వైద్యం నిమిత్తం అత్తాపూర్ లోని జాయ్ (జీూఎ) ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడ వైద్యులు ఆయనకు యాంజియోగ్రామ్ పరీక్ష నిర్వహించగా.. గుండెలో ఎడమ వైపు 90 శాతం, కుడి వైపు 10 శాతం బ్లాకులు ఉన్నట్లు గుర్తించారు. దీనికి చికిత్సలో భాగంగా వైద్యులు గుండెకు స్టంట్ (ూబివనిబి) వేసే ప్రక్రియను ప్రారంభించారు. అయితే, స్టంట్ వేస్తున్న సమయంలోనే శ్రీనివాసరావు అకస్మాత్తుగా మృతి చెందారు.?వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆగ్రహం:?ఆసుపత్రి యాజమాన్యం, వైద్యుల నిర్లక్ష్యం వల్లే శ్రీనివాసరావు ప్రాణాలు కోల్పోయారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తిని స్టంట్ పేరిట ప్రాణాలు తీశారని ఆరోపించారు. తమకు న్యాయం జరిగే వరకు శ్రీనివాసరావు మృతదేహాన్ని ఆసుపత్రి నుంచి కదిలించేది లేదంటూ భీష్మించుకు కూర్చున్నారు. ఈ క్రమంలో ఆసుపత్రి సిబ్బందిలో ఒకరిపై దాడి జరగడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది.?కన్నీరు మున్నీరవుతున్న కుటుంబ సభ్యులు:అప్పటివరకు తమతో ఎంతో యాక్టివ్‌గా ఉన్న శ్రీనివాసరావు అకస్మాత్తుగా మరణించడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నిండింది. శ్రీనివాసరావుకు 7 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. తండ్రి విగతజీవిగా పడి ఉండటం చూసి ఆ బాలుడు ఏడుస్తున్న తీరు అక్కడున్న వారిని తీవ్రంగా చలింపజేసింది.?రంగంలోకి దిగిన పోలీసులు ? కేసు నమోదు:?ఆసుపత్రి యాజమాన్యం ఇచ్చిన సమాచారం మేరకు అత్తాపూర్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులతో మాట్లాడి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అనంతరం శ్రీనివాసరావు బంధువులను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి వారి నుంచి రాతపూర్వక ఫిర్యాదును స్వీకరించి, కేసు నమోదు చేశారు.?ప్రస్తుతం పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం శ్రీనివాసరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

## కార్పొరేట్ కంపెనీల కోసం
## పేదల భూములు త్యాగం చేయొద్దు

**- విశాఖ గూగుల్ ఏఐ డేటా సెంటర్ ప్రాజెక్టుపై ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆందోళన**

పెద్దపల్లి **(భారత శక్తి)**ఎంపీ గడ్డం వంశీకృష్ణ విశాఖపట్నంలో ప్రతిపాదిత అదానీ గూగుల్ ఏఐ డేటా సెంటర్ ప్రాజెక్టుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. భారీ స్థాయిలో భూమి పూజలు నిర్వహిస్తూ, పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నప్పటికీ, ఈ ప్రాజెక్ట్ వల్ల నిజంగా స్థానిక ప్రజలకు ఎంత ప్రయోజనం కలుగుతుందో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు, మంత్రి నారా లోకేష్ గారు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొనడం ద్వారా భారీ ప్రచారం చేస్తున్నారని పేర్కొన్న వంశీకృష్ణ గారు, మరోవైపు స్థానిక ప్రజలు, ముఖ్యంగా దళితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. అనేక వార్తా కథనాల ప్రకారం ప్రజల భూములు లాక్కోవడం జరుగుతోందనే ఆరోపణలు వస్తున్నాయని, కోట్ల రూపాయల విలువైన భూములను అతి తక్కువ ధరలకు కంపెనీలకు అప్పగించడం అన్యాయమని విమర్శించారు."ఆత్మనిర్భర్ భారత్ అంటే మన దేశ యువతకు, చిన్న పరిశ్రమలకు, స్థానిక కంపెనీలకు అవకాశాలు కల్పించడం కావాలి. కానీ విదేశీ లేదా పెద్ద కార్పొరేట్ కంపెనీలకే ప్రయోజనం కలిగేలా ప్రభుత్వాలు వ్యవహరిస్తే అది ప్రజల ఆత్మగౌరవానికి విరుద్ధం," అని వంశీకృష్ణ పేర్కొన్నారు.దేశంలోని నిరుద్యోగ యువత, కార్మికులు, చిన్న వ్యాపారులు ఎన్నో ఇబ్బందులు పడుతున్న సమయంలో, వారి సమస్యలను పక్కన పెట్టి భారీ కార్పొరేట్ సంస్థలకు వేల ఎకరాల భూములు కేటాయించడం బాధాకరమని ఆయన అన్నారు. దళితుల హక్కులను కించపరిచే విధంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా ప్రజలు చూస్తూ ఊరుకోరని స్పష్టం చేశారు.గూగుల్ ఏఐ డేటా సెంటర్ల వల్ల భవిష్యత్తులో నీటి కొరత, కాలుష్య సమస్యలు, విద్యుత్ వినియోగ భారం పెరిగే ప్రమాదం ఉందని వంశీకృష్ణ గారు హెచ్చరించారు. అమెరికా వంటి దేశాల్లో ఇప్పటికే ఇలాంటి సమస్యలు తలెత్తిన ఉదాహరణలు ఉన్నాయని, విశాఖపట్నం వంటి ప్రాంతాల్లో కూడా అదే పరిస్థితి రాకుండా ముందుగానే సమగ్ర సమీక్ష చేయాలని ఆయన డిమాండ్ చేశారు."అభివృద్ధి పేరుతో ప్రజల భూములు, హక్కులు కోల్పోయే పరిస్థితి రావొద్దు. స్థానిక ప్రజల అభిప్రాయాలు తెలుసుకుని, దళితులు, పేదలు, రైతుల హక్కులను కాపాడే విధంగా మాత్రమే ప్రభుత్వం ముందుకు వెళ్లాలి," అని ఎంపీ గడ్డం వంశీకృష్ణ గారు పేర్కొన్నారు.ప్రజా హక్కుల పరిరక్షణ కోసం తాను ఎప్పటికప్పుడు పోరాడుతానని, ప్రజల తరఫున నిరంతరం గళమెత్తుతానని వంశీకృష్ణ స్పష్టం చేశారు

## చిలకలగూడలో పోలీసుల
## అవగాహనా కార్యక్రమాలు

**హైదరాబాద్(భారత శక్తి)** జాగృత్ హైదరాబాద్ సురక్షిత్ హైదరాబాద్ లో భాగంగా ఈరోజు చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని నామాల గుండు చౌరస్తాలో వివిధ రకాల సైబర్ నేరాల గురించి మరియు సైబర్ నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించడం జరిగింది. ఎవరు కూడా గుర్తుతెలియని వ్యక్తులు పంపిన మెసేజ్లకు గాని, లింక్స్ కు గాని, వీడియో కాల్స్ కు కానీ స్పందించరాదు.

మీ యొక్క వ్యక్తిగత వివరాలను, బ్యాంక్ అకౌంట్ నెంబర్లను, ఆధార్ కార్డు నెంబర్లను, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు నెంబర్లను మరియు ఓటీపీలను ఎవరు కూడా గుర్తుతెలియని వ్యక్తులతో పంచుకోరాదు, గుర్తుతెలియని వ్యక్తులు చెప్పే మాటలను నమ్మరాదు, డిజిటల్ అరెస్టు అనేది ఎక్కడ చట్టంలో లేదు కనుక డిజిటల్ అరెస్టు అని ఎవరైనా మోసం చేయడానికి ప్రయత్నిస్తే వెంటనే పోలీసు వారికి తెలియజేయండి, డబ్బులు ఇతర అకౌంట్లకు పంపేటప్పుడు లేదా ఏదైనా లింకును ఓపెన్ చేసి వివరాలు అప్డేట్ చేసేటప్పుడు ఒకటికి రెండుసార్లు ఆలోచించండి, అది సైబర్ నేరానికి దారి తీయవచ్చు, ఎవరైనా ఇట్టి సైబర్ నేరాలతో మోసపోతే వెంటనే గోల్డెన్ అవర్లో 1930 కి ఫోన్ చేసి వివరాలు తెలియజేస్తే జీరో ఎఫైర్ నమోదు అవుతుంది, ఆ తర్వాత సంబంధిత పోలీస్ స్టేషన్ కి జీరో ఎఫైర్ ట్రాన్స్ఫర్ చేయబడుతుంది, మరియు మీ యొక్క వివరాలను సేకరించిన తర్వాత కోర్టు నిబంధన నిబంధనల ప్రకారము పోగొట్టుకున్న డబ్బులను బాధితులకు ఇవ్వడం జరుగుతుంది. ఇట్టి కార్యక్రమంలో చిలుకలగూడ ఏసీపీ కే.శశాంక్ రెడ్డి, చిలకలగూడ ఎస్సై అనిల్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## అంబులెన్స్ కు దారి లేక రోగి ప్రాణాలు గాల్లోకి..

**సికింద్రాబాద్..(భారత శక్తి)** బోయిన్ పల్లి అంబేద్కర్ నగర్ లో అమానుష సంఘటన చోటు చేసుకుంది.పోచయ్య అనే 60 ఏళ్ల వృద్ధుడికి గుండె సంబంధిత సమస్య రావడంతో కుటుంబ సభ్యులు అంబులెన్స్ కు సమాచారం అందించడంతో హుటాహుటిన అంబులెన్స్ అతని ఇంటికి చేరుకుంది.అతని ఆసుపత్రికి తీసుకువెళ్లే క్రమంలో రహదారికి ఇరువైపులా మార్కెట్ కు సంబంధించిన కూరగాయలు రవాణా చేసే ఇతర వాహనాలు నిలిపి ఉండడంతో అంబులెన్స్ కు దారి లేక అక్కడే చిక్కుకుంది.దాదాపు గంటసేపు అక్కడే అంబులెన్స్ చిక్కుకోవడంతో పోచయ్య పరిస్థితి క్షీణించడంతో గుండెపోటు వచ్చి అంబులెన్స్ లోని ప్రాణాలు కోల్పోయాడు.అంబులెన్స్ బయటకు వెళ్లేందుకు దారి లేకపోవడంతో అంబులెన్స్ లో ఉన్న పోచయ్య చనిపోవడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ బోయిన్ పల్లి ప్రధాన రహదారిపై బైఠాయించారు.రహదారి పొడవునా వాహనాలు నిలపడంతో అంబులెన్స్ బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారిపై ధర్నా చేస్తున్న స్థానికులను పోలీసులు సర్ది చెప్పి పంపించి వేశారు. ఈ ఘటనపై తిరుమలగిరి పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఎంపీ అర్వింద్ ధర్మపురికి త్వరలో కీలక పదవి !

**(భారత శక్తి)** బీజేపీ ఫైర్ బ్రాండ్, నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురికి త్వరలో కీలక పదవి దక్కనుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. జూన్ నెలలో జరగబోయే కేంద్ర మంత్రివర్గ విస్తరణ, పార్టీ సంస్థాగత మార్పుల్లో అర్వింద్ పేరు రేసులో ఉంది. గతంలో రెండు సార్లు చేతిదాకా వచ్చి చేజారిన పదవి.. ఈ సారైనా దక్కుతుందా అని అనుచరులు గంపెడాశలు పెట్టుకున్నారు. బండి సంజయ్ కుటుంబ వివాదాల నేపథ్యంలో తెలంగాణ కోటాలో అర్వింద్‌కు ప్రాధాన్యత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే కేంద్ర మంత్రి పదవి కంటే తెలంగాణ బీజేపీ స్టేట్ చీఫ్ పోస్ట్ దక్కితేనే పార్టీని అధికారంలోకి తేవడం సులువని అర్వింద్ భావిస్తున్నారు. ప్రతిపక్షాలకు కౌంటర్లు ఇస్తూ నేషనల్ ఫిగర్‌గా మారిన అర్వింద్‌కు ఏ పదవి దక్కుతుందోనని రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొన్నది.

## బాల్క సుమన్‌పై పోలీసులకు పిర్యాదు

**హైదరాబాద్ (భారత శక్తి)** బాల్క సుమన్ పై ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు మోత రోహిత్ అబిడ్స్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసారు. బీఆర్ఎస్ నేత, మాజీ చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన రెచ్చగొట్టే, హింసను ప్రేరేపించే వ్యాఖ్యలపై ఫిర్యాదు చేయడం జరిగింది. ప్రభుత్వ కార్యాలయాలు తగలబెట్టాలని, రైల్వే లైన్లు అడ్డుకోవాలని, హింసాత్మక చర్యలకు పాల్పడాలని ప్రజలను ప్రేరేపించే విధంగా చేసిన వ్యాఖ్యలు అత్యంత ప్రమాదకరమైనవి. ఇటువంటి బాధ్యతారహిత వ్యాఖ్యలు రాష్ట్రంలో శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలిగించే అవకాశం ఉంది. ప్రజలను రెచ్చగొట్టి చట్ట విరుద్ధ చర్యలకు ప్రేరేపించిన బాల్క సుమన్పై వెంటనే కేసు నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చేయాలని అబిడ్స్ పోలీసులను డిమాండ్ చేస్తున్నాం. రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామని పిర్యాదు లో పేర్కొన్నారు.

## పలు మార్కెట్ యార్డులో
## భారీ వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం

**పెద్దపల్లి (భారత శక్తి)** పెద్దపల్లి మార్కెట్ యార్డులో భారీ వర్షానికి ధాన్యం కొట్టుకుపోయింది. తూకానికి సిద్ధంగా ఉన్న మక్కల బస్తాల్లోకి వర్షపునీరు చేరింది. మక్కలను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్ చేస్తున్నారు.మరోవైపు, జగిత్యాల జిల్లా మెట్పల్లి వ్యవసాయ మార్కెట్లో ధాన్యం, మక్కలు తడిచిపోయ్యాయి. ఆ ధాన్యం, మక్కలను ఆరబోసుకుంటూ రైతులు అవస్థలు పడుతున్నారు. మెట్పల్లి మార్కెట్లో 4 వేల క్వింటాళ్ల మక్కలు, 6 వేల క్వింటాళ్ల ధాన్యం ఉన్నట్లు సమాచారం. కరీంనగర్ జిల్లా చొప్పదండి, రామడుగు, గంగాధర మండలాల్లో కుడా ధాన్యం తడిసిపోయింది. నెలరోజులుగా ధాన్యం విక్రయానికి ఎదురుచూస్తున్న రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈదురుగాలుల బీభత్సంతో పెంచాలపల్లిలో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి.

## తిరుమలలో టోకెన్లు లేని భక్తులకు
## సర్వదర్శనానికి 24 గంటలు

**తిరుమల (భారత శక్తి)** తిరుమలలో టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి 24 గంటలు సమయం పడుతోంది. వైకుంఠ క్యూ కాంప్లెక్సులు, నారాయణగిరి షెడ్లు భక్తులతో నిండింది. శ్రీవారి దర్శనం కోసం శిలాతోరణం క్యూలైన్ వరకు భక్తులు వేచి ఉన్నారు. నిన్న శ్రీవారిని 89,404 మంది భక్తులు దర్శించుకున్నారు. శ్రీవారి హుండీ ఆదాయం రూ.4 కోట్లు వచ్చింది. శ్రీవారికి తలనీలాలు 44,234 మంది భక్తులు సమర్పించారు.

## బండి భగీరథ్ను కస్టడీలోకి తీసుకోనున్న పోలీసులు

**(భారత శక్తి)** బండి భగీరథ్ను పోలీసులు కస్టడీలోకి తీసుకోనున్నారు. వైద్యపరీక్షలు నిర్వహించాక బండి భగీరథ్ను మూడ్రోజులపాటు ప్రశ్నించనున్నారు. కూకట్పల్లి డీసీపీ రితిరాజ్ ఆధ్వర్యంలో బాలిక, ఆమె తల్లి వాంగ్మూలం ఆధారంగా విచారించనున్నారు. పోక్సో కేసులో చర్లపల్లి జైలులో బండి భగీరథ్ రిమాండ్ ఖైదీగా ఉన్నాడు.

## పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వర్షాలు

**హైదరాబాద్ (భారత శక్తి)** హైదరాబాద్లోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కుత్బుల్లాపూర్, మియాపూర్, చందానగర్, లింగంపల్లి, గచ్చిబౌలి, మాదాపూర్, రాయదుర్గం, కూకట్పల్లి, జేఎన్టీయూ, నిజాంపేట, బాచుపల్లి తదితర ప్రాంతాల్లో వర్షం పడింది.ఉమ్మడి మెదక్ జిల్లాలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. కొల్చారం, వెల్దుర్తి, మండలాల్లో భారీ వర్షానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. పలు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాల్లోధాన్యం తడిసిపోయింది. సంగారెడ్డిలో వర్షంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం వల్ల స్థానికుల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.మహబూబ్నగర్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో వర్షానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

**- ఎబివిపి బషీర్బాగ్ నగర కార్యదర్శి దండగుల సురేందర్**



**హైద్రాబాద్ (భారత శక్తి)** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ బషీర్బాగ్ నగర కార్యదర్శి దండగుల సురేందర్ ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయుల ఖాళీలు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాల లేకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చాయని విమర్శించారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్‌లు పూర్తిస్థాయిలో అందించాలని కోరారు.ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్ల అమలును కచ్చితంగా చేపట్టాలని, ఫీజు నియంత్రణ చట్టాన్ని వెంటనే అమలు చేసి అనుమతులు లేకుండా నడుస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## మోహినీ రూపంలో మురిపించిన
## శ్రీ గోవిందరాజస్వామి

**సమ్మోహన అవతారంలో భక్తులకు అభయప్రదానం చేసిన గోవిందుడు**

**(భారత శక్తి)** తిరుపతిలోని శ్రీ గోవిందరాజ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఐదవ రోజైన బుధవారం ఉదయం శ్రీ గోవిందరాజస్వామివారు పల్లకిపై మోహినీ అవతారంలో విహరించి భక్తులను కటాక్షించారు. చెక్కభజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ పల్లకీ ఉత్సవం భక్తి పారవశ్యంతో సాగింది. గోవింద నామస్మరణలతో మారుమోగిన మాడవీధుల్లో భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారి దివ్య మంగళ రూపాన్ని దర్శించుకున్నారు.అమృతాన్ని ప్రసాదించిన మోహినీ అవతారంసురులను రక్షించి ధర్మాన్ని స్థాపించిన శ్రీహరిమోహినీ అవతార వృత్తాంతం భాగవతంలో అత్యంత రమణీయంగా వర్ణించబడింది. అమృతం కోసం సురాసురులు క్షీరసాగర మథనం చేయగా, అమృత విభజనలో కలహం చెలరేగింది. అప్పుడు శ్రీమహావిష్ణువు మోహినీ రూపంలో అవతరించి అసురులను సమ్మోహితులను చేసి దేవతలకు అమృతాన్ని అందించాడు. ధర్మరక్షణ కోసం దివ్య మాయారూపంలో అవతరించిన శ్రీహరి, ఈ మోహినీ అవతారంతో భక్తులకు లోకక్షేమ సందేశాన్ని అందించారు.స్నపన తిరుమంజనంలో ఆధ్యాత్మిక వైభవంఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేసి విశేష పూజలు నిర్వహించారు.

## వివాహేతర సంబంధం నేపథ్యంలో
## కన్న కొడుకుల హత్య

**- తల్లికి జీవిత ఖైదు**



**చిత్తూరు (భారత శక్తి)**చిత్తూరు జిల్లా రామకుప్పంలో కసాయి తల్లికి కఠినమైన శిక్షనే పడింది. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న ఇద్దరు కన్న కొడుకులను చంపిన తల్లికి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. 2017 సెప్టెంబర్ 9న రామకుప్పం మండలం కవ్వంపల్లిలో జరిగిన ఘటనకు 9 ఏళ్ల తర్వాత తీర్పు వెలువడింది. 6 ఏళ్లు, 3 ఏళ్ల ఇద్దరు కొడుకులను హత్య చేసిన తల్లి పవిత్ర జీవిత ఖైదిగా మారింది. వివరాల్లోకి వెళితే.. చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం కవ్వంపల్లికి చెందిన సి.వేమారెడ్డి, సి.పవిత్ర దంపతులకు పెళ్ళై ఇద్దరు పిల్లలు ఉన్నారు. వేమారెడ్డి ఇంటి లో ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేస్తున్న వేమన్నతో పవిత్ర సన్నిహితంగా మెలుగుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో పవిత్ర ట్రాక్టర్ డ్రైవర్ వేమన్న మధ్య రిలేషన్షిప్ ఏర్పడింది. ఇద్దరి మధ్య బంధం విడదీయరానిదిగా మారింది. పవిత్ర వేమన్నతో కలిసి ఉండాలని భావించింది. ఇంటిని విడిచి ట్రాక్టర్ డ్రైవర్ వేమన్న వెంట తిరుమలకు వెళ్ళిపోయిన పవిత్రను తిరిగి ఇంటికి పిలిపించిన పెద్దలు సర్ది చెప్పి అప్పట్లో పంచాయితీ చేశారు. సంసారంలో సర్దుకుపోవాలని చెప్పారు. దీంతో పవిత్ర భర్త ఇంటికి చేరగా ప్రియుడు వేమన్న బెంగుళూరుకు వెళ్ళిపోయి అక్కడ ఉద్యోగం చేసుకుంటూ ఉండిపోయాడు.అప్పుడప్పుడు కవ్వంపల్లికి వస్తున్న వేమన్నతో పవిత్ర కలుస్తూ వచ్చింది. ఈ క్రమంలోనే పవిత్ర ఇద్దరు పిల్లలు వేమన్న తో రిలేషన్షిప్ కంటిన్యూ చేసేందుకు అడ్డుగా ఉన్నారని బావించింది. ఇద్దరు పిల్లలను చంపేసి వేరే జీవితం మొదలు పెట్టాలని అనుకొని ప్లాన్ చేసి అమలు చేసారు. ఇద్దరూ కలిసి దారుణానికి ఒడిగట్టారు. ఈ మేరకు 2017 సెప్టెంబర్ 9న అంగన్వాడీ సెంటర్ లో ఉన్న ఇద్దరు పిల్లలను ఇంటికి తీసుకొచ్చారు. ఈ మేరకు పవిత్ర తన ఇద్దరు పిల్లల గొంతుకు నైలాన్ తాడును బిగించి ఫ్యాన్ కి ఉరి వేసి అతి దారుణంగా చంపేసింది. అనంతరం చనిపోయిన ఇద్దరు పిల్లలను మంచం మీద ఉంచి ఇంటిలో ఉన్న రూ. 3వేలు తీసుకుని వేమన్న వెంట పవిత్ర వెళ్లిపోయింది.ఇంటికి వచ్చిన పవిత్ర భర్త వేమారెడ్డి ఇంటిలోని ఒక రూమ్ లో విగత జీవులై పడిఉండడంతో రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేసాడు. ఈ మేరకు ఘటన స్థలానికి చేరుకున్న అప్పటి రామకుప్పం ఎస్.ఐ సురేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్రైమ్ నెంబర్ 45/2017 ఐ/ూవఇ 174 అఖీఖఅ కింద కేసు నమోదు చేసిన పోలీసులు ఆధారాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగం గానే 2017 సెప్టెంబర్ 13న రామకుప్పం పోలీస్ స్టేషన్ లో లొంగిపోయిన పవిత్ర, వేమన్న లు నేరాన్ని అంగీకరించారు. 174 అఖీఖఅ కింద నమోదు చేసిన కేసును 302 తీ/లి 34 ఎఖఅ, ూవఇ. 109 జీనిట 120 (ఎ) ఎఖఅ కింద మార్చారు. అప్పటి కుప్పం ఇన్స్పెక్టర్ రాజశేఖర్ ఇన్వెస్టిగేషన్ అధికారిగా కేసు దర్యాప్తు పూర్తి చేసి ఛార్జ్ షీట్ దాఖలు చేసారు. అప్పట్లో అరెస్ట్ అయి రిమాండ్ కు వెళ్లిన పవిత్ర, వేమన్న కేసులో ఎట్టకేలకు దాదాపు 9 ఏళ్ల తర్వాత తీర్పు వెల్లడైంది.మంగళవారం చిత్తూరు జిల్లా 9వ అదనపు కోర్టు కేసు విచారణ ముగించి తీర్పును ప్రకటించింది.

సొంత కొడుకులను హత్య చేసిన నేరాన్ని ఆధారాలతో రుజువు చేయడంతో కేసులో ఏ1గా ఉన్న సి.పవిత్ర కు జీవితకాల కారాగార శిక్షతో పాటు రూ.1,000 జరిమానాను కోర్టు విధించింది. జరిమానా కట్టలేని పక్షంలో మరో మూడు నెలలు అదనంగా జైలు శిక్ష అనుభవించాలని తీర్పును వెలువరించింది. ఈ కేసులో ఏ2 గా వేమ్మన్నను నిర్దోషి గా తేల్చింది. విడుదల చేయాలని న్యాయమూర్తి తీర్పునివ్వడంతో 25 ఏళ్ల పవిత్ర జైలు పాలైంది.కేసులో ముద్దాయికి శిక్ష పడటంలో కృషి చేసిన అప్పటి రామకుప్పం ఎస్.ఐ. సురేష్ బాబు, కుప్పం ఇన్స్పెక్టర్ ఎం.రాజశేఖర్, అడిషనల్ పి.పి శరవణ కుమార్, కోర్టుకు సాక్షాలను సకాలంలో హాజరు పరచిన కోర్ట్ కానిస్టేబుల్ కార్తీక, ఖాదర్, కోర్టు మానిటరింగ్ సెల్ ఇంచార్జ్ ఇన్స్పెక్టర్ మనోహర్ లను చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి అభినందించారు.

## హైదరాబాద్లో లక్ష ఇళ్ల నిర్మాణానికి
## ప్రభుత్వం శ్రీకారం

**- ఎల్ఐజీ ఇళ్ల నిర్మాణానికి స్థలాల పరిశీలన**

**హైదరాబాద్ (భారత శక్తి)** పేదలకు సొంతింటి కలను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. తొలి విడతలో హైదరాబాద్ నగరంలో లక్ష ఎల్ఐజీ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.బుధవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి అజారుద్దీన్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీతో కలిసి నాంపల్లి, మలక్పేట్, బహదూర్పురా నియోజకవర్గాల్లో ఎల్ఐజీ ఇళ్ల నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కుల్సుంపురా, అఫ్జల్ సాగర్ ప్రాంతాలతో పాటు కాలదేరా, గడ్డియన్నారం ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలను కూడా పరిశీలించారు. వినియోగంలో లేని ప్రభుత్వ భూములు, భవనాలను ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగించి పేదలకు గృహ వసతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు.ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు మెరుగైన జీవన వసతులు కల్పించే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. నగరంలో నివాస సమస్యను తగ్గించడంతో పాటు పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు గౌరవప్రదమైన నివాస వసతి కల్పించేందుకు ఎల్ఐజీ గృహ నిర్మాణ కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. తొలి విడతలో లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకుని అవసరమైన స్థలాల గుర్తింపు, ప్రణాళికలు, మౌలిక వసతుల కల్పనపై అధికారులు చర్యలు చేపడుతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.

## గోవుల ఆక్రమ రవాణ నివారణకు చెక్ పోస్టులు




**మహబూబ్ నగర్ (భారత శక్తి)**బక్రీద్ పండుగ నేపథ్యంలో గోవుల అక్రమ రవాణా నివారణకు కోయిలకొండ ఎక్స్ రోడ్ చెక్పోస్ట్ వద్ద పోలీసులు కట్టుదిట్టమైన తనిఖీలు చేసారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మహబూబ్నగర్ వన్టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య కోయిలకొండ ఎక్స్ రోడ్ నందు ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్పోస్టు సందర్శించి తనిఖీ చేశారు. బక్రీద్ పండుగ సందర్భంగా గోవుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన ఈ చెక్పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలను కట్టుదిట్టంగా నిర్వహించాలని చెక్ పోస్ట్ నందు విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సూచించారు. అనుమానాస్పద వాహనాలను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు అక్రమ రవాణా నివారణకు పోలీస్ శాఖ, పశుసంవర్ధక శాఖ మరియు రెవెన్యూ శాఖల సమన్వయంతో ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ చెక్పోస్ట్ వద్ద పశుసంవర్ధక శాఖ సిబ్బంది, రెవెన్యూ శాఖ అధికారులు మరియు పోలీస్ శాఖ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

# కమర్షియల్ రియల్ ఎస్టేట్‌లో కింగ్... మన భాగ్యనగరం

**హైదరాబాద్(భారత శక్తి)** ప్రపంచవ్యాప్తంగా ఇబ్బందికరమైన వాతావరణం ఉంది. కార్పొరేట్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు వెనకాడుతున్నాయి. ఉన్న ఉద్యోగులను సైతం తొలగిస్తున్నాయి. సాధ్యమైనంతవరకు మెరుగైన టెక్నాలజీతో.. తక్కువ మ్యాన్ పవర్ తో పనులు చేయించుకుంటున్నాయి. దీంతో కంపెనీల పెట్టుబడులు చాలా వరకు తగ్గిపోయాయి. కార్పొరేట్ ఆఫీస్ లీజు కూడా నేల చూపులు చూస్తోంది. ఇలాంటి సమయంలో ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోంది హైదరాబాద్.కమర్షియల్ రియల్ ఎస్టేట్లో హైదరాబాద్ కింగ్ లాగా దూసుకుపోతోంది. ముఖ్యంగా గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు హైదరాబాద్ నగరంలో విస్తృతంగా ఏర్పాటు అవుతున్న నేపథ్యంలో కార్యాలయాల స్థలాల లీజింగ్ విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా లక్ష నుంచి పదిలక్షల విస్తీర్ణం వరకు విస్తీర్ణం ఉన్న కార్యాలయాలలో ఆయా సంస్థలు తమ పనులు మొదలుపెడుతున్నాయి. భారీ ధరకు ఒప్పందాలు చేసుకుంటున్నాయి. ప్రస్తుత ఏడాది తొలి త్రైమాసికంలో హైదరాబాద్ నగరంలో 69% అభివృద్ధి నమోదయింది. గతంలో ఇది 40 శాతం వరకు ఉండేది. గత ఏడాది ఇదే సమయానికి 26 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణానికి లీజింగ్ జరిగింది.ఈ సంవత్సరం ఈ సమయానికి 44 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణానికి అది పెరిగింది. అదే కాదు గడిచిన మూడు నెలల్లో ఏకంగా 59 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్యాలయాల లావాదేవీలు జరిగాయి. ఇందులో భారీ కార్యాలయాల స్థలాల వాటా 75% గా ఉంది. ఇందులో 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న కార్యాలయాల వాటా 8 శాతం ఉంది. ఐదు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ కంపెనీలు తమ కార్యాలయాలను ఏర్పాటు చేశాయి. మిడిల్ రేంజ్ లో కార్యాలయాల స్థలాలు 50వేల నుంచి లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేశాయి. వీటి వాటా ఏకంగా 17 శాతం ఉంది. ఇక 10 లక్షల చదరపు అడుగుల లీజింగ్ భాగంలో కూడా ఒప్పందం కుదిరింది. దీని వాటా కూడా రెండు నుంచి మూడు శాతం వరకు ఉండే అవకాశం ఉంది.ఇటీవల ఉబర్ కంపెనీ గ్లోబల్ క్యాబబులిటీ సెంటర్ విస్తరణ కోసం హైదరాబాద్ ఐటి కారిడార్ పరిధిలోని మీనాక్షి ఎకో పార్కులో ఏకంగా 9.1 లక్షల చదరపు అడుగుల కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. జనవరిలో వీరుని లీజుకు తీసుకుంది. దాదాపు మొత్తం 10 అంతస్తులో ఈ సంస్థ కార్యాలయాన్ని నిర్వహిస్తోంది. ప్రతి నెల దీనికి 5.86 కోట్ల అద్దె చెల్లిస్తోంది. చదరపు అడుగుకు 65 రూపాయల అద్దె చెల్లిస్తున్నట్టు సమాచారం. ప్రతి మూడు సంవత్సరాలకు 15% పెరుగుతుంది. పది సంవత్సరాలపాటు లీజు ఒప్పందం ఉంటుంది. మొత్తంగా 10 సంవత్సరాల వరకు చెల్లించే ఏకంగా 839 కోట్ల వరకు ఉంటుంది..హైదరాబాద్ నగరంలో ఇటీవల కాలంలో జరిగిన అతిపెద్ద లీజింగ్ ఒప్పందంలో ఇది ఒకటి. హైదరాబాద్ నగరంలో స్థలాలు విస్తీర్ణంగా ఉండడం.. ఎటువంటి ఇబ్బందులు లేకుండా కార్యకలాపాలు సాగించే అవకాశం ఉండడం.. ఐటీ రంగం.. ఫార్మా రంగం అద్భుతంగా ఉండడంతో ఫైనాన్స్.. మొబిలిటీ వంటి రంగాలలో దిగ్గజాలుగా ఉన్న సంస్థలు హైదరాబాద్ నగరం వైపు దృష్టిసారిస్తున్నాయి. బెంగళూరు, ముంబై, చెన్నై వంటి నగరాలతో పోలిస్తే హైదరాబాదులో అద్దె తక్కువగా ఉంది. అందువల్లే కంపెనీలు ఇక్కడికి వస్తున్నాయి.

# కాంగ్రెస్, ఎస్పీ పొత్తు సాధ్యమేనా

**లక్నో (భారత శక్తి)**యూపీలో తిరిగి అధికారాన్ని చేపట్టాలని సమాజ్ వాదీ పార్టీ ఎత్తుగడలు వేస్తోంది. వరుసగా మూడు సార్లు బీజేపీ యూపీని పాలిస్తోంది. మాయావతి సారథ్యంలోని బీఎస్పీ అంత బలంగా లేదు. దీంతో ఆ ప్లేస్ ని భర్తీ చేయాలని అఖిలేష్ యాదవ్ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.2024 లో బీజేపీని నిలువరించడానికి ఏ ఫార్ములా అయితే ఫాలో అయ్యారో.. 2027 అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ అదే ఫార్ములతో వెళ్లాలని నిర్ణయించారు.కాంగ్రెస్ తో పొత్తును కొనసాగించడానికే అఖిలేష్ మొగ్గు చూపుతున్నారు. అయితే.. రెండు రోజుల క్రితమే కాంగ్రెస్ నేతలు బీఎస్పీ అధినేత్రి మాయావతి ఇంటికి వెళ్లి కలిశారు. దీంతో అఖిలేష్ అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. అందుకే వెంటనే కాంగ్రెస్ తోనే వుంటానని, సీట్ల సమస్య సమస్యే కాదని, విజయమే ముఖ్యమని తక్కుమని చెప్పుకొచ్చారు.కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తన పార్లమెంటరీ నియోజకవర్గమైన రాయ్‌బరేలీ నుండి 'మిషన్ 2027'కు శంఖారావం పూరించారు. సీట్ల పంపకాల చర్చల సమయంలో తమ వాదనలను బలంగా వినిపించే లక్ష్యంతో, రాష్ట్రంలో అభ్యర్థులను మరియు పోటీ చేసే స్థానాలను ఎంపిక చేసే ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ ప్రారంభించింది.మరోవైపు యూపీ ఎన్నికల్లో సమాజ్ వాదీతో పొత్తు కొనసాగుతుందని కాంగ్రెస్ కూడా ప్రాథమికంగా పేర్కొంటోంది. అయితే.. సీట్ల పంపకం విషయంలోనే భిన్నాభిప్రాయాలు వున్నాయి. గతంలో రెండు సందర్భాల్లో కాంగ్రెస్, ఎస్పీతో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేసింది. తత్ఫలితంగా, ఒక ప్రశ్న ఉత్పన్నమవుతోంది: 2027లో ఎస్పీ మరియు కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకానికి 2017 ఎన్నికల ఫలితాలు ప్రాతిపదికగా నిలుస్తాయా, లేక 2024లో అనుసరించిన సూత్రాన్నే ఇక్కడ కూడా వర్తింపజేస్తారా? అని ప్రశ్నలు వస్తున్నాయి.యూపీ రాజకీయాల్లో కాంగ్రెస్ ? ఎస్పీ మధ్య పొత్తు వచ్చినప్పుడల్లా సీట్ల పంపకమే ప్రస్తావనకు వస్తుంది. ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ-కాంగ్రెస్ కూటమి చెక్కుచెదరకుండా కొనసాగుతుందా? ఎస్పీతో పొత్తు విషయంలో రాహుల్ గాంధీ మౌనం పాటిస్తున్నప్పటికీ, కాంగ్రెస్‌తో తమ కూటమి కొనసాగుతుందని అఖిలేష్ యాదవ్ మాత్రం స్పష్టంగా ప్రకటించారు.ఉత్తరప్రదేశ్‌లో, కాంగ్రెస్ మరియు ఎస్పీ (సమాజ్‌వాదీ పార్టీ) రెండు సందర్భాలలో కలిసి ఎన్నికల్లో పోటీ చేశాయి. మొదటిసారిగా 2017 అసెంబ్లీ ఎన్నికల సమయంలో, ఎస్పీ మరియు కాంగ్రెస్ ఒక కూటమిగా ఏర్పడి ఎన్నికల బరిలోకి దిగాయి; ఆ తర్వాత, 2024 లోక్‌సభ ఎన్నికలలో, ఈ రెండు పార్టీలు తమ ఎన్నికల అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి మరోసారి చేతులు కలిపాయి. 2017లో, ఎస్పీ 311 స్థానాల్లో పోటీ చేయగా, కాంగ్రెస్ 114 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టింది. ఈ స్థానాల్లో తొమ్మిదింటిలో, కాంగ్రెస్ మరియు ఎస్పీ మధ్య "స్నేహపూర్వక పోటీ" జరిగింది. ఈ సారి ఏం జరుగుతుందో చూడాలి

# స్టాక్ మార్కెట్లో ఏఐ కంపెనీలు

**ముంబై,(భారత శక్తి)** ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) సృష్టిస్తున్న ప్రకంపనలు గ్లోబల్ స్టాక్ మార్కెట్ ముఖచిత్రాన్నే మార్చేస్తున్నాయి. దలాల్ స్ట్రీట్‌కు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద స్టాక్ మార్కెట్‌గా సగర్వంగా వెలుగొందుతున్న భారత్‌ను.. ఒక చిన్న దేశమైన తైవాన్ వెనక్కి నెట్టేసింది. ఈ ఊహించని దెబ్బతో అమెరికా, చైనా, జపాన్, హాంకాంగ్‌ల తర్వాత ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఈక్విటీ మార్కెట్‌గా తైవాన్ అవతరించి సంచలనం సృష్టించింది.తాజా అంచనాల ప్రకారం తైవాన్ స్టాక్ మార్కెట్ విలువ 4.95 ట్రిలియన్ డాలర్లకు చేరుకోగా, భారత మార్కెట్ విలువ 4.92 ట్రిలియన్ డాలర్ల వద్ద నిలిచి ఆరో స్థానానికి పడిపోయింది. తైవాన్ మనల్ని ఇలా ఒక్కసారిగా దాటేయడం వెనుక ఉన్న అసలు బలం.. 'ఏఐ' . కృత్రిమ మేధకు అవసరమైన అత్యాధునిక హార్డ్‌వేర్, చిప్‌లను తయారు చేయడంలో ప్రపంచంలోనే రారాజుగా ఉన్న 'తైవాన్ సెమీకండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ' ఈ అద్భుతాన్ని సుసాధ్యం చేసింది. ఒక్క టీఎస్ఎంసీ షేర్ల దూకుడుకే మార్కెట్ లెక్కలు మారిపోయాయి. ఈ ఏడాది ఆరంభం నుంచి ఆ కంపెనీ షేర్లు ఏకంగా 49 శాతం లాభాలను కురిపించాయి. తైవాన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీలో ఏకంగా 42 శాతం వాటా ఈ ఒక్క కంపెనీదే కావడం విశేషం. దీనికి తోడు దేశీయ ఫండ్స్ పెట్టుబడి పరిమితులను తైవాన్ ప్రభుత్వం సడలించడం కూడా అక్కడి మార్కెట్ బూమ్‌కు కలిసొచ్చింది.ప్రపంచమంతా ఏఐ జపంతో పరుగులు పెడుతుంటే, భారత్‌లో ఆ రంగంలో ప్రత్యక్షంగా సత్తా చాటే బలమైన టెక్ కంపెనీలు (డైరెక్ట్ ఏఐ ప్లేయర్స్) స్టాక్ మార్కెట్లో లేకపోవడం మనకు పెద్ద మైనస్‌గా మారింది. దీనికి తోడు అంతర్జాతీయంగా పెరుగుతున్న ముడి చమురు ధరలు, మందగించిన కార్పొరేట్ కంపెనీల ఆదాయాలు వంటి కారణాలతో దేశీయ స్టాక్ మార్కెట్ గత కొంతకాలంగా తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. ఈ ప్రతికూల పవనాలే మన మార్కెట్ వృద్ధిని నెమ్మదించేలా చేశాయి.స్టాక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ (విలువ) పరంగా తైవాన్ మనకంటే ఒక అడుగు ముందుకు వేసినప్పటికీ.. ఇక్కడ గమనించాల్సిన మరో కీలక వాస్తవం ఉంది. వాస్తవ ఆర్థిక సామర్థ్యం, స్థూల దేశీయోత్పత్తి లెక్కల్లో చూసుకుంటే మాత్రం తైవాన్ కంటే భారతదేశమే ఎంతో పటిష్టంగా, మెరుగైన స్థానంలో ఉందని ఆర్థిక నిపుణులు భరోసా ఇస్తున్నారు. తాత్కాలికంగా ఈక్విటీ మార్కెట్ విలువలో మార్పులు జరిగినా, భారత ఆర్థిక పునాదులు బలంగానే ఉన్నాయని, దీర్ఘకాలంలో మన వృద్ధిని ఎవరూ ఆపలేరని స్పష్టం చేస్తున్నారు.

# దుమ్మురేపుతున్న టాలీవుడ్...

**హైదరాబాద్,(భారత శక్తి)** తమిళ్ సినిమా ఇండస్ట్రీలో ఉన్న హీరోలు దర్శకులు ఒకప్పుడు ఘన విజయాలను సాధిస్తుండేవారు. అక్కడి హీరోలు, దర్శకులు ఇండియన్ సినిమా ఇండస్ట్రీలోనే నెంబర్ వన్ పొజిషన్ లో ఉండేవారు. కానీ ఇప్పుడు రోజులు మారాయి తెలుగు సినిమా ఇండస్ట్రీ సౌత్ సినిమా ఇండస్ట్రీని పక్కకు నెట్టేసి ముందుకు దూసుకెళ్లడమే కాకుండా పాన్ ఇండియా ఇండస్ట్రీని సైతం పక్కన పెట్టేసింది. ప్రస్తుతం ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో తెలుగు సినిమా ఇండస్ట్రీ నెంబర్ పొజిషన్లో కొనసాగుతూ ఉండటం విశేషం?ఇక తమిళులు మాత్రం దీనిని ఒప్పుకోవడం లేదు. ఎలాగైనా సరే సూపర్ సక్సెస్ ని సాధించే దిశగా సినిమాలు చేయాలని అక్కడ స్టార్ హీరోలు విపరీతంగా ఆరాటపడుతున్నారు.కానీ రజినీకాంత్, కమల్ హాసన్ తో పాటు విజయ్, సూర్య, విక్రమ్ లాంటి హీరోలు ఎన్ని సినిమాలు చేసినా కూడా మన తెలుగు హీరోల స్టార్ డమ్ ను మ్యాచ్ చేయలేరు. అలాగే మన హీరోల కలెక్షన్స్ ను కొల్లగొట్టలేరు అంటూ చాలామంది కామెంట్స్ చేస్తున్నారు.ఇక తమిళ దర్శకులు సైతం అక్కడున్న హీరోలతో సినిమాలు చేస్తే వరకు కావడం లేదనే ఉద్దేశంతోనే బాలీవుడ్ వెళ్లి అక్కడ సినిమాలు చేస్తున్నారు. లేదంటే తెలుగు సినిమా ఇండస్ట్రీకి వచ్చి ఇక్కడ స్టార్ హీరోలతో సినిమాలు చేసి సక్సెస్ లను సాధించాలని చూస్తున్నారు?ప్రస్తుతం తమిళ్ సినిమా ఇండస్ట్రీలోని హీరోల హవా ముగిసిందనే చెప్పాలి.ఒకప్పుడు మన స్టార్ హీరోలతో పోటీ పడినప్పటికి ఇప్పుడు పోటీపడే స్థాయిలో వాళ్లయితే లేరు. ఇక ఇలాంటి క్రమంలోనే రాబోయే రోజుల్లో బాక్సాఫీస్ ను షేక్ చేసే సినిమాలు చేస్తే తప్ప ఇండస్ట్రీలో వీళ్ళకంటూ ఒక స్ట్రెచర్ అయితే ఏర్పడదు. కాబట్టి ఏది ఏమైనా కూడా సౌత్ సినిమా ఇండస్ట్రీలో తమ సత్తా చాటుకోవాలంటే మాత్రం మరోసారి పెను సంచనాలను క్రియేట్ చేయాల్సిన అవసరమైతే ఉంది?చూడాలి మరి ఇక మీదట వాళ్ళు ఎలాంటి సక్సెస్ లను సాధిస్తారు అనేది?

# కామన్ మ్యాన్‌పై పెట్రో భారం ఎఫెక్ట్...

**హైదరాబాద్ (భారత శక్తి)** సామాన్యుడి జేబుకు మళ్లీ చిల్లులు పడబోతున్నాయి. ఇంధన ధరల పెంపు కేవలం వాహనదారులకే పరిమితం అనుకుంటే పొరపాటే.. దీని ప్రభావం ప్రతి సామాన్యుడి వంటింటి బడ్జెట్‌పై తీవ్రంగా పడనుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఇటీవల పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణంమళ్లీ పడగ విప్పనుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రాబోయే రోజుల్లో రిటైల్ ద్రవ్యోల్బణం ఏకంగా 5 శాతం మార్కును తాకే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. ఈ ప్రతికూల పరిణామాల నేపథ్యంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్ల తగ్గింపు విషయంలో వెనక్కి తగ్గే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.ఇంధన ధరల పెంపుతో దేశవ్యాప్తంగా రవాణా ఖర్చులు విపరీతంగా పెరుగుతాయి. దేశంలో సరుకు రవాణా వ్యవస్థ అంతా దాదాపుగా డీజిల్‌తో నడిచే భారీ ట్రక్కుల పైనే ఆధారపడి ఉంది. డీజిల్ రేటు పెరిగితే.. కూరగాయలు, పాలు, కిరాణా సరుకుల నుంచి ఎఫ్ఎంసీజీ ఉత్పత్తుల వరకు ప్రతి వస్తువు రవాణా భారం అమాంతం పెరుగుతుంది. ఈ అదనపు వ్యయాన్ని కంపెనీలు తమ లాభాల్లోంచి భరించవు, అంతిమంగా వినియోగదారుడి (సామాన్యుడి) పైనే మోపుతాయి. ఈ చైన్ రియాక్షన్ కారణంగానే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతాయని, తద్వారా ద్రవ్యోల్బణం మళ్లీ 5 శాతం వైపు పరుగులు తీస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.ఇదే సమయంలో గృహ, వాహన రుణాలు తీసుకున్న సామాన్యులకు, మధ్యతరగతి వర్గాలకు ఆర్బీఐ చేదువార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తే ఆర్బీఐ రెపో రేటు తగ్గిస్తుందని, తద్వారా తమ ఈఎంఐభారం తగ్గుతుందని ఎంతోకాలంగా ఆశగా ఎదురుచూస్తున్న వారికి నిరాశే ఎదురుకానుంది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ ప్రాథమిక లక్ష్యం ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడమే. కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 4 శాతం వద్ద స్థిరంగా ఉంచాలని ఆర్బీఐ టార్గెట్ పెట్టుకుంది. కానీ ఇప్పుడు ఇంధన ధరల సెగతో అది 5 శాతానికి చేరువవుతుండటంతో, ఆర్బీఐ తన విధాన నిర్ణయాల్లో మరింత ఆచితూచి వ్యవహరించనుంది. త్వరలో జరగబోయే ద్రవ్య పరపతి విధాన కమిటీసమావేశంలో వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని ఆర్థికవేత్తలు అంటున్నారు.ఒకవైపు పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు.. దానికి తోడు ఆకాశాన్నంటుతున్న కూరగాయలు, కిరాణా సరుకుల ఖర్చులు.. మరోవైపు ఏమాత్రం తగ్గని బ్యాంక్ ఈఎంఐల భారం. వెరసి ప్రస్తుత ఈ ఆర్థిక పరిణామాలు రాబోయే త్రైమాసికంలో సామాన్యుడిని ఆర్థికంగా మరింత ఉక్కిరిబిక్కిరి చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

# వాట్సప్‌లో గ్రేటర్ సేవలు




**హైదరాబాద్, (భారత శక్తి)** హైదరాబాద్‌లో బర్త్ సర్టిఫికెట్ సవరణ కోసమో లేదా ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లింపు కోసమో ప్రభుత్వ ఆఫీస్‌ల చుట్టూ తిరగడం అంటే అగ్నిపరీక్షే. కానీ, మారుతున్న కాలంతోపాటు పాలన కూడా ప్రజల అరచేతిలోకి వచ్చేసింది. తెలంగాణ ప్రభుత్వ ఐటీ, కమ్యూనికేషన్ల విభాగం ఆధ్వర్యంలోని మీ సేవ ప్లాట్‌ఫామ్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజల కోసం విప్లవాత్మక మార్పులు చేపట్టింది. తెలంగాణ మీ సేవ ప్లాట్‌ఫామ్ తన వాట్సాప్ చాట్‌బాట్ సేవలను మరింత విస్తరించింది. గతంలో ఉన్న సేవల కంటే అదనంగా, ఇప్పుడు తొమ్మిది కొత్త జీహెచ్ఎంసీ సేవలను ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో చేర్చారు. దీని వల్ల హైదరాబాద్ నివాసితులు తమ ఇంటి నుంచే కేవలం ఒక వాట్సాప్ మెసేజ్‌తో తమ పనులను పూర్తి చేసుకోవచ్చు. కార్యాలయాలకు వెళ్లి గంటల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేకుండానే, నేరుగా చాట్ ఇంటర్‌ఫేస్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి వీలు కలుగుతుంది. ఆస్తి పన్ను సేవలు, పన్ను చెల్లింపులు, విచారణలు అందుబాటులోకి వచ్చాయి. వ్యాపారస్తులు సులభంగా తమ లైసెన్స్‌లను అప్‌డేట్? చేసుకోవచ్చు. పేర్లు లేదా ఇతర వివరాలు జనన ధృవీకరణ పత్రాల్లో సవరణలు ఉంటే సరిదిద్దుకోవచ్చు. ప్రాపర్టీ డోర్ నంబర్ సవరణ చేసుకోవచ్చు. పేరు మార్పు, సవరణ, ఇంటి వద్ద జరిగిన జననాల నమోదు, ఇంటి వద్ద జరిగిన మరణాల నమోదు, ఇతర పౌర సేవలు ఇందులో పొందవచ్చు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పౌర సేవలను డిజిటలైజ్ చేయాలనే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టింది. ప్రతి ఒక్కరి దగ్గర స్మార్ట్ ఫోన్, వాట్సాప్ అందుబాటులో ఉన్నాయి. ఇతర యాప్‌లు డోన్‌లోడ్ చేయాల్సిన అవసరం లేకుండా నేరుగా పని పూర్తి అవుతుంది. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే శ్రమ, రవాణా ఖర్చులు తప్పుతాయి. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రభుత్వం నుంచే సేవలు పొందవచ్చు. గత ఏడాది నవంబర్ 18న ప్రారంభమైన ఈ వాట్సాప్ ఛానెల్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా ఆదాయ ధృవీకరణ పత్రాలు, పోలీసు చాలనాలు, విద్యుత్ బిల్లుల చెల్లింపుల కోసం ప్రజలు దీనిని విరివిగా వాడుతున్నారు. మీసేవ వాట్సాప్ సేవలను ఉపయోగించుకోవడం చాలా సులభం. దీని కోసం మీరు ఫాలో చేయాల్సిన స్టెప్స్ ఉన్నాయి ముందుగా మీరు 8096958096 నెంబర్‌ను సేవ్ చేసి పెట్టుకోవాలి. వాట్సాప్‌లోకి వెళ్లి ఈ నెంబర్‌కు హాయ్, హాలో అని మెసేజ్ చేయాలి. మీరు మెసేజ్ పంపగానే చాట్‌బాట్ స్పందిస్తుంది. స్క్రీన్‌పై కనిపించే ప్రాంప్ట్‌లను అనుసరిస్తూ మీకు కావాల్సిన సేవను ఎంచుకోండి. ఒక వేళ ఆ సేవకు ఫీజు ఉంటే అక్కడే ఉన్న లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో పేమెంట్ పూర్తి చేయవచ్చు.

# పాలమూరుకు తగ్గనున్న నీటి కష్టాలు

## - బ్రిడ్జి నిర్మాణానికి రెండు రాష్ట్రాలు అంగీకారం

**మహబూబ్ నగర్,(భారత శక్తి)** తెలంగాణ, కర్ణాటక అంతరాష్ట్ర సరిహద్దుల్లో కృష్ణానదిపై ఒక కొత్త బ్యారేజీతో పాటు వంతెనను నిర్మించేందుకు రెండు రాష్ట్రాల మధ్య కీలక చర్చలు ప్రారంభమయ్యాయి. ఉన్నత స్థాయి భేటీలో కర్ణాటక ప్రభుత్వం ఈ ప్రతిపాదనను తీసుకురాగా.. తెలంగాణ ప్రభుత్వం కూడా దీనిపై సానుకూలత వ్యక్తం చేస్తూ పరిశీలిస్తోంది. నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం కృష్ణా మండల పరిధిలోని కొల్పూరు గ్రామానికి, కర్ణాటకలోని రాయచూరు జిల్లా కోర్తుండా గ్రామానికి మధ్యలో ఈ బ్యారేజీని నిర్మించాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జూరాల జలాశయానికి ఎగువన, కర్ణాటకలోని గుర్జాపూర్, గూగల్ చిన్న బ్యారేజీలకు దిగువన ఈ కొత్త ప్రాజెక్టు రానుంది.సుమారు రెండు టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో ఈ బ్యారేజీని నిర్మిస్తే.. తెలంగాణలోని మక్తల్ నియోజకవర్గ పరిధిలోని అనేక గ్రామాలకు తాగు, సాగునీటి అవసరాలు పూర్తిగా తీరనున్నాయి. నీటి లభ్యతతో పాటు ఈ బ్యారేజీపై వంతెనను కూడా నిర్మించడం వల్ల ప్రస్తుతం రాయచూరు సమీపంలోని శక్తినగర్, కృష్ణా మండలం మధ్య ఉన్న పాత వంతెనపై ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టుతో పాటు భీమా నదిపైనా మరో చిన్న బ్యారేజీ, వంతెన నిర్మించాలనే ప్రతిపాదనను తెలంగాణ ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. సోమవారం నాటి సమావేశంలో తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి ఈ కొత్త ప్రతిపాదనను కర్ణాటక ప్రతినిధుల ముందుకు తీసుకెళ్లారు.నారాయణపేట జిల్లాలోని తంగడిగి, కర్ణాటకలోని సుగూరు గ్రామాల మధ్య భీమానదిపై 0.25 టీఎంసీల సామర్థ్యంతో దీనిని నిర్మించాలని కోరారు. ఈ చిన్న బ్యారేజీ నిర్మాణం వల్ల ఇరు రాష్ట్రాల సరిహద్దు రైతులకు, ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అంచనా వేస్తున్నారు. కృష్ణానదిపై ప్రతిపాదించిన ప్రధాన బ్యారేజీని రెండు రాష్ట్రాలు సంయుక్తంగా నిర్మించి వ్యయాన్ని సమానంగా పంచుకోవడం ద్వారా ఉమ్మడిగా ప్రయోజనం పొందవచ్చనే కోణంలో చర్చలు జరుగుతున్నాయి. ఈ అంతరాష్ట్ర ప్రాజెక్టు నిర్మాణ అంచనా వ్యయం దాదాపు రూ.500 కోట్ల వరకు ఉండవచ్చని నీటిపారుదల రంగ నిపుణులు ప్రాథమికంగా లెక్కగట్టారు.కృష్ణానదిపై ప్రతిపాదించిన బ్యారేజీకి సంబంధించి హైడ్రాలజీ, ముంపు ప్రాంతాలు, సాంకేతికాంశాలను క్షుణ్ణంగా ఖరారు చేసేందుకు ఇరు రాష్ట్రాల నీటిపారుదలశాఖల ఇంజినీర్లతో ఒక సంయుక్త కమిటీని ఏర్పాటు చేయాలని సోమవారం నాటి సమావేశంలో నిర్ణయించారు. ఈ ఉమ్మడి కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై సమగ్ర నివేదికను సిద్ధం చేయనుంది. ఆ నివేదిక అందిన తర్వాత రెండు రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులు మరోమారు సమావేశమై తుది నిర్ణయం తీసుకోనున్నారు

# భూవివాదం వెనుక రాజకీయ నేతల హస్తం

**హైదరాబాద్,(భారత శక్తి)** సినీ గేయరచయిత అనంత్ శ్రీరామ్ సోమవారం పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యక్షమయ్యారు. జిల్లా యంత్రాంగం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని, తన కుటుంబానికి ఎదురవుతున్న వేధింపులపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఒక భూవివాదం కారణంగా తన వృద్ధులైన తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని, వారికి తక్షణమే రక్షణ కల్పించాలని ఆయన విన్నవించారు.యలమంచిలి మండలం దొడ్డిపట్లలో తమకు ఉన్న 5 సెంట్ల ఉమ్మడి స్థలం విషయంలో వివాదం నెలకొందని అనంత్ శ్రీరామ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ స్థలాన్ని కొంతమంది అక్రమంగా ఆక్రమించుకున్నారని ఆయన ఆరోపించారు. అయితే, ఈ వివాదంలో మాజీ మంత్రి చేగొండి హరిరామ జోగయ్య కుమారుడు, చేగొండి సూర్యప్రకాష్ జోక్యం చేసుకుని తన తల్లిదండ్రులను బెదిరిస్తున్నారని ఆయన ఆరోపణలు చేశారు.సదరు స్థల వివాదం ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉందని, విచారణ జరుగుతుండగానే రాజకీయ పలుకుబడితో తమపై ఒత్తిడి తెస్తున్నారని అనంత్ శ్రీరామ్ ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు తీర్పు వచ్చే వరకు వేచి చూడకుండా, వృద్ధులైన నా తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురిచేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. చట్టంపై గౌరవంతో తాను అధికారులను ఆశ్రయించినట్లు ఆయన మీడియాకు తెలిపారు. గ్రామంలో ఉంటున్న తన తల్లిదండ్రులకు ప్రాణహాని ఉందని, రాజకీయ నాయకుల అనుచరుల నుంచి వారికి ముప్పు పొంచి ఉందని అనంత్ శ్రీరామ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ , ఎస్పీకి తన ఫిర్యాదు ప్రతిని అందజేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, వివాదాస్పద స్థలంలో యథాతథ స్థితి ని కాపాడాలని ఆయన కోరారు.అనంత్ శ్రీరామ్ ఫిర్యాదును స్వీకరించిన జిల్లా అధికారులు, ఈ అంశంపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని యలమంచిలి తహసీల్దార్ , పోలీసు అధికారులను ఆదేశించారు. చట్టపరంగా బాధితులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. అనంత్ శ్రీరామ్ , చేగొండి హరిరామ జోగయ్య కుటుంబాల మధ్య భూవివాదం ఉన్నా.. వారు సమీప బంధువులే. అనంత్ శ్రీరామ్ మాజీ మంత్రి చేగొండి హరిరామ జోగయ్యకు స్వయానా మేనల్లుడు. సొంత సోదరి కుమారుడు . అనంత్ శ్రీరామ్‌లోని సాహిత్య ప్రతిభను గుర్తించి, ఆయనను సినిమా రంగానికి పరిచయం చేయడంలో చేగొండి హరిరామ జోగయ్య కీలక పాత్ర పోషించారు. తన మేనల్లుడికి పాటల రచయితగా అవకాశాలు రావాలని జోగయ్య స్వయంగా అనేకమంది దర్శకులు, నిర్మాతల దగ్గర సిఫార్సు చేశారు. ఒకప్పుడు ఒకే గొడుగు కింద ఎదిగిన ఈ రెండు కుటుంబాల మధ్య ఇప్పుడు 5 సెంట్ల భూమి కోసం వివాదం చెలరేగడం, అది కలెక్టరేట్ మెట్లెక్కడం పశ్చిమగోదావరి జిల్లా రాజకీయ, సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

### ఆయనే భూ కబ్జాదారుడు

సినీ పాటల రచయిత అనంత శ్రీరామ్ , ఆయన బంధువు చేగొండి సూర్యప్రకాష్ మధ్య మొదలైన ఆస్తి వివాదం ఇప్పుడు రాజకీయ, న్యాయపరమైన మలుపులు తిరుగుతోంది. అనంత శ్రీరామ్ తన కుటుంబానికి రక్షణ కల్పించాలని, తన తల్లిదండ్రులను సూర్యప్రకాష్ బెదిరిస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణలపై సూర్యప్రకాష్ ఘాటుగా స్పందించారు. అనంత శ్రీరామ్ చేస్తున్న ఆరోపణలన్నీ పచ్చి అబద్ధాలని, తనపై కావాలనే నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.అనంత శ్రీరామ్ తన డబ్బు, పరపతి, రాజకీయ పలుకుబడిని ఉపయోగించి తనను వ్యక్తిగతంగా వేధిస్తున్నారని సూర్యప్రకాష్ ఆరోపించారు. తనపై కక్షపూరితంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఈ క్రమంలోనే ఆయనపై పరువు నష్టం దావా వేయబోతున్నట్లు ప్రకటించారు. తన చరిత్ర నిష్కళంకమని, తనపై ఇప్పటివరకు కనీసం ఒక్క పోలీస్ కేసు కూడా లేదని ఈ సందర్భంగా సూర్యప్రకాష్ గుర్తు చేశారు. అనంత శ్రీరామ్ మాటలకు భయపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.అసలు వివాదం ఆస్తికి సంబంధించిందని సూర్యప్రకాష్ వివరించారు. తన తాతయ్య చేగొండి కృష్ణమోహన్ రావుకు చెందిన ఆస్తిని అనంత శ్రీరామ్ అక్రమ మార్గాల్లో స్వాధీనం చేసుకున్నారని ఆయన సంచలన ఆరోపణ చేశారు. ఆ ఆస్తిని కాజేసేందుకే తనను అడ్డు తొలగించుకోవాలని చూస్తున్నారని, అందుకే ఇలాంటి డ్రామాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంత శ్రీరామ్ ఒక "పెద్ద భూ కబ్జా రాయుడు" అంటూ ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు.అనంత శ్రీరామ్ తల్లిదండ్రులను తాను బెదిరించినట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని సూర్యప్రకాష్ తేల్చి చెప్పారు. నేను వారిని బెదిరించినట్లు కనీసం ఒక్క ఆధారమైనా నిరూపిస్తే దేనికైనా సిద్ధం అని ఆయన సవాల్ విసిరారు. లేనిపోని ఫిర్యాదులతో అధికారులను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని హితవు పలికారు. కేవలం తన స్వార్థం కోసం వృద్ధులైన తల్లిదండ్రులను ఈ వివాదంలోకి లాగడం సరికాదని ఆయన విమర్శించారు.ఒకవైపు అనంత శ్రీరామ్ తన తల్లిదండ్రులకు ప్రాణాలకు ముప్పు ఉందని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, మరోవైపు సూర్యప్రకాష్ భూ కబ్జా ఆరోపణలు చేస్తూ కోర్టుకు వెళ్తామనడం చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారంపై అధికారులు ఎలాంటి విచారణ జరుపుతారో ,పోలీసులు ఈ వివాదాన్ని ఎలా పరిష్కరిస్తారో వేచి చూడాలి.

# రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ కు తీవ్ర గాయాలు


**హైదరాబాద్(భారత శక్తి)** పెద్ద అంబర్‌పేట్-హయత్ నగర్ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున ఒక ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా దూసుకొచ్చిన టిప్పర్ లారీ.. ముందు వెళ్తున్న మరో లారీని బలంగా ఢీకొట్టడంతో, టిప్పర్ క్యాబిన్ పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ క్యాబిన్ లోపల తీవ్ర గాయాలతో ఇరుక్కుపోయి మృత్యువుతో పోరాడాడు.హయత్ నగర్ వైపు నుండి ఆటో నగర్ వైపు వెళ్తున్న ఒక లారీ టైర్ ఒక్కసారిగా పేలిపోయింది. దీంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఆ లారీ రోడ్డు మధ్యలోని డివైడర్‌ను బలంగా ఢీకొట్టి ఆగిపోయింది. అయితే, అదే సమయంలో అదే మార్గంలో వెనుక నుండి అతివేగంగా దూసుకొచ్చిన ఒక టిప్పర్ లారీ.. డివైడర్‌ను ఢీకొట్టి ఆగి ఉన్న లారీని వెనుక భాగం నుండి అత్యంత బలంగా ఢీకొట్టింది.ఈ ఘోర ఢీకొట్టుడు ప్రభావానికి టిప్పర్ ముందు భాగం పూర్తిగా నలిగిపోయింది. దీంతో డ్రైవర్ సీట్ లోనే కూరుకుపోయి, క్యాబిన్ ఇనుప రేకుల మధ్య తీవ్ర గాయాలతో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న వెంటనే హయత్ నగర్ పోలీసులు, 108 అత్యవసర సేవల సిబ్బంది యుద్ధప్రాతిపదికన ఘటనా స్థలానికి చేరుకున్నారు.క్యాబిన్ పూర్తిగా నలిగిపోవడంతో డ్రైవర్‌ను బయటకు తీయడం పోలీసులకు సవాల్‌గా మారింది. గ్యాస్ కట్టర్లు, ఇతర పరికరాల సహాయంతో పోలీసులు, 108 సిబ్బంది సుమారు గంట సేపటి వరకు శ్రమించి క్యాబిన్ భాగాలను తొలగించారు. అత్యంత చాకచక్యంగా డ్రైవర్‌ను సురక్షితంగా బయటకు తీసి, ప్రాథమిక చికిత్స అనంతరం చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై కొంత సమయం పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు క్రేన్ సహాయంతో ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# శంషాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదం.




**(భారత శక్తి)** గచ్చిబౌలి నుండి శంషాబాద్ వైపు వస్తున్న రెండు కార్‌లు ఢీకొని ఏడు మందికి గాయాలు హైదరాబాద్ కమిషనరేట్ పరిధి ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధి రాళ్ళగుడా వద్ద ఔటర్ రింగ్ రోడ్డు పై రెండు కార్‌లు ఢీకొని ప్రమాదంమరుతి బెలునో, మహేంద్ర ఎక్స్‌యువి700 కార్‌లు ఢీకొన్నయి. ప్రమాదంలో ఏడు మందికి సల్ప గాయులు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడ్డ వారిని హాస్పిటల్ కు తరలించారుప్రమాదంపై ఆర్జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

# 'కాటాలన్' జర్నీ నాకెంతో ప్రత్యేకం



"పుష్ప' తర్వాత అన్ని భాషల నుంచీ అవకాశాలు వస్తున్నాయి. ఈ సినిమాలో నా పాత్ర పేరు 'మారి'. కథలో కీలకంగా ఉంటుంది. చాలా సంతృప్తినిచ్చిన పాత్ర. ఇప్పటివరకూ ఇలాంటి వైరైటీ పాత్రను నేను చేయలేదు. ఈ కథ విన్నప్పుడు చాలా సర్‌ప్రైజ్ అయ్యాను. ఇందులో ఒక పాట కూడా చేశాను. 'కాటాలన్' జర్నీ నాకెంతో ప్రత్యేకం' అని నటుడు సునీల్ అన్నారు. ఆంటోని వర్గీస్ ప్రధాన పాత్ర పోషించిన యాక్షన్ థ్రిల్లర్ 'కాటాలన్'.పాల్ జార్జ్ ఈ చిత్రానికి దర్శకుడు. క్యూబ్స్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై షరీఫ్ ముహమ్మద్ నిర్మించిన ఈ చిత్రం పానిండియా స్థాయిలో ఈ నెల 28న విడుదల కానున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో సునీల్ మాట్లాడారు. ఇంకా ఆజాద్, నటులు కబీర్ దుహాన్, హరీశ్‌శంకర్ కూడా మాట్లాడారు. దుషార విజయన్, పార్థ్ తివారీ, జగదీష్, సిద్ధిక్, ఈ సినిమాలో ఇతర పాత్రధారులు.

## ఏ ప్రాంతానికి వెళ్లినా స్థానిక భాషలో

# మాట్లాడటానికే ప్రయత్నిస్తా: శ్రీలీల

టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ శ్రీలీల ఇండస్ట్రీలోకి వచ్చిన అతి తక్కువ సమయంలోనే తన అద్భుతమైన డాన్స్, చలాకీతనంతో యువతలో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది. ఇటీవల కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినప్పటికీ, ఈ అమ్మడికి టాలీవుడ్‌తో పాటు ఇతర పరిశ్రమల్లోనూ వరుస అవకాశాలు క్యూ కడుతున్నాయి. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ 'ఐ-55' ప్రాజెక్ట్‌తో పాటు, బాలీవుడ్‌లో కార్తీక్ ఆర్యన్ సరసన 'ఆషికీ-3' చిత్రంలో నటిస్తూ బిజీగా ఉంది. భాషా భేదాలు లేకుండా ఇండియన్ సినిమాలో దూసుకుపోతున్న శ్రీలీల... తాజాగా భాష, సంస్కృతిపై చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వివిధ చిత్ర పరిశ్రమల్లో పనిచేయడంపై ఆమె మాట్లాడుతూ.. "నేను ప్రతి భాషను ఎంతో గౌరవిస్తాను. ప్రస్తుతం నాలుగు, ఐదు భాషల్లో ప్రాజెక్టులు చేస్తున్నాను.

నేను ఏ కొత్త ప్రాంతానికి వెళ్లినా, స్టేజ్ పైన ఉన్నంతసేపూ అక్కడి స్థానిక భాషలోనే మాట్లాడటానికి ప్రయత్నిస్తాను. ఆ ప్రాంత ప్రజలకు, వారి సంస్కృతికి నేను ఇచ్చే కనీస గౌరవం అది" అని స్పష్టం చేసింది. పబ్లిక్ ఈవెంట్స్‌లో స్థానిక భాషలో మాట్లాడటం వల్ల ప్రేక్షకులకు, సెలబ్రిటీలకు మధ్య ఉన్న దూరం తగ్గి, ఒక మంచి అనుబంధం ఏర్పడుతుందని శ్రీలీల అభిప్రాయపడింది. ఇది కేవలం సినిమా పబ్లిసిటీ కోసం చేసే పని కాదని, మనకు గుర్తింపునిచ్చిన ఆయా ప్రాంతాల ఐడెంటిటీని గౌరవించడమేనని తెలిపింది.



# థ్రిల్‌కి గురిచేసే త్రికాల



**సనాతన ధర్మంలో దాగివున్న రహస్యాల ఆధారంగా రూపొందిన మైథలాజికల్ ఫిక్షనల్ థ్రిల్లర్ 'త్రికాల'. శ్రద్ధాదాస్ ప్రధాన పాత్రధారి. మణి తెల్లగూటి దర్శకుడు. రాధిక, శ్రీనివాస్ నిర్మాతలు. ఈ నెల 28న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నది. ప్రచార చిత్రాలు ఈ సినిమాపై అంచనాలను రెట్టింపు చేశాయని, అత్యున్నత సాంకేతిక విలువలతో ఈ సినిమా రూపొందిందని, సంస్కృతి, ఆధ్యాత్మికత, థ్రిల్ అంశాల కలబోత ఈ సినిమా అని మేకర్స్ చెబుతున్నారు. మాస్టర్ మహేంద్రన్, అజయ్, ఆమని, సాహితి అవంచ, ప్రభాకర్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: పవన్ చెన్న, సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, సమర్పణ: చాగంటి ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పీ.**

# నిను వదిలి నేనెటూ కదలనే..



హీరో కిరణ్ అబ్బవరం, శ్రీగౌరి ప్రియ జంటగా నటిస్తున్న యువతరం ప్రేమకథ 'చెన్నై లవ్‌స్టోరీ'. రవి నంబూరి దర్శకుడు. 'బేబీ' దర్శకుడు సాయిరాజేశ్ కథ అందించి, ఎస్‌కేఎన్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు మణిశర్మ సంగీత దర్శకత్వం వహిస్తున్న విషయం విదితమే. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా నుంచి రెండో పాటను హైదరాబాద్‌లో మేకర్స్ విడుదల చేశారు.'వదలనే.. నిను వదలనే.. నిను వదలనే.. నిను వదిలి నేనెటూ కదలనే..' అంటూ సాగే అనంతశ్రీరామ్ రాసిన ఈ పాటను అగ్ర సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి ఆవిష్కరించి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. ఆయనతోపాటు సంగీత దర్శకులు మాధవపెద్ది సురేశ్, కల్యాణి మాలిక్, అనూప్ రూబెన్స్, హరి గౌర, మార్క్ కె.రాబిన్, సింజిత్ యెర్రమల్లి, చేతన్ భరద్వాజ్, స్వీకర్ అగస్తీ, సురేష్ బొబ్బిలి, వివేక్‌సాగర్, శ్రీచరణ్ పాకాల ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్రబృందానికి విషెస్ చెప్పారు. 'మణిశర్మ ఈ సినిమాకు అద్భుతమైన ఏడు మెలోడీ సాంగ్స్ ఇచ్చారు.హార్ట్ బ్రేకింగ్ సిట్యువేషన్‌లో ఈ పాట వస్తుంది. డైరెక్టర్ రవి నంబూరి డిఫరెంట్ అప్రోచ్‌తో పాటను చిత్రీకరించారు. కిరణ్ అబ్బవరం అద్భుతంగా నటించారు. గౌరిప్రియ అయితే ప్రాణం పెట్టింది' అని నిర్మాత సాయిరాజేశ్ తెలిపారు. ఈ పాట సిట్యువేషన్‌ని దర్శకుడు చెబుతుంటే కళ్లు చమర్చాయని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. ఇంకా శ్రీగౌరీ ప్రియ, సహ నిర్మాత ధీరజ్ మొగిలినేని కూడా మాట్లాడారు.

# పెద్దిగా చరణ్ విశ్వరూపం చూస్తారు



' 'పెద్ది' 40ఏండ్ల క్రితం విజయనగరంలో జరిగే కథ. అప్పటి విజయనగరాన్ని చూపించాలి. అదంతా ఒక ఇమేజినేషన్. రిఫరెన్స్ కోసం కొన్ని ఇమేజస్ తీసుకొని పకడ్బందీగా వర్క్ చేశాం. క్లాక్ టవర్, వీధులు, షుగర్ ఫ్యాక్టరీ.. ఇలా ప్రతి అంశాన్నీ పరిశీలనాత్మకంగా నిర్మిస్తూ వెళ్లాం. కొండ ప్రాంతాలు, అక్కడి ప్రజలు, వార్డ్రొస్టైల్.. ఇలా ప్రతీది ఆర్గానిక్‌గా డిజైన్ చేశాం. 40ఏండ్ల నాటి వాతావరణాన్ని ఆవిష్కరించడం కోసం ఓ సరికొత్త టింట్‌ని ట్రై చేశాం. రియలిస్టిక్ ఫీల్ ఉన్న విజువల్స్ 'పెద్ది'లో కనిపిస్తాయి' అని ప్రముఖ ఛాయాగ్రహకుడు ఆర్.రత్నవేల్ అన్నారు. రామ్‌చరణ్ కథానాయకుడిగా రానున్న పానిండియా చిత్రం 'పెద్ది'కి ఆయన ఛాయాగ్రహణం అందించారు. జూన్ 4న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా 'పెద్ది' విశేషాలను మంగళవారం విలేకరులతో రత్నవేల్ పంచుకున్నారు. 'ఎడిటింగ్ సెషన్ తర్వాత, రామ్‌చరణ్‌కీ, నాకూ నేషనల్ అవార్డ్స్ వస్తాయని డైరెక్టర్ బుచ్చిబాబు అన్నారు.చాలా ఆనందం అనిపించింది. బుచ్చిబాబు సినిమాను అద్భుతంగా తెరపైకి తెచ్చాడు. సినిమాలో వచ్చే సెకండ్ క్రికెట్ మ్యాచ్ కథలో కీలకం. ఆ ఎపిసోడ్ చేయడం కాంప్లికేటెడ్‌గా అనిపించింది. అది కేవలం మ్యాచ్ మాత్రమే కాదు. కథకు మలుపు. ఆ మ్యాచ్‌ని రాత్రిపూట షూట్ చేయమని బుచ్చిబాబుకి సూచించాను. 80ల్లో ఫ్లడ్‌లైట్ మ్యాచ్‌లు జరిగేవి. ఆ ఫీల్ కోసం నైట్ షూట్ పెట్టించా. నిజంగా అద్భుతంగా వచ్చింది. తెరపై చూస్తున్నప్పుడు అది క్రికెట్ మ్యాచ్‌లా అనిపించదు. రెండు జట్ల మధ్య యుద్ధంలా అనిపిస్తుంది' అని తెలిపారు రత్నవేల్. ఇంకా చెబుతూ 'ఇక కుస్తీపోటీల కోసం రామ్‌చరణ్ నిజంగా పహిల్వాన్‌లా మారారు. ట్రైలర్‌లో చూస్తే ఆయన ప్రతి మజిల్ కూడా డీటైల్‌గా కనిపిస్తుంది. హనుమంతుడి రిఫరెన్స్‌తో వచ్చే ఒక సీక్వెన్స్ ఉంది. ఆ సీక్వెన్స్ కోసం ప్రత్యేకమైన లైటింగ్ డిజైన్ చేశాను. దాంతో రామ్‌చరణ్‌లో ఆడియన్స్ హనుమంతుడ్ని చూస్తారు. థియేటర్లలో ఆ సీన్ వచ్చినప్పుడు గూజ్‌బంప్స్ ఖాయం. ఇక చివరి 30 నిమిషాలైతే ప్రేక్షకుల్ని కదిలిస్తుంది. మొత్తంగా ఇందులో రామ్‌చరణ్ విశ్వరూపం చూస్తారు' అని రత్నవేల్ అన్నారు.

# నాని కెరీర్‌లోనే 'ఆయా షేర్' రికార్డ్



'ది ప్యారడైజ్' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు అగ్ర హీరో నాని. 'దసరా'ఫేం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఆగస్ట్ 21న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నది. ప్రచారంలో భాగంగా విడుదలైన ఈ సినిమాలోని తొలి పాట 'ఆయా షేర్' నేటికీ సంచలనాలు సృష్టిస్తూనే ఉన్నదని మేకర్స్ తెలిపారు.తాజాగా ఈ పాట కేవలం తెలుగు వెర్షన్‌లోనే 150 మిలియన్ వ్యూస్, 1.6 మిలియన్ లైక్స్ సాధించి, నాని కెరీర్‌లోనే అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన పాటగా నిలిచిందని, సోషల్ మీడియానూ, పబ్లిక్‌ని ఈ పాట షేక్ చేస్తున్నదని మేకర్స్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. పాటలో శ్రీకాంత్ ఓదెల సృష్టించిన రఫ్ అండ్ రస్టిక్ ప్రపంచం, నాని పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్, డాన్స్ మూమెంట్స్ అందర్నీ ఆకట్టుకుంటున్నాయని, అనిరుధ్ ఎనర్జిటిక్ బీట్ పాటను మరో స్థాయికి తీసుకెళ్లగా, కాసర్ల శ్యామ్ సాహిత్యం, జంగిరెడ్డి, అర్జున్ చాందీ గానం ఈ పాటకు ప్రధాన ఆకర్షణలుగా నిలిచాయని మేకర్స్ అంటున్నారు.

# బీజేపీకి వైసీపీ ఫ్రెండ్లీ వార్నింగ్?

**విజయవాడ(భారత శక్తి)** రాజకీయాల్లో ఏ చర్య వెనుకైనా ఒక బలమైన వ్యూహం, ఆశించిన లక్ష్యం ఉంటాయి. ఏపీలో ప్రస్తుతం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్రంపై చేపట్టిన నిరసనలు ఈ కోవలోకే వస్తాయి. రాష్ట్రానికి సంబంధించిన స్థానిక సమస్యలపై పెద్దగా గళమెత్తని వైసీపీ, ఒక్కసారిగా పెట్రోల్ ధరల పెంపుపై రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు పిలుపునివ్వడం వెనుక లోతైన రాజకీయ వ్యూహం దాగి ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది. పెట్రోల్ ధరల పెంపు అనేది కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశం అయినప్పటికీ.. వైసీపీ నేతలు మాత్రం ఎక్కడా ప్రధాని మోదీని గానీ, కేంద్ర బీజేపీ నాయకత్వాన్ని గానీ విమర్శించడం లేదు. కేవలం రాష్ట్ర ప్రభుత్వంపైనే విమర్శల బాణాలు ఎక్కుపెడుతున్నారు.

అడ్రస్ కేంద్రానిది అయితే, దాన్ని రాష్ట్రం మీదకు మళ్లించడం వెనుక ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్న చందంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్లాన్ ఉన్నట్లు భావిస్తున్నారు.వైసీపీ ఇస్తున్న ఈ సిగ్నల్స్ వెనుక ప్రధాన ఉద్దేశం.. తాము కేంద్రానికి వ్యతిరేకం కాదని, కానీ అవసరమైతే తమ దారి తాము చూసుకుని బీజేపీకి వ్యతిరేకంగా పోరాడగల సత్తా తమకు ఉందని నిరూపించడమే . ఢిల్లీ స్థాయిలో బీజేపీతో సత్సంబంధాలు కొనసాగిస్తూనే, రాష్ట్రంలో మిత్రపక్షంగా ఉన్న టీడీపీ-జనసేన కూటమిని ఇరుకున పెట్టడం ఈ వ్యూహంలోని ప్రధాన భాగం. మేము కేంద్రాన్ని ఏమీ అనడం లేదు, కానీ మీరు తగ్గించొచ్చు కదా అనే ప్రశ్న ద్వారా ప్రజల్లో అధికార కూటమిపై వ్యతిరేకత పెంచడమే వైసీపీ లక్ష్యం. ఇది బీజేపీకి పంపుతున్న ఒక రకమైన సాఫ్ట్ సిగ్నల్ .రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ నేతలు వరుసగా కేసులు ఎదుర్కొంటున్నారు. ఈ తరుణంలో కేంద్రంలోని బీజేపీ అగ్రనాయకత్వం అండ ఉంటేనే తాము సురక్షితంగా ఉంటామని వైసీపీ భావిస్తోంది. అందుకే డైరెక్ట్ గా కేంద్రంతో యుద్ధం పెట్టుకోకుండా.. రాష్ట్రానికి సంబంధించిన సెస్, వాట్ అంశాలను సాకుగా చూపిస్తూ నిరసనలు చేపడుతున్నారు.

ఇలా చేయడం వల్ల కేంద్రానికి కోపం రాదు, అదే సమయంలో రాష్ట్రంలో తాము ప్రతిపక్షంగా యాక్టివ్ గా ఉన్నామనే సంకేతం కేడర్ కు వెళ్తుంది.ఒకవేళ మోదీపై నేరుగా విమర్శలు చేస్తే, సంబంధాలు దెబ్బతింటాయి. భవిష్యత్తులో సీబీఐ, ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థల నుంచి ఎదురయ్యే సవాళ్లను తట్టుకోవడం కష్టమవుతుందని వైసీపీకి తెలుసు. అందుకే, నిరసనల నినాదాన్ని కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర పన్నుల వైపు మళ్లించారని అంచున్నారు. పెట్రోల్ ధరల్లో ఏపీ నంబర్ వన్ అని ప్రచారం చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికే చెడ్డపేరు వచ్చేలా చేస్తున్నారు తప్ప, ధరలు పెంచిన కేంద్రానికి ఏమీ కాకుండా జాగ్రత్త పడుతున్నారు. వైసీపీ చేస్తున్న ఈ పెట్రోల్ నిరసనలు కేవలం ధరల కోసమే అని అనుకుంటే పొరపాటే. ఇది పక్కాగా ఢిల్లీ పెద్దల మనసు గెలుచుకుంటూనే, గల్లీలో ఉన్న ప్రత్యర్థులను దెబ్బకొట్టే డబుల్ యాక్షన్ ప్లాన్. కేంద్రం పట్ల మౌనం పాటిస్తూ, రాష్ట్రంపై గగ్గోలు పెట్టడం వెనుక ఉన్న ఈ రాజకీయ చాణక్యం రాబోయే రోజుల్లో ఏపీ రాజకీయాల్లో ఎలాంటి మార్పులు తెస్తుందో వేచి చూడాలి.

# వైసీపీ నుంచి జంపింగ్స్...

**విజయవాడ(భారత శక్తి)** ఏపీలో ఎన్నో పార్టీలు ఉన్నాయి. కానీ ప్రధాన పార్టీలు మాత్రం కొన్నే ఉన్నాయి. అందులో మూడు అధికార కూటమిలో చేరిపోయాయి. టీడీపీ జనసేన బీజేపీ ఒక జట్టు కట్టాయి. ఒక అయిదేళ్ళ పాటు ఏపీని పాలించిన వైసీపీ విపక్షంలో ఉంది. విపక్షంలో చూస్తే కాంగ్రెస్ కమ్యూనిస్టు పార్టీలు కూడా ఉన్నాయి. కానీ ఇవేమీ ఏపీలో బలమైన పరిస్థితులలో లేవు. ఉనికి పోరాటం చేస్తున్నాయి. దాంతో విపక్షంలో బలంగా 40 శాతం ఓటు షేర్ తో ఉన్న ఏకైక పార్టీగా వైసీపీ ఉంది. అదృష్టం కలిసి వస్తే మరోసారి అందలం ఎక్కే పార్టీ కూడా వైసీపీ అవుతుందని అంటున్నారు. ఇదిలా ఉంటే గతంలో ఎన్నడూ లేని విధంగా వైసీపీ నుంచి ఫిరాయింపు నేతలు పదుల సంఖ్యలో పార్టీని వీడిపోయారు. వారంతా కూడా కూటమి వైపు వెళ్ళారు. అలా తెలుగుదేశం బీజేపీ జనసేనలలో చేరిపోయారు. మరి కొంతమంది వైసీపీని వీడి ఏ పార్టీలో చేరకుండా పరిస్థితిని గమనిస్తున్నారు.

ఇదంతా కూడా తొలి ఏడాదిలోనే జరిగిపోయింది. ఆ తరువాత చూస్తే వైసీపీ నుంచి పెద్దగా జంపింగులు అయితే లేవు. దానికి కారణం వైసీపీని వీడి వెళ్ళిన వారు కూటమి పార్టీలలో సరైన ప్రాధాన్యత పొందకపోవడం. కండువా కప్పుకున్న రోజు తప్ప నాటి నుంచి నేటి వరకూ ఎక్కడా పెద్దగా కనిపించకపోవడమే. దాంతో మిగిలిన వారు కూడా పునరాలోచనలో పడ్డారు అని అంటున్నారుఇక చూస్తే రెండేళ్ళ కూటమి పాలన ముగిసింది. మరో రెండేళ్ళు గట్టిగా కాలం కదిలితే చాలు చివరి ఏడాది ఎన్నికలు వచ్చేస్తాయి. రెండేళ్ళ తరువాత మెల్లగా యాంటీ ఇంకెంబెన్సీ అన్నది మొదలవుతుంది. దాంతో జనాభిప్రాయం ఏమిటి అన్నది కూడా వెల్లడి అవుతుంది. దానిని గ్రహిస్తూ ముందుకు సాగే వైసీపీ నేతలు ఎవరూ ఇక గడప దాటేది ఉండదని వైసీపీ పెద్దలు అంచనా వేసుకుంటున్నారు. వైసీపీలో ఉన్న వారు కూడా బయటకు వెళ్తే చేసేది ఏదీ లేదని కూడా ఒక నిర్ధారణకు వచ్చారని అంటున్నారు.

ఇలా వైసీపీలో ఇపుడు ఉన్న నాయకులు అంతా కచ్చితంగా ఎన్నికల దాకా కొనసాగుతారు అని ధీమాగా వైసీపీ పెద్దలు ఉన్నారు.: ప్రాంతీయ పార్టీలు అన్నీ అధినేత ఫేస్ చూసి మాత్రమే మనుగడ సాగిస్తూ ఉంటాయి. అలా జగన్ ఇమేజ్ ని చూసే వైసీపీలో నేతలు ఉంటున్నారు అని అంటున్నారు వైసీపీ గ్రాఫ్ కూడా నెమ్మదిగా పెరిగే అవకాశాలు ఉన్నాయని నాయకులు భావిస్తున్నారు. పార్టీని నమ్ముకుని ఉన్న వారికి అధినేత న్యాయం చేస్తారు అన్న ఆలోచనలో చాలా మంది ఉన్నారు. నిజానికి ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ దాకా కొందరు బిగ్ షాట్స్ మాజీ మంత్రులు సీనియర్ నేతలు అంతా పార్టీని వీడాలని ఒకనొక సమయంలో నిర్ణయం తీసుకున్నా ఎందుక వెనకడుగు వేశారు. కొన్నాళ్ళ పాటు వారంతా మౌనంగా ఉన్నా ఇపుడిపుడే మీడియా ముఖం చూస్తున్నారు. ఆ విధంగా అధినేత కళ్ళల్లో పడి తాము యాక్టివ్ గా ఉన్నామని చెప్పుకోవడం ద్వారా వైసీపీలో అవకాశాలను అందుకోవాలని చూస్తున్నారు అని అంటున్నారు. ఏపీలో సరైన పోటీ ప్రతిపక్షం లేకపోవడమే వైసీపీకి ఒక విధంగా అడ్వాంటేజ్ గా చెబుతున్నారు. ఇష్టం ఉన్నా లేకపోయినా కూటమి కాకపోతే వైసీపీనే ఎంచుకోవాల్సి వస్తోంది అని అంటున్నారు. దాంతో వైసీపీకి పెద్ద ఇబ్బంది లేకుండా పోతోంది అని అంటున్నారు ఇక వైసీపీలో కొనసాగుతున్నారని నాయకులకు పదవులు ఇచ్చే సీన్ ఉంటుందా అన్నది కూడా ఒక ప్రశ్న. పార్టీకి పనికి వచ్చే వారు ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే ఈసారి టికెట్లు ఇస్తారని అంటున్నారు. జగన్ గతంలో ప్రతిపక్షంలో ఉన్నపుడు అందరూ పనిచేయడం చూశారు, అధికారంలో అయిదేళ్ళూ అంతా పార్టీలో హడావుడి చేయడమూ చూశారు, ఇపుడు విపక్షంలోకి వచ్చాక పార్టీని వీడి వెళ్ళిన వారు ఉన్నా సైలెంట్ గా గడిపిన వారినీ చూశారని అందువల్ల వైసీపీలో ఎవరు ఏమిటో జగన్ కి బాగా తెలుసు అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే వైసీపీ నుంచి భారీ జంపింగులు అయితే జరిగేది ఇక మీదట ఉండబోదు అన్న భరోసా అయితే కనిపిస్తోంది అని అంటున్నారు.

# జూన్ 15 నుంచి ఏపీలో సర్

**విజయవాడ,(భారత శక్తి)** రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4.16 కోట్ల మంది ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి భారీ యంత్రాంగాన్ని రంగంలోకి దించుతున్నారు. మొత్తం 46,397 మంది బూత్ స్థాయి అధికారులు జూన్ 15 నుంచి జూలై 14 వరకు నేరుగా ఓటర్ల ఇళ్ల వద్దకే వచ్చి సర్వే నిర్వహిస్తారుఈ ఎన్యుమరేషన్ ప్రక్రియలో రాజకీయ పార్టీల తరఫున నియమించిన 68,868 మంది బూత్ స్థాయి ఏజెంట్లు (ఃఒంబ) కూడా బీఎల్‌వోలకు సహాయకరంగా వ్యవహరిస్తారు. నకిలీ ఓట్ల తొలగింపు, మరణించిన వారి పేర్లను తొలగించడం, కొత్త ఓటర్ల చేరికను పారదర్శకంగా చేపట్టడమే ఈ సర్వే ముఖ్య ఉద్దేశం.

**ఓటర్ల జాబితా సవరణ - ముఖ్యమైన తేదీలు:**జూన్ 6 నుంచి జూన్ 14 వరకు : ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లు, అధికారులకు శిక్షణ అవసరమైన ఫారాల ప్రింటింగ్ ప్రక్రియ జరుగుతుంది.జూన్ 15 నుండి జూలై 14 వరకు : బీఎల్‌వోల ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే జరుగుతుంది. ఇదే సమయంలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను కూడా జూలై 14 లోగా పూర్తి చేస్తారు.జూలై 2 1: సేకరించిన ప్రాథమిక వివరాల ఆధారంగా ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రచురిస్తారు. జూలై 21 నుండి ఆగస్టు 20 వరకు: ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు తెలపడానికి, కొత్తగా ఓటు హక్కు కోసం క్లెయిమ్‌లు దాఖలు చేయడానికి ఓటర్లకు అవకాశం కల్పిస్తారు.

జూలై 21 నుండి సెప్టెంబరు 18 వరకు : వచ్చిన క్లెయిమ్‌లు, నోటీసులు మరియు అభ్యంతరాలన్నింటినీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తారు. సెప్టెంబరు 22 : అన్ని సవరణలు పూర్తి చేసిన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తుది ఓటర్ల జాబితానుఅధికారికంగా విడుదల చేస్తారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అనేది ఓటర్లు, రాజకీయ పార్టీలు, ఎన్నికల అధికారులు అందరూ భాగస్వాములు కావాల్సిన ఒక కీలకమైన ప్రక్రియ అని సీఈవో వివేక్ యాదవ్ పేర్కొన్నారు. ఈ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా మరియు లోపాలు లేకుండా జరగాలనేదే ఎన్నికల సంఘం లక్ష్యమని ఆయన వివరించారు. రాష్ట్రంలోని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో తమ బూత్ స్థాయి ఏజెంట్లను (ఃఒంబ) తప్పనిసరిగా నియమించాలని?. ఎన్నికల సిబ్బందికి పూర్తి స్థాయిలో సహకరించి ఈ బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వివేక్ యాదవ్ కోరారు.

# పవన్ సరే.. బిజెపి సంగతేంటి!?

**కాకినాడ(భారత శక్తి)** ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యవహారంపై స్పందించారు పవన్ కళ్యాణ్. అమిత్ షా లాంటి గొప్ప వ్యక్తిని కలిసినప్పుడు అరెస్టులు గురించి ప్రస్తావిస్తామా? అని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అంతటి పెద్దలను కలిసి విన్నవిస్తే.. ఇలా విశ్లేషించడం ఏంటని గట్టిగానే నిలదీశారు పవన్ కళ్యాణ్. అయితే ఇంతటి నిందారోపణలు పవన్ పై రాగా.. బిజెపి వ్యూహాత్మక మౌనం పాటించడం మాత్రం కూటమి ధర్మానికి విఘాతం కలిగిస్తోంది. తిరిగి బిజెపి పైనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బిజెపి సైలెన్స్ ఎంతలా అంటే.. వైసిపి విషయంలో సాఫ్ట్ కార్నర్ అన్నట్టు ప్రజల్లోకి సంకేతాలు వెళ్తోంది. ఈ మొత్తం ఎపిసోడ్ పై కూటమిలోని రెండు పార్టీలు గట్టిగా నిలదీస్తుండగా.. బిజెపి మాత్రం మౌనం వహిస్తోంది.ఆది నుంచి బిజెపి వైయస్సార్ కాంగ్రెస్ విషయంలో సాఫ్ట్ కార్నర్ తో ఉందన్న టాక్ ఉంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా దానిని బాగా హైలైట్ చేస్తోంది. తద్వారా తప్పనిసరి పరిస్థితుల్లోనే బిజెపి టిడిపి తో కలిసిందని.. అవసరమైన పక్షంలో వైసీపీ నుంచి పరస్పర రాజకీయ ప్రయోజనాలు అందుకునేందుకు సిద్ధంగా ఉందని ప్రచారం మొదలుపెట్టారు. జగన్మోహన్ రెడ్డి విషయంలో బిజెపి ఉదాసీనంగా ఉందని చెప్పడానికి ఆయన బెయిల్ రద్దు, వివేకానంద రెడ్డి హత్య కేసు విచారణలో జాప్యం వంటి వాటిని ఎక్కువగా ప్రస్తావిస్తున్నారు విశ్లేషకులు. ఈ క్రమంలోనే ప్రొఫెసర్ నాగేశ్వర్ ఏకంగా పవన్ కళ్యాణ్ పై బాంబు పేల్చారు. అందుకు జనసేనతో పాటు పవన్ రియాక్ట్ అయ్యారు. కానీ టిడిపి విషయంలో బిజెపి ఆలోచన అది అని.. జగన్మోహన్ రెడ్డి శాశ్వత మిత్రుడు బిజెపి కని చెప్పారు ప్రొఫెసర్ నాగేశ్వర్. దానిని ఖండించాల్సిన అవసరం బిజెపికి ఉంది. లేకుంటే అదే నిజం అని జనాలు నమ్మక తప్పదు.ప్రొఫెసర్ నాగేశ్వర్ కమ్యూనిస్టు భావజాలం ఉన్న వ్యక్తి. పైగా ఆధారాలు లేకుండా బిజెపి అగ్రనేత ఆదేశాలు అన్నట్టు మాట్లాడారు. దానిని ఖండించాల్సిన బీజేపీ నేతలు ఇప్పుడు అదే నాగేశ్వర్ ను సమర్థిస్తున్నారు. తెలంగాణ బిజెపి నేత మురళీధర్ రావు ప్రొఫెసర్ నాగేశ్వర్ మంచి విశ్లేషకుడు అన్నట్టు కితాబు ఇచ్చారు. ఆయన తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకున్న తర్వాత కూడా పోలీస్ కేసు నమోదు చేయడం ఏంటని ప్రశ్నించారు. దీంతో నాగేశ్వర్ చెప్పింది నిజమే అన్నట్టు సంకేతాలు ఇచ్చారు. అయితే ఆది నుంచి బిజెపి విధానం ఇదే. ఏపీతో వింత రాజకీయం ఆడుతోంది. ఇక్కడున్న రాజకీయ పరిస్థితులకు తగ్గట్టు వ్యవహరించి రాజకీయ లబ్ధి పొందుతోంది. ప్రొఫెసర్ నాగేశ్వర్ ఎపిసోడ్లో మాత్రం బిజెపి వైఖరి ఇప్పుడు అంతటా చర్చ నడుస్తోంది.ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.. తన సహచర మంత్రి నాదెండ్ల మనోహర్ తో ఢిల్లీ వెళ్లారు.. అక్కడ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తో భేటీ అయ్యారు. అక్కడ వారి మధ్య ఏం జరిగిందో తెలియదు. కాకపోతే 25 నిమిషాల పాటు మాట్లాడుకున్నారు. ఏం మాట్లాడుకున్నారో తెలియకపోయినాప్పటికీ.. మీడియాకు మాత్రం వచ్చే ఎన్నికల్లో కూడా మూడు పార్టీలు కలిసి పోటీ చేయాలని.. ఏపీ రాష్ట్రాన్ని బాగు చేయాలని చర్చించుకున్నట్లు చెప్పారు. ఇది ఇలా ఉంటే ప్రముఖ విశ్లేషకుడు ప్రొఫెసర్ నాగేశ్వర్ మాత్రం మరో విధంగా చెప్పారు. జగన్మోహన్ రెడ్డిని అరెస్ట్ చేయాలని అమిత్ షా ముందు పవన్ కళ్యాణ్ ప్రతిపాదన తెచ్చారని.. దానికి ఆయన ఒప్పుకోలేదని.. జగన్మోహన్ రెడ్డిని తమ లాంగ్ టర్మ్ పొలిటికల్ ఫ్రెండ్ గా భావిస్తున్నట్టు అమిత్ షా చెప్పారని.. నాగేశ్వర్ అన్నారు.నాగేశ్వర్ అన్న ఈ మాటలు క్యాజువల్ గానే ఉండవచ్చు. పాలిటిక్స్ ను అంతర్గతంగా స్టడీ చేసే వారికి వేరే విధంగా అనిపిస్తాయి . ప్రొఫెసర్ నాగేశ్వర్ నుంచి ఎప్పుడైతే ఈ మాటలు బయటికి వచ్చాయో.. అప్పుడే వైసిపి మీడియా అలర్ట్ అయిపోయింది. వెంటనే తన సోషల్ మీడియా ద్వారా.. మీడియా ద్వారా కావలసిన ప్రచారం చేసుకుంది. ఇది ఏపీ రాజకీయాలలో ఎంత మంట పుట్టించాలో అంత మంట పుట్టించింది. ఆ తర్వాత జనసేన రంగంలోకి వచ్చింది. టిడిపి.. బిజెపి ఇలా ఎదురుదాడి మొదలైంది. మొత్తంగా ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యవహారం మరో లైన్ తీసుకుంది. ఈ క్రమంలో నాగేశ్వర్ తనను తాను సెల్ఫ్ డిపెండ్ చేసుకుంటూ.. తాను తెలంగాణ ప్రాంత వాడినని.. ఆంధ్ర ప్రాంతానికి సంబంధించిన రాజకీయాలతో తనకేంటి అవసరమని వ్యాఖ్యానించారు. అవసరమైతే తనను అరెస్ట్ చేసుకోవాలని సవాల్ విసిరారు.. అంతకుముందు నాగేశ్వర్ ను అరెస్ట్ చేస్తే హైదరాబాదులో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంటిని ముట్టడిస్తామని టిఆర్ఎస్ అధినేత్రి కవిత హెచ్చరించారు.

మరోవైపు పవన్ కళ్యాణ్ కూడా నాగేశ్వర్ వ్యవహారంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.ఇష్టం వచ్చినట్టు మాట్లాడిన తర్వాత కులాన్ని.. ప్రాంతాన్ని ఆపాదించడం ఎంతవరకు కరెక్ట్ అని ఆయన ప్రశ్నించారు. రాజకీయాల్లోకి తాను అన్ని వదులుకొని వచ్చానని.. ఎదురు దాడికి దిగితే పరిస్థితి వేరే విధంగా ఉంటుందని హెచ్చరించారు.. పవన్ కళ్యాణ్ హెచ్చరించిన కొద్దిసేపటికి ప్రొఫెసర్ నాగేశ్వర్ స్పందించారు. తనను అరెస్ట్ చేసుకోవచ్చని.. దానికి సిద్ధంగా ఉన్నానని..క్వాష్ పిటిషన్ వేయలా వద్దా.. అనే దానిపై ఇంకా ఆలోచించుకోలేదని నాగేశ్వర్ పేర్కొన్నారు. . ఇప్పటికే నాగేశ్వర్ కు అనుకూలంగా వైసీపీ మీడియా.. బిఆర్ఎస్ మీడియా వ్యవహరిస్తున్నాయి. మధ్యలో కవిత కూడా సపోర్ట్ ఇస్తున్నారు. దీంతో ఈ వ్యవహారం రెండు ప్రాంతాలకు మధ్యదిగా మారిపోయింది. అయితే ఇది ఎక్కడి దాకా దారితీస్తుందో చూడాల్సి ఉంది.

# బాలినేని కోసం రంగంలోకి పవన్



**ఒంగోలు,(భారత శక్తి)** జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తీవ్ర నిర్ణయాలు దిశగా అడుగులు వేస్తున్నారు. ముఖ్యంగా కొత్తవారి చేరికలతో పార్టీని మరింత బలోపేతం చేయాలని చూస్తున్నారు. అయితే ఈ చేరికల విషయంలో జనసేన నేతలు అనుసరిస్తున్న వైఖరిపై పవన్ ఆగ్రహంగా ఉన్నారు. పార్టీని అభివృద్ధి చేయాలంటే చేరికలను ప్రోత్సహించాల్సిందేనని తేల్చి చెప్పారు. అయితే ఇటీవల కొన్ని జిల్లాల్లో పార్టీ క్రమశిక్షణ కట్టు దాటుతోంది. దీంతో పవన్ కళ్యాణ్ నిర్ణయాలు దిశగా అడుగులు వేస్తున్నారు ఆ జిల్లాలపై. అందులో భాగంగా ప్రకాశం జిల్లా పార్టీ కార్యవర్గాన్ని రద్దు చేశారు. అక్కడ పార్టీ నేతలు అనుసరిస్తున్న తీరును తప్పు పట్టారు. ఒక నేతపై సస్పెన్షన్ వేటు కూడా వేశారు. పార్టీలో ఉంటే ఉండండి లేకపోతే వెళ్లిపోండి అంటూ తేల్చి చెప్పడం విశేషం. ఇటీవల జరిగిన పరిణామాలతోనే పవన్ సీరియస్ గా స్పందించినట్లు తెలుస్తోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పి జనసేనలో చేరారు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి. ఆయన సీనియర్ మోస్ట్ లీడర్ కూడా. కానీ ఆయన రాకను ప్రకాశం జిల్లా నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. చివరకు అధినేత పవన్ కళ్యాణ్ చెప్పిన వారి వైఖరి మారడం లేదు. దీంతో అధినేత తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. క్రమంలోనే నిన్న జరిగిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ప్రకాశం జిల్లా నేతలను ప్రత్యేకంగా పిలిపించుకున్నారు. అయితే ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ రియాజ్ ఈ సమావేశానికి హాజరు కాలేదు. ఆయన మాజీ మంత్రి బాలినేని రాకను వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల బాలినేనికి జనసేన డీలిమిటేషన్ కమిటీ లో చోటు ఇచ్చారు. అధినేత ఆదేశాల మేరకు రాయలసీమతో పాటు ఒంగోలు, నెల్లూరు జిల్లా నేతలతో సమావేశం అయ్యారు బాలినేని. అక్కడ ఓ నేత బాహాటంగానే విమర్శలు చేశారు బాలినేని పై. దీనిపై తాజాగా స్పందించిన పవన్ సదరు నేతపై వేటు వేశారు. అంతటితో ఆగకుండా ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన కార్యవర్గాన్ని రద్దు చేశారు. నియోజకవర్గ ఇన్చార్జి లతోపాటు వివిధ విభాగాల ప్రతినిధులను సైతం పదవుల నుంచి తొలగించారు. కొత్త కమిటీలను ఏర్పాటు చేయడం ద్వారా మాజీ మంత్రి బాలినేనికి కీలక బాధ్యతలు కట్టబెట్టనున్నట్లు సంకేతాలు పంపారు.ఇటీవల బాలినేని విషయంలో వైఖరి మారుతోంది పవన్ కళ్యాణ్ కు. మొన్ననే ఆయన సీఎం చంద్రబాబును సైతం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. బాలినేని రాకను టిడిపి ఎమ్మెల్యే వ్యతిరేకిస్తున్నారు. అదే సమయంలో జనసేన క్యాడర్ సైతం వ్యతిరేకిస్తోంది. ఒంగోలు కార్పొరేషన్ నుంచి 26 మంది కార్పొరేటర్ లను జనసేనలో చేర్పించారు బాలినేని. అయినా సరే జిల్లా అధ్యక్షుడిగా ఉన్న రియాజ్ సరైన గుర్తింపు ఇవ్వడం లేదు. వాస్తవానికి బాలినేని వైసీపీ నుంచి రావడంతో ఆయనపై అనుమానపు చూపులు ఉండేవి. పని జిల్లా జనసేన నేతలు వైఖరి చూస్తుంటే వారి వెనుక వైసిపి ఉన్నట్టు అర్థం అవుతుంది. కేవలం బాలినేని అడ్డుకోవాలని రీతిలో వైసిపి నాయకత్వం స్థానిక జనసేన నేతలతో ఇలా వ్యవహరిస్తుందన్న ఆరోపణలు ఉన్నాయి. పవన్ కళ్యాణ్ వరకు వెళ్లడంతో ఆయన కమిటీలన్నింటినీ రద్దు చేశారు.

ఇకనుంచి బాలినేనికి జిల్లా బాధ్యతలు కట్టబెట్టే అవకాశం ఉంది. టిడిపి పరంగా కూడా బాలినేనిపై ఇకనుంచి అభ్యంతరాలు రాకపోవచ్చు. ఎందుకంటే బాలినేని ఒంగోలు విడిచి దర్శి వైపు అడుగులు వేస్తున్నట్లు ప్రచారంలో ఉంది. మొత్తానికైతే పరిస్థితులు చూస్తుంటే మాజీ మంత్రి బాలినేనికి అనుకూలంగా ఉన్నట్లు కనిపిస్తున్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# మేడ్చల్ జిల్లాలో ఏసీబీ దాడులు కలకలం

- శామీర్పేట తహసీల్దార్ కార్యాలయంలో సోదాలు
- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్
- 30 ఎకరాల భూ కన్వర్షన్ వ్యవహారంపై విచారణ

మేడ్చల్**(భారత శక్తి)** జిల్లా:మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని శామీర్పేట తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. రంగారెడ్డి ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ నేతృత్వంలో ఈ తనిఖీలు చేపట్టినట్లు సమాచారం.

అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ.. శామీర్పేట మండలం అలియాబాద్ ప్రాంతంలో సుమారు 30 ఎకరాల భూమి కన్వర్షన్కు సంబంధించి రైతు కన్సల్టెంట్ నుంచి భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేసినట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు విచారణ చేపట్టినట్లు వెల్లడించారు.ఎకరానికి రూ.1 లక్ష చొప్పున మొత్తం రూ.30 లక్షలు డిమాండ్ చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని తెలిపారు. ఈ వ్యవహారంలో తహసీల్దార్ డ్రైవర్ ద్వారా రూ.2 లక్షలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. కార్యాలయంలోని కీలక పత్రాలు, భూ అనుమతులకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నామని, ఎమ్మార్వో సుచరితతో పాటు ఆర్ డి ఓ కీసర రాజేష్ పలువురు సిబ్బందిని విచారిస్తున్నామని తెలిపారు.

పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు.ఇదిలా ఉండగా, 2024లో కూడా శామీర్పేట తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసిన ఎమ్మార్వో సత్యనారాయణ రూ.2 లక్షల లంచం కేసులో డ్రైవర్తో కలిసి ఏసీబీకి చిక్కిన ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. తాజాగా మరోసారి అదే కార్యాలయంలో ఏసీబీ దాడులు జరగడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

# నిమ్మధర ఢమాల్...



**ఏలూరు,(భారత శక్తి)** అన్నదాతలతో ఇటు వ్యవస్థ మాత్రమే కాక ప్రకృతి కూడా ఆడుకుంటోంది. సకాలంలో వర్షాలు కురవవు.. పంట చేతికి వచ్చే ముందు అకాల వర్షాలు కురిసి నీటిపాలవుతుంది. అలానే పండిన పంటకు ఈ రోజు ఉన్న ధర రేపు ఉండదు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ లోని నిమ్మ రైతులు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. గత నెల ఇదే సమయానికి 50 కేజీల నిమ్మ బస్తా ధర రూ. 8,500 ఉండగా, ఈరోజు అది రూ. 3,500కు పడిపోయింది. నెల రోజుల వ్యవధిలోనే ఇంత దారుణంగా ధర పడిపోవడంతో అన్నదాతల బాధ వర్ణనాతీతం.వేసవి కాలంలో నిమ్మకాయలకు రేటు ఎక్కువగా ఉంటుంది. ఒక్కో సందర్భంలో ఒక్కో నిమ్మకాయ రూ. 10 పలుకుతుంది. కానీ, ఇదే రైతు దగ్గరికి వస్తే ఈ ధర అస్సలు కనిపించదు. ఇప్పుడు ఏపీ నిమ్మ రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. నిమ్మ ధరలు హఠాత్తుగా పడిపోవడంతో.. అన్నదాతలు తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్ నెలలో 50 కేజీల బస్తా రూ. 8,500 ఉండగా.. ప్రస్తుతం అదే బస్తా రూ. 3,500కు ఒక్కసారిగా పడిపోయింది. ఇటీవల వరకు ఆశాజనకంగా ఉన్న ధరలు ఇలా పడిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారుఏపీలోని ఏలూరు నిమ్మకాయల మార్కెట్ నుంచి ముంబై, మద్రాసు, కర్ణాటక, బెంగళూరు వంటి ఇతర ప్రాంతాలకు భారీ స్థాయిలో నిమ్మకాయలను ఎగుమతి చేసేవారు. అయితే ప్రస్తుతం దిగుబడి తక్కువగా ఉండటంతో.. ఇప్పుడు ఏలూరు మార్కెట్ యార్డుకు ప్రతి రోజు కేవలం 20-30 లారీలు మాత్రమే వస్తున్నాయి. ఏలూరు జిల్లాలోని అనేక ప్రాంతాల్లో రైతులు నిమ్మతోటలను సాగు చేస్తున్నారు. అయితే గత కొన్ని రోజులుగా ఇతర రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా ఎగుమతులు లేక నిమ్మ రైతులు తీవ్రంగా నష్టపోయారు.పైగా పోయిన నెల నుంచి వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు, అకస్మాత్తు వర్షాల కారణంగా నిమ్మకు మంచి రేటు ఉన్నప్పటికీ దిగుబడి బాగా తగ్గింది. మొన్నటి వరకు కేజీ నిమ్మ ధర రూ. 170 వరకు పలగ్గా.. ఇప్పుడు రూ. 70కి పడిపోయింది. దీంతో నిమ్మ సాగు చేస్తున్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రేడ్ వన్ రకం కేజీ నిమ్మ ధర రూ. 70 పలుకుతోంది. ఉత్తర భారతదేశంలో వర్షాలు కురవడంతో ఆ ప్రభావం నిమ్మ ఎగుమతులపై పడింది. ఆకస్మాత్తుగా నిమ్మ ధర ఇంత పెద్ద మొత్తంలో తగ్గిపోవడంతో నష్టాలు మూటగట్టుకోవాల్సి వస్తోందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ధరలు మరింత తగ్గిపోయే పరిస్థితి ఉందని, పెట్టుబడి ఖర్చులు కూడా రాని పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

# పని ప్రదేశాల్లో మహిళల భద్రతకు 'పోష్' కవచం

- లైంగిక వేధింపులపై ధైర్యంగా ఫిర్యాదు చేయాలి
- ప్రతి సంస్థలో 'అంతర్గత కమిటీ' ఏర్పాటు తప్పనిసరి
- రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి






**రంగారెడ్డి కలెక్టరేట్, మే 27: భారత శక్తి,** పని ప్రదేశాల్లో మహిళలకు పూర్తి రక్షణ, భద్రత కల్పించడమే 'పోష్' (రూాం – లైంగిక వేధింపుల నిరోధక) చట్టం ముఖ్య ఉద్దేశమని రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి పేర్కొన్నారు. ప్రభుత్వ 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల ఉత్సవాల్లో భాగంగా, మహిళా శిశు వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి శ్రీలత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగాల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతున్న తరుణంలో వారి ఆత్మగౌరవాన్ని కాపాడటం అందరి బాధ్యతన్నారు. విధుల్లో ఎలాంటి వేధింపులు ఎదురైనా మహిళలు ఈ చట్టం ద్వారా న్యాయం పొందవచ్చని భరోసా ఇచ్చారు.

### విశాఖ కేసు నేపథ్యం.. ఐసీ కమిటీల ఏర్పాటు!

సదస్సులో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి పద్మావతి మాట్లాడుతూ.. చారిత్రాత్మక 'విశాఖ వర్సెస్ రాజస్థాన్' కేసు నేపథ్యం, ఆ తర్వాత పోష్ చట్టం రావడానికి గల కారణాలను వివరించారు. అనంతరం లోక్ అదాలత్ శాశ్వత సభ్యురాలు అమితా రాణి మాట్లాడుతూ.. ప్రైవేట్, ప్రభుత్వ సంస్థలలో లైంగిక వేధింపులు ఎదురైతే మహిళలు అధైర్యపడకుండా తక్షణమే అంతర్గత కమిటీ (ఇంటర్నల్ కమిటీ – ఐసీ)కి ఫిర్యాదు చేయాలని సూచించారు. మరో వక్త డాక్టర్ సిరి ప్రీతి మాట్లాడుతూ.. ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలో అంతర్గత కమిటీ ఏర్పాటు చేయడం చట్టరీత్యా తప్పనిసరని స్పష్టం చేశారు. యజమానులు, ఉన్నతాధికారులు లేదా తోటి ఉద్యోగుల వల్ల వేధింపులు ఎదురైతే ఎలా ఫిర్యాదు చేయాలో వివరించారు. అంతర్గత కమిటీలు లేని చోట 'స్థానిక కమిటీల' (లోకల్ కమిటీ) ప్రాధాన్యతను గుర్తుచేశారు.

### చట్టాలపై అవగాహన అవసరం

హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ యాదగిరి స్పందిస్తూ.. పోష్ చట్టంలోని న్యాయపరమైన అంశాలను, కోర్టుల్లో పరిష్కారమైన పలు కేసులను ఉదాహరణలుగా చూపుతూ వివరించారు. మహిళలు చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) శారదా దేవి, జిల్లా వ్యవసాయ అధికారి, డీపీఓ, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, వయోజన విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్‌తో పాటు రంగారెడ్డి జిల్లా పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గడ్డపోతారం మున్సిపాలిటీలో 15 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జీఎంఆర్..



**గడ్డ పోతారం మే 27 భారత శక్తి** పటాన్‌చెరు నియోజకవర్గంలో నూతనంగా ఏర్పడిన ప్రతి మున్సిపాలిటీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికబద్ధంగా కృషి చేస్తున్నామని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం గడ్డ పోతారం మున్సిపల్ పరిధిలోని మాదారం, లక్ష్మీపతిగూడెం, వావిలాల, గడ్డ పోతారం, అల్లి నగర్, కిస్టాయపల్లి, ఖాజీపల్లి, జిఎంఆర్ కాలనీలలో 15 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు స్థానిక మున్సిపల్ పాలకవర్గం సభ్యులతో కలిసి శంకుస్థాపన చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టబోతున్నట్లు తెలిపారు. హాజరైన మున్సిపల్ చైర్మన్ సుష్మ గణేష్, వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు.

# రూపాయి పతనంతో విదేశీ విద్యార్థుల బతుకు భారం!

- ఒక పూట భోజనం.. కిలోమీటర్ల నడక..
- పరాయి దేశాల్లో భారతీయుల దీనావస్థపై కప్పాటి పాండురంగా రెడ్డి ఆవేదన.
- ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి



**హైదరాబాద్, మే 27 భారత శక్తి:** అమెరికా డాలర్‌తో పోలిస్తే భారతీయ రూపాయి విలువ నానాటికీ క్షీణించడం కేవలం చమురు దిగుమతులు, స్టాక్ మార్కెట్లు, దేశ వాణిజ్య లోటుకు మాత్రమే పరిమితమైన అంశం కాదని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ పూర్వ చైర్మన్ కప్పాటి పాండురంగా రెడ్డి అన్నారు. ఇది విదేశాల్లో ఉన్నత చదువులు చదువుతున్న లక్షలాది మంది భారతీయ విద్యార్థుల జీవితాలను చీకట్లోకి నెడుతోందని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. విదేశీ గడ్డపై చదువుకుని, కుటుంబాలకు అండగా నిలవాలని ఎన్నో ఆశలతో వెళ్లిన సామాన్య, మధ్యతరగతి విద్యార్థుల పరిస్థితి నేడు చదువు కంటే.. 'రోజు ఎలా గడవాలి? మనుగడ ఎలా సాగించాలి?' అనే దైన్య స్థితికి చేరుకోవడం అత్యంత విచారకరమని పేర్కొన్నారు.

### భారంగా మారిన జీవన వ్యయం

రూపాయి బలహీనపడటంతో విదేశాల్లో జీవన వ్యయం భరించలేనంతగా పెరిగిపోయిందని పాండురంగా రెడ్డి వివరించారు. భారతదేశం నుండి తల్లిదండ్రులు పంపే డబ్బు అక్కడి కనీస అవసరాలకు కూడా ఏమాత్రం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యంత సంపన్న కుటుంబాల పిల్లలు మినహా, మిగిలిన సాధారణ విద్యార్థులంతా రోజువారీ బడ్జెట్ కోసం తీవ్రంగా పోరాడాల్సి వస్తోందని చెప్పారు.

### విద్యార్థుల దీన స్థితిపై కీలక అంశాలు:

ఒక పూట భోజనంతోనే సరి: ఖర్చులు తగ్గించుకోవడానికి విద్యార్థులు రోజుకు ఒక పూట మాత్రమే తింటూ, కొన్నిసార్లు అసలు భోజనాన్ని కూడా మానేస్తూ లంకణాలు ఉంటున్నారు.
**కిలోమీటర్ల నడక:** బస్సు, సబ్‌వే ఛార్జీలు కూడా భరించలేని స్థితిలో, నిత్యం కిలోమీటర్ల కొద్దీ కాలినడకన ప్రయాణిస్తూ విద్యార్థులు శారీరకంగా తీవ్ర అలసటకు గురవుతున్నారు.
**కఠిన శ్రమ:** కేవలం మనుగడ కోసం అధికారిక పాక్షిక కాలిక (పార్ట్-టైమ్) షిఫ్ట్‌లతో పాటు డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లు, రైల్వే స్టేషన్లలో ఫ్లోర్‌లు తుడవడం వంటి ఎంతో కష్టతరమైన పనులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### చదువుపై పడుతున్న ప్రభావం

ఆకలితో అలమటిస్తూ, కేవలం బతుకుదెరువు కోసమే నిరంతరం పోరాడుతున్న విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టడం సాధ్యం కాదని పాండురంగా రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ మానసిక, శారీరక ఒత్తిడి వారి ఆరోగ్యాన్ని క్షీణింపజేయడమే కాకుండా.. వారి విద్యా నైపుణ్యాలను, గ్రేడ్‌లను కూడా దారుణంగా దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ గర్వకారణంగా ఎదగాల్సిన యువత, విదేశాల్లో కనీస అవసరాల కోసం అల్లాడిపోవడం దేశానికే నష్టమని హెచ్చరించారు.

### ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలి

డాలర్‌తో రూపాయి పతనాన్ని కేవలం ఆర్థిక గణాంకాల కోణంలోనే చూడకుండా, దీని వెనుక ఉన్న మానవీయ కోణాన్ని, విద్యార్థుల దీన పరిస్థితులను గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యా రంగ నిపుణులు తక్షణమే స్పందించి ఈ సంక్షోభంపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. విదేశాల్లోని భారతీయ విద్యార్థులకు అవసరమైన ఆర్థిక వెసులుబాటు కల్పించాలని లేదా ప్రత్యేక స్కాలర్‌షిప్ మార్గాలను పరిశీలించి వారిని ఆదుకోవాలని కప్పాటి పాండురంగా రెడ్డి ప్రభుత్వాలను కోరారు.

## లక్ష రూపాయల విలువైన ఎల్‌ఓసిని అందజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్‌చెరు మే 27 భారత శక్తి** ఆపత్కాలంలో నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నగర్ కాలనీకి చెందిన నోముల నరసింహ గౌడ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్య చికిత్స కోసం స్థానిక శాసనసభ్యులు జిఎంఆర్ ద్వారా ఎల్ఓసి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన లక్ష రూపాయల విలువైన ఎల్ఓసిని బుధవారం సాయంత్రం పటాన్‌చెరు లోని తన కార్యాలయంలో నరసింహ గౌడ్ కుటుంబ సభ్యులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ కౌన్సిలర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# త్యాగానికి ప్రతీక.. 'బక్రీద్'

-ముస్లిం సోదరులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'ఈద్ ఉల్ అజ్హా' శుభాకాంక్షలు
- దైవచింతన, మానవత్వాల సమ్మేళనం ఈ పండుగ
- పేదలకు పంచిపెట్టడమే పరమార్థం: సీఎం ఆకాంక్ష

**భారత శక్తి, మే 27 హైదరాబాద్ :** అచంచలమైన దైవభక్తికి, నిరుపమాన త్యాగనిరతికి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచే పవిత్ర బక్రీద్ (ఈద్ ఉల్ అజ్హా) పండుగను పురస్కరించుకుని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని ముస్లిం సోదర, సోదరీమణులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. లోకకల్యాణార్థం, దైవ ఆజ్ఞను శిరసావహించడం కోసం ఎంతటి త్యాగానికైనా వెనుకాడబోమనే ఉదాత్తమైన చారిత్రక ఘట్టాన్ని స్మరిస్తూ జగమంతటా ముస్లిం సమాజం ఈ పండుగను ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటుందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తుచేశారు.

### మానవీయ విలువల సందేశం

బక్రీద్ అనేది కేవలం ఒక వేడుక మాత్రమే కాదని, అది మానవాళికి త్యాగం, దాతృత్వం, విశ్వాసం, మానవత్వం వంటి మహోన్నత జీవన విలువలను నేర్పుతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. జీవిత ప్రయాణంలో ఎలాంటి కష్టాలు, సవాళ్లు ఎదురైనప్పటికీ.. దేవుడిపై నమ్మకం కోల్పోకుండా, సన్మార్గంలో ముందుకు సాగాలనే గొప్ప ఆదర్శాన్ని ఈ పండుగ అందిస్తుందని వివరించారు.

### దాతృత్వంలోనే దైవత్వం

తమకు ఉన్నదానిలో కొంత భాగాన్నైనా పేదలకు, లేనివారికి ఆనందంగా పంచిపెట్టడం కన్నా గొప్ప దానం మరొకటి లేదని, సమాజంలో సమానత్వాన్ని, తోటివారిపై ప్రేమను చాటిచెప్పే అద్భుతమైన స్ఫూర్తి బక్రీద్ పండుగలో దాగి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్లాఘించారు. "కరుణ, త్యాగనిరతితో కూడిన ఈ పండుగ పవిత్ర వాతావరణం సమాజంలో శాంతిని, సౌభ్రాతృత్వాన్ని మరింత పెంపొందించాలి.

గంగా–జమునా తెహజీబ్‌కు నిలయమైన మన రాష్ట్రంలో ఈ పండుగ అందరి జీవితాల్లో సరికొత్త వెలుగులు, సుఖసంతోషాలు నింపాలి."
ఎ. రేవంత్ రెడ్డి,
ముఖ్యమంత్రి

### రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా ఏర్పాట్లు

పండుగను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా ముస్లిం సోదరులు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసింది. హైదరాబాద్‌లోని చారిత్రాత్మక మక్కా మసీదుతో పాటు ప్రార్థనా మందిరాల వద్ద గట్టి భద్రతను, వసతులను కల్పించారు.
శాంతిసౌఖ్యాల నడుమ పండుగను ఘనంగా జరుపుకోవాలని ప్రభుత్వం పిలుపునిచ్చింది.




## బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పారిజాత నర్సింహారెడ్డి



**హైదరాబాద్: మే 27,భారత శక్తి,**తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు, శాసనమండలి సభ్యుడు (ఎమ్మెల్సీ) బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని పలువురు కాంగ్రెస్ నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.మర్యాదపూర్వక భేటీబుధవారం మహేష్ కుమార్ గౌడ్ నివాసానికి వెళ్లిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. మహేష్ కుమార్ గౌడ్ సుదీర్ఘకాలం ప్రజాసేవలో కొనసాగాలని, పార్టీ బలోపేతానికి ఆయన అందిస్తున్న సేవలు అభినందనీయమని ఈ సందర్భంగా పారిజాత నర్సింహారెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్ర కాంగ్రెస్ రథసారథికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన వారిలో మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డితో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, ప్రస్తుత రాజకీయ అంశాలపై నాయకులు కొద్దిసేపు చర్చించారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy